బలగం TV
BALAGAM
నిజమే మా బలం..ప్రజలే మా బలగం
BALAGAM TV DIGTAL NEWS PAPER/ balagamtv100@gmail.com
హైదరాబాద్ శుక్రవారం, 15 మే-2026 balagamtv100@gmail.com పేజీలు-8

## చెన్నై ఎక్స్‌ప్రెస్‌లో సాంకేతిక లోపం



## ఉమ్మడి పీజీ ప్రవేశపరీక్ష షెడ్యూల్



# సింగరేణిలో మహిళా డంపర్ ఆపరేటర్ల నియామకం

- తొలిసారిగా భారీ డంపర్లను నడపనున్న మహిళా కార్మికులు
- మహిళా శక్తికి ప్రాధాన్యత ఇవ్వాలన్న ఆదేశంపై స్పందించిన సింగరేణి
- వివిధ క్లిష్టతర బాధ్యతల నిర్వహణపై మహిళలకు అవకాశాలు
- హెవీ మోటార్ వెహికిల్ శిక్షణను పూర్తి చేసిన 13 మంది మహిళా ఉద్యోగులు



హైదరాబాద్, మే 14: మహిళాభివృద్ధికి అధిక ప్రాధాన్యనిస్తున్న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సింగరేణి సంస్థలో కూడా మహిళా శక్తికి తగు ప్రాధాన్యతనిచ్చి ప్రోత్సహించాలని ఆదేశించడంతో సింగరేణి చరిత్రలో తొలిసారిగా భారీ డంపర్ల ఆపరేటర్లుగా కొందరు మహిళలకు కంపెనీ అవకాశం కల్పించేందుకు చర్యలు చేపట్టింది. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆదేశంపై సింగరేణి యాజమాన్యం మహిళా డంపర్ ఆపరేటర్ల నియామకానికి శ్రీకారం చుట్టింది. ఓపెన్ కాస్ట్ గనుల్లో బొగ్గు, ఓవర్ బర్డెన్ ను గని క్వారీ నుండి ఉపరితలానికి రవాణా చేయడానికి యాజమాన్యం 60 నుంచి 100 టన్నుల భారీ డంపర్లను వినియోగిస్తుంది. సింగరేణిలో గత 50 ఏళ్లుగా నిర్వహిస్తున్న ఓపెన్ కాస్ట్ గనుల్లో ఇప్పటివరకు కేవలం మగ ఆపరేటర్లు మాత్రమే ఈ భారీ డంపర్ లను నడుపుతూ వస్తున్నారు. ఎందుకంటే ఈ డంపర్లను నడపడం కొంత కష్టంతో పాటు శారీరక దృఢత్వం, డ్రైవింగ్ నైపుణ్యం అవసరమై ఉంటాయి, పైగా మండే ఎండల్లోనూ, భారీ వర్షాలు, తీవ్రమైన చలి పరిస్థితులను తట్టుకొని మూడు షిఫ్టుల్లో కూడా డంపర్లు నడపాల్సి ఉంటుంది. ఇంత కష్టతరమైన పనిని పురుష ఆపరేటర్లు మాత్రమే నిర్వహిస్తూ వస్తున్నారు. అయితే సింగరేణి సంస్థలో ఇటీవల మహిళా ఉద్యోగుల సంఖ్య క్రమంగా పెరుగుతూ వచ్చింది. మహిళా శక్తిని సద్వినియోగం చేసుకోవాలని, వారి నైపుణ్యాలను, శక్తి సామర్థ్యాలను కూడా వినియోగించడానికి మిగతా 3లో..

## నీట్-యూజీ 2026 రద్దు...
# మోడీ సర్కార్ ఫెయిల్

- మోడీ హయాంలోనే 93 పేపర్లు లీక్
- ఆందోళనలో రెండు కోట్ల మంది విద్యార్థులు
- కేంద్రం తీరుపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆగ్రహం



హైదరాబాద్, మే 14: నీట్-యూజీ 2026 రద్దు... మోడీ ప్రభుత్వ నియంతృత్వ... నిరంకుశ నిర్ణయమని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి విమర్శించారు. కేంద్ర ప్రభుత్వఏకపక్ష రద్దుతో యువత భవితవ్యంపై తీవ్ర ప్రభావం పడుతుందన్నారు. గతపదేండ్లుగా ప్రధాని మోడీ హయాంలో93పేపర్లు లీక్ అయ్యాయని ఆగ్రహంవ్యక్తం చేశారు. దీంతో రెండు కోట్ల మంది విద్యార్థులు ఆందోళన చెందుతు న్నారని అన్నారు. పేపర్ లీక్ జరిగితే కనీసం సంబంధిత మంత్రిపై ఎటువంటి చర్యలు తీసుకోలేదని ముఖ్యమంత్రి విమర్శించారు. నీట్ రద్దు.. దేశ ప్రజలను తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిన పెద్ద నోట్ల రద్దు వంటిదేనని అన్నారు. కేంద్ర ప్రభుత్వ అనాలోచిత, నిర్లక్ష్య పూరితమైన ఈ నిర్ణయం దేశ యువత భవిష్యత్తును ప్రశ్నార్థకం చేసిందన్నారు. వ్యవస్థీకృతంగా పేపర్ లీక్‌లు, ప్రభుత్వ వైఫల్యాలు దేశ యువతను తీవ్ర అనిశ్చితి, నిరాశలోకి నెట్టాయని చెప్పారు. తీవ్ర ఒత్తిడిలో సంవత్సరాల తరబడి కష్టపడి చదువుకున్న విద్యార్థుల కలలు మోడీ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ప్రస్తుతం కల్లలయ్యాయని మిగతా 3లో..

## పీఎంజే జ్యువెలరీ షాపు దోపిడీ కేసు



- కేసును ఛేదించిన కరీంనగర్ పోలీసులు
- సుబోధ్ గ్యాంగ్ పనిగా గుర్తించి అరెస్ట్
- మీడియా ముందుకు ముగ్గురు దోపిడీ దొంగలు
- రెక్కీ నిర్వహించి దోపిడీకి పాల్పడ్డట్లు ఎస్పీ వివరణ

వివరాలు 2లో..

## హైదరాబాద్‌లో మరోమారు భారీగా డ్రగ్స్ పట్టివేత




- డ్రగ్స్ తరలిస్తున్న ఇద్దరి పట్టివేత

హైదరాబాద్,మే14 : నగరంలో మరోసారి భారీగా డ్రగ్స్ పట్టుబడింది. సూరారం- కొంపల్లి హైటెన్షన్ రోడ్‌లో డ్రగ్స్ తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను ఎక్సైజ్ ఎస్టీఎఫ్‌బీ అధికారులు అరెస్ట్ చేశారు. ఇన్నోవా కారులో డ్రగ్స్ తరలిస్తున్నారన్న పక్కా సమాచారంతో కారు ఆపిన అధికారులు.. తనిఖీలు చేపట్టగా డ్రగ్స్ బయటపడింది. నిందితులు నుంచి మూడు గ్రాములు ఎండీఎంఏ, 36 గ్రాముల ఓజీ కుష్, 7 గ్రాముల చరస్ డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన డ్రగ్స్ విలువ రూ.2.58 లక్షలు ఉంటుందని అంచనా.బడా బాబుల పిల్లలే టార్గెట్‌గా డ్రగ్స్ అమ్మకాలు జరిపి.. నిందితులు భారీగా సొమ్ము చేసుకుంటు న్నట్లు ఎస్టీఎఫ్‌బీ అధికారులు తెలిపారు. డ్రగ్స్‌ను బెంగళూరు నుంచి కొనుగోలు చేసి హైదరాబాద్‌లో విక్రయిస్తున్నట్లు గుర్తించారు. డ్రగ్స్‌తో పాటు కారును సీజ్ చేశారు. డ్రగ్స్‌ను ఎవరి మిగతా 3లో..

## చివరిగింజ వరకు కొంటాం



- రైతులకు మంత్రి ఉత్తమ్ హామీ
- పొంగులేటితో కలసి పాలేరు ధాన్యం కనుగోళ్లు పరిశీలన

ఖమ్మం,మే14 : రాష్ట్రంలో రైతులు పండించిన ధాన్యం చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని తెలంగాణ పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ విషయంలో వరి రైతులు ఎవరూ అధైర్య పడవద్దని భరోసా కల్పించారు. గురువారం కూసుమంచి మండలం పాలేరులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి పరిశీలించారు. మిగతా 3లో..

## బండి భగీరథ్ బెయిల్ పిటిషన్ విచారణ



- వారం రోజులకు వాయిదా వేసిన కోర్టు
- బెయిల్‌పై నేడు తీర్పు ఇవ్వనున్న హైకోర్టు

మిగతా 3లో..

## ధాన్యం సేకరణలో ఇన్ని ఇబ్బందులా

- గతంలో లేని సమస్యలు ఇప్పడే ఎందుకు
- ప్రభుత్వ తీరుపై మండిపడ్డ మాజీమంత్రి కొప్పుల

వివరాలు 2లో..

## పొదుపు చర్యలకు దిగిన ఢిల్లీ ప్రభుత్వం



- వారానికి రెండు రోజులు వర్క్ ఫ్రమ్ హోమ్
- వారానికి ఒకరోజు నో వెహికిల్ డే
- సిఎం రేఖాగుప్తా పలు నిర్ణయాలు ప్రకటన

మిగతా 3లో..

## ఢిల్లీలో మరో నిర్భయ ఘటన

- వివాహితపై డ్రైవర్, కండక్టర్ అత్యాచారం



న్యూఢిల్లీ,మే14 : రాజధాని ఢిల్లీ మరోమారు నిర్భయ లాంటి ఘటన చోటుచేసుకుంది. తాజాగా షాకింగ్ ఘటన వెలుగులోకి వచ్చింది. బస్సు డ్రైవర్, కండక్టర్ తనపై అత్యాచారం చేశారని ఒక వివాహిత ఆరోపించారు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితులను అరెస్టు చేశారు. నగరంలోని రాణీబాగ్ ప్రాంతంలో సోమవారం రాత్రి ఈ దారుణం జరిగింది. బాధితురాలిఫిర్యాదు ప్రకారం, ఆమె మంగోల్‌పురిలోని ఒక ఫ్యాక్టరీలో పనిచేస్తు న్నారు. పీతమ్‌పురాలో నివస్తున్నారు. ఆమె కు ముగ్గురు పిల్లలు. కాగా, సోమవారం రాత్రి విధులు ముగించుకున్న ఆమె తిరిగివస్తుండగా సరస్వతీ విహార్ వద్ద ఒక స్లీపర్ బస్సు వచ్చి ఆగింది. బస్సు డోర్ వద్ద నిలబడి ఉన్నవ్యక్తి మొదట బాధితురాలిని టైమ్ అడిగి ఆ తరువాత బలవంతంగా బ స్సులోకి ఎక్కించాడు.బస్సును నాంగ్లోయి ప్రాంతానికి తీసుకెళ్లి అక్కడి నిందితులు అఘాయిత్యానికి ఒడిగట్టారు. బాధితురాలికి వైద్య పరీక్షల అనంతరం పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేసుకుని నిందితులను అరెస్టు చేశారు. కేసుపై దర్యాప్తు ప్రారంభించారు.

## అత్యుత్తమ మార్కులు సాధించిన బిసి విద్యార్థులు

- ప్రతిభా పురస్కారాలు అందచేసిన మంత్రులు



హైదరాబాద్, మే 14: బంజారాహిల్స్ కొమురంభీం భవన్ లో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బీసీ గురుకులాలు సంక్షేమ హాస్టళ్లలో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేసారు. ముఖ్య అతిథిగా హాజరైన మంత్రులు పొన్నం ప్రభాకర్,వాకిటి శ్రీహరిలు వీటిని అందించారు.కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావు , బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ , బీసీ డెడికేషన్ కమిషన్ చైర్మన్ బి. వెంకటేశ్వర్లు, రాజ్య సభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, బీసీ సంక్షేమ శాఖ సెక్రటరీ బాలమయాదేవి , ఎంజేపి సెక్రటరీ సైదులు, బీసీ కమిషన్ సభ్యులు,బీసీ సంక్షేమ శాఖ అధికారులు పాల్గొ న్నారు. ఈ సందర్భంగా మంత్రి వాకిటి మాట్లాడుతూ.. విద్య వినయాన్ని ఇస్తుంది, వినయం వ్యక్తిని గొప్పవాడిని చేస్తుందని ప్రతి ఒక్కరూ గ్రహించాలన్నారు. విద్య ప్రపంచాన్ని మార్చడమే కాకుండా, బానిసత్వం నుంచి బయటకు తీసుకు వస్తుందని నెల్సన్ మండేలా, మహాత్మా జ్యోతిరావు పూలే లు చెప్పారని గుర్తుచేశారు. తెలంగాణ రైజింగ్ లో ప్రతి విద్యార్థి భాగం కావాలి.విద్య ఎవరి సొత్తు కాదు, సరస్వతీ దేవికి రంగు, రూపు తేడా ఉండదు. విద్యపై మనం చూపే ఏకాగ్రతే మనల్ని ముందుకు నడిపిస్తుంది. గురుకులాల్లో అన్ని వసతులు కల్పిస్తున్నాం కనుక 100శాతం ఉత్తీర్ణత సాధించాలి.అన్ని రంగాల్లో బీసీలు ముందుండాలి. 100 సంవత్సరాలుగా చేయని కులగణన ను ప్రజా ప్రభుత్వం చేసింది. విద్యలో ఒత్తిడి ఉండొద్దని 25 వేల మంది టీచర్లకు బదిలీలు, ప్రమోషన్లు ఇచ్చాం. అవకాశాన్ని సృష్టించుకున్నవాళ్లే సమర్ధులు అవుతారు.రాజకీయాలు అనగానే ఒక ధోరణి ని విడనాడాలి. మిగతా 3లో..

## మరోమారు తెరపైకి ఫార్ములా కేసు



- కెటిఆర్ తదితరులకు ఎసిబి నోటీసులు
- జూలై 31న విచారనకు రావాలని ఆదేశాలు

మిగతా 2లో..

## కెటిఆర్‌తో ఆస్ట్రేలియా హైకమిషన్ భేటీ

- కీలక అంశాలపై ఇరు నేతల చర్చలు



హైదరాబాద్,మే14 :మాజీ మంత్రి కల్వకుంట్ల తారకరామారావుని భారతదేశంలోని ఆస్ట్రేలియా హైకమిషనర్ ఫిలిప్ గ్రీన్ కలిశారు. నందినగర్ నివాసంలో జరిగిన ఉన్నత స్థాయి భేటీలో పలు కీలక అంశాలపై చర్చించారు. ఆస్ట్రేలియా హైకమిషనర్ ఫిలిప్ గ్రీన్, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల కాన్సుల్ జనరల్ హిల్లరీ మెక్‌గీచీతో సమావేశం అయ్యారు. పరస్పర ప్రయోజనాలు, వ్యూహాత్మక అంశాలపై విస్తృతంగా చర్చించారు. తెలుగు రాష్ట్రాల్లో ఆస్ట్రేలియా పెట్టుబడులకు ఉన్న అవకాశాలు, సాంకేతిక రంగంలో పరస్పర సహకారం, విద్యారంగంలో నూతన భాగస్వామ్యాల గురించి ప్రస్తావించారు. మిగతా 3లో..

# భద్రాద్రిని దర్శించుకున్న తుమ్మల

## ఆలయ అభివృద్ధికి ప్రత్యేక చొరవ



భద్రాద్రి కొత్తగూడెం,మే14 : భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారిని తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దర్శించుకున్నారు. గురువారం ఉదయం ఆలయానికి చేరుకున్న మంత్రికి ఆలయ అర్చకులు పూర్ణ కుంభంతో ప్రత్యేక స్వాగతం పలికారు. శ్రీ సీతారామచంద్ర స్వామికి మంత్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తుమ్మల నాగేశ్వరరావు మంత్రిగా తొలిసారి ఎన్టీఆర్ క్యాబినెట్‌లో ప్రమాణ స్వీకారం చేసి నేటికి నలభై ఏళ్ళు పూర్తి అయ్యాయి. 1986 మే 14 తేదీన తుమ్మల మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. దర్శనానంతరం తుమ్మల మీడియాతో మాట్లాడుతూ.. శ్రీరాముడు అంటే భద్రాచలం అనేలా భక్త రామదాసు రామాలయం పునఃనిర్మాణం చేశారన్నారు. పూజ్యులు ఎన్టీఆర్ పాలనలో భద్రాచలం రామాలయం అభివృద్ధి చేసే భాగ్యం దక్కిందని తెలిపారు. రూ.351 కోట్లతో రామాలయం పునరాభివృద్ధి పనులకు సీఎం రేవంత్ రెడ్డి భూమి పూజ చేశారన్నారు. నలభై ఏళ్ల రాజకీయ ప్రస్థానంలో భద్రాద్రి రాముని ఆశీస్సులు ఎప్పుడూ ఉన్నాయన్నారు. భద్రాచలం ప్రాంతం నుంచి తన రాజకీయ ప్రస్థానం ప్రారంభించినట్లు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు.

# ఉమ్మడి పీజీ ప్రవేశపరీక్ష షెడ్యూల్



## నేటినుంచి దరఖాస్తుల స్వీకరణ

హైదరాబాద్,మే14 : ఉమ్మడి పీజీ ప్రవేశపరీక్ష (సీపీగెట్)కు ఈ నెల 15 నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం కానుంది. రాష్ట్రంలోని 7 విశ్వవిద్యాలయాలతోపాటు జేఎన్‌టీయూహెచ్, కొత్తగూడెం ఎర్త్‌సైన్సెస్ వర్సిటీల్లో పీజీ సైన్స్ కోర్సుల్లో సీట్ల భర్తీకి నిర్వహించనున్న సీపీగెట్ షెడ్యూల్‌ను రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆచార్య వి.బాలకిష్టారెడ్డి, వర్సిటీల వైస్ ఛాన్సలర్లు(వీసీలు), కన్వీనర్ తదితరులు విడుదల చేశారు. తొలిసారి సీపీగెట్‌ను తమ వర్సిటీ నిర్వహిస్తోందని కాకతీయ విశ్వవిద్యాలయం వీసీ ఆచార్య ప్రతాప్‌రెడ్డి అన్నారు. ఈసారి ఇంటర్ విద్యార్హతతో ప్రవేశాలు పొందే ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ కోర్సుల్లో సీట్ల భర్తీ సీపీగెట్ ద్వారా ఉండదని, వాటిని దోస్త్‌లో చేర్చినట్లు తెలిపారు. కన్వీనర్ ఆచార్య రాజేందర్ మాట్లాడుతూ మొత్తం 45 సబ్జెక్టులకు పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ఆలస్య రుసుం లేకుండా జూన్ 10 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. రూ.2 వేల ఆలస్య రుసుంతో 18 వరకు అవకాశం ఉంటుంది. జులై తొలివారంలో ఆన్‌లైన్ పరీక్షలు నిర్వహిస్తారు. ఆగస్టు మొదటివారంలో తరగతుల ప్రారంభం. విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా ఉన్న ఆచార్యుల పోస్టుల భర్తీకి మార్గదర్శకాలతో 2025 ఏప్రిల్‌లో ప్రభుత్వం జీవో జారీచేసినా.. ఇంకా ఏ వర్సిటీ ఎన్ని ఖాళీలను భర్తీ చేసుకోవాలన్నది స్పష్టత ఇవ్వలేదని ప్రతాప్‌రెడ్డి ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. తగినంత మంది ఆచార్యులు లేకపోవడం వల్ల పరిశోధన కొంత తగ్గిందన్నారు. బాలకిష్టారెడ్డి మాట్లాడుతూ నియామకాల్లో కొంత ఆలస్యమైన విషయం వాస్తవమేనని, ప్రభుత్వంతో సంప్రదిస్తున్నామని తెలిపారు.

# మరోమారు తెరపైకి ఫార్ములా కేసు

- కెటిఆర్ తదితరులకు ఎసిబి నోటీసులు
- జూలై 31న విచారనకు రావాలని ఆదేశాలు



హైదరాబాద్,మే14 : తెలంగాణలో సంచలనం రేపిన ఫార్ములా–ఈ రేస్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో పాటు పలువురు కీలక అధికారులకు ఏసీబీ ప్రత్యేక కోర్టు సమన్లు జారీ చేసింది. జూలై 31వ తేదీన విచారణకు వ్యక్తిగతంగా హాజరు కావాలని కోర్టు ఆదేశాలు జారీ చేయడంతో రాష్ట్ర రాజకీయాల్లో మరోసారి నోటీసులు జారీ చేసింది. ఫార్ములా ఈ–కార్ రేసు కేసులో మాజీ మంత్రి కేటీఆర్‌కు ఏసీబీ కోర్టు సమన్లు జారీ చేసింది. ఆయనతో పాటు ఏ2గా ఉన్న ఐఏఎస్ అధికారి అర్వింద్‌కుమార్, ఏ3 హెచ్ఎండీఏ మాజీ చీఫ్ ఇంజినీర్ బీఎల్ఎన్ రెడ్డి, ఏ4 స్పోర్ట్స్ కన్‌స్టలెంట్ కిరణ్ మల్లేశ్వర్‌రావుకు సమన్లు జారీ అయ్యాయి. జులై 31న విచారణకు రావాలని కోర్టు ఆదేశించింది. 2023లో నిర్వహించిన ఫార్ములా ఈ–కార్ రేసు కేసులో నిబంధనలకు విరుద్ధంగా విదేశీ సంస్థకు రూ.55 కోట్లు మళ్లించినట్లు ఏసీబీ అభియోగపత్రంలో పేర్కొంది. ఇప్పటికే ఈ కేసులో కేటీఆర్, అర్వింద్ కుమార్, బీఎల్ఎన్ రెడ్డిలతో సహా ఎఫ్ఈఓ సంస్థ ప్రతినిధులను ప్రశ్నించింది. ఫార్ములా–ఈ కారు రేసు నిర్వహణలో జరిగిన అక్రమాలపై ఏసీబీ ఇప్పటికే లోతైన దర్యాప్తు జరిపి అభియోగపత్రాన్ని దాఖలు చేసింది. ఈ కేసులో ఏ1గా కేటీఆర్, ఏ2గా మాజీ అధికారి అరవింద్ కుమార్, ఏ3గా బీఎల్ఎన్ రెడ్డిలను ఏసీబీ పేర్కొంది. వీరితో పాటు ఏ4గా స్పోర్ట్స్ కన్‌స్టలెంట్ కిరణ్ మల్లేశ్వర్ రావు, ఏ5గా ఎఫ్ఈఓ సంస్థపై కేసులు నమోదయ్యాయి. 2023లో హైదరాబాద్‌లో నిర్వహించిన ఫార్ములా–ఈ రేసు కోసం నిబంధనలకు విరుద్ధంగా విదేశీ సంస్థకు నిధులు మళ్లించారన్నదే ప్రధాన అభియోగం. హెచ్ఎండీఏ ఖాతా నుంచి సుమారు 55 కోట్ల రూపాయలను ఎఫ్ఈఓ సంస్థకు బదిలీ చేసినట్లు ఏసీబీ ప్రాథమికంగా గుర్తించింది. ముందస్తు అనుమతులు లేకుండానే ఇంత భారీ మొత్తాన్ని విదేశీ సంస్థకు ఎలా చెల్లించారన్న కోణంలో దర్యాప్తు కొనసాగుతోంది. ఇప్పటికే ఈ కేసులో కేటీఆర్, అరవింద్ కుమార్ సహా పలువురు ప్రతినిధులను ఏసీబీ అధికారులు ప్రశ్నించారు. తాజాగా ఏసీబీ కోర్టు ఈ కేసును విచారణకు స్వీకరించి సమన్లు జారీ చేయడంతో.. జూలై 31న కోర్టులో ఏం జరగబోతుందనేది ఇప్పుడు సర్వత్రా ఉత్కంఠ రేపుతోంది.

# ధాన్యం సేకరణలో ఇన్ని ఇబ్బందులా

- గతంలో లేని సమస్యలు ఇప్పడే ఎందుకు
- ప్రభుత్వ తీరుపై మండిపడ్డ మాజీమంత్రి కొప్పల



పెద్దపల్లి,మే14 : కాంగ్రెస్ ప్రభుత్వం అసమర్ధత పాలన వల్ల రాష్ట్రంలోని రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. ధాన్యం కొనుగోళ్లలో గతంలో లేని ఇబ్బందులు ఇప్పుడే ఎందుకని ప్రశ్నించారు. పెగడపల్లి మండలంకీచులాటపల్లి గ్రామంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వంలోలేని ఇబ్బందులు రేవంత్ పాలనలో ఎం దుకు వస్తున్నాయని ప్రశ్నించారు. కేసీఆర్ యకత్వం లో నీళ్లు, 24 గంటల కరెంట్, పంట పెట్టుబడి, ఎరువులు సకాలంలో అందించారని గుర్తు చేశారు. కాంగ్రెస్ వచ్చాక అంతా ఆగిపోయిందని విమర్శిం చారు. ప్రభుత్వంసక్రమంగా, సకాలంలోధాన్యం కొను గోలు చేయకపోవడంతో ధాన్యం పంట కళ్లాలోనే కుప్పల, తెప్పలుగా పోసి ఉంటున్నాయని, వర్షాల భయంతో రైతులు అరచేతుల్లో ప్రాణం పెట్టుకుని లారీల కోసం ఎదురుచూపు చూస్తున్నారని తెలిపారు. అంతేగాక బస్తాకు 3.2 కేజీ కటింగ్ చేస్తున్నారని ఆరోపించారు. ధర్మపురి నియోజకవర్గ మంత్రి, కలెక్టర్, కాంగ్రెస్ నాయకులకు రైతుల పట్ల పట్టింపు లేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాన్ని అవలంభిస్తున్నదని ఆరోపించా రు. ఎన్నికల్లో రైతు డిక్లరేషన్ పేరుతో 36 హామీలు ఇచ్చి ఒక్కటి కూడా అమలు చేయలేదని ఆయన గుర్తు చేశారు .

# పీఎంజే జ్యువెలరీ షాపు దోపిడీ కేసు


- కేసును ఛేదించిన కరీంనగర్ పోలీసులు
- సుబోధ్ గ్యాంగ్ పనిగా గుర్తించి అరెస్ట్
- మీడియా ముందుకు ముగ్గురు దోపిడీ దొంగలు
- రెక్కీ నిర్వహించి దోపిడీకి పాల్పడ్డట్లు ఎస్పీ వివరణ




కరీంనగర్,మే14 : కరీంనగర్ పట్టణంలోని పీఎంజే జ్యువెలరీ షాపులో కాల్పులు జరిపి.. నగలు దోపిడీకి పాల్పడింది సుభోద్ సింగ్ గ్యాంగ్ అని కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం తెలిపారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు రఘునాథ్ కర్మాకర్ అలియాస్ జరిగాసింగ్ అని చెప్పారు. గురువారం కరీంనగర్‌లో పోలీస్ కమిషనర్ కార్యాలయంలో సీపీ గౌస్ ఆలం విలేకర్లతో మాట్లాడుతూ ఈ దోపిడీకి సంబంధించిన వివరాలను వెల్లడించారు. మొత్తం 161.4 తులాల బంగారు ఆభరణాలను ఈ గ్యాంగ్ దొంగతనం చేసిందని వివరించారు. మొత్తం వీటి విలువ రూ. 82 లక్షలు ఉంటుందన్నారు. బిహార్‌కు చెందిన సుభోద్ గ్యాంగ్‌కి.. గోల్డెన్ తీఫ్‌గా పేరుందని గుర్తు చేశారు. పీఎంజే జ్యువెలరీ షాపులో ముందుగా రెక్కీ నిర్వహించి.. అనంతరం ఈ దోపిడీని ఈ గ్యాంగ్ చేసిందన్నారు. జార్ఖండ్, పశ్చిమ బెంగాల్ సరిహద్దుల్లోని మెహతాబ్ వద్ద ఈ ముఠా సెల్ ఫోన్, సిమ్స్ కొనుగోలు చేసినట్లు తమ విచారణలో వెల్లడైందన్నారు. ఖమ్మం, సిద్ధిపేట, పెద్దపల్లి, కరీం నగర్‌లలో బంగారు షాపులపై ఈ గ్యాంగ్ రెక్కీ నిర్వహించిందని చెప్పారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు జాగీరా సింగ్ సహా ప్రద్యుమన్, మెహతాబ్ ఖాన్‌లను అరెస్ట్ చేశామని సీపీ తెలిపారు. వీరు నకిలీ ఆధార్, నకిలీ బైక్ నెంబర్లు, నకిలీ పేర్లతో తిరుగుతూ ఈ దోపిడీలకు పాల్పడతారని సీపీ గౌస్ ఆలం వివరించారు. రెండు నెలల ముందు ఈ గ్యాంగ్ తెలంగాణకు వచ్చిందని సీపీ గౌస్ ఆలం వివరించారు. ముగ్గురు నిందితులను పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం మీడియాకు చూపించారు. నిందితులను 12 రోజుల పాటు దోపిడీ దొంగల కేసులో పోలీసులు ఆపరేషన్ నిర్వహించారు. బంగారం దోపిడీ కేసులో సుబోధ్ సింగ్ ప్రధాన నిందితుడు అని పోలీసులు తెలిపారు. దోపిడీ తర్వాత రైలు, బస్సు ద్వారా తప్పించుకునేందకు ప్రయత్నించారు. దోపిడీకి రెండు నెలల క్రితమే రెక్కీ నిర్వహించారని పేర్కొన్నారు. ఈ గ్యాంగ్‌పై పలు రాష్ట్రాల్లో కేసులు ఉన్నాయి. బీహార్, పశ్చిమ బెంగాల్ ఝార్ఖండ్ రాష్ట్రాల్లో సుబోధ్ సింగ్ ముఠా చోరీలకు పాల్పడిందన్నారు. చాకచక్యంగా నిందితులను పట్టుకున్న పోలీసులను సీపీ అభినందించారు. పిస్టల్స్‌తో వచ్చిన ఐదుగురు దొంగలు.. సిబ్బందిపై కాల్పులు జరిపి సుమారు కిలోన్నరకుపైగా బంగారం ఎత్తుకెళ్లారు. దొంగలు జరిపిన కాల్పుల్లో షాపు సేల్స్ మేనేజర్ ముస్తాక్ అలీతో పాటు సిబ్బంది కమల్, మధుకర్, సెక్యూరిటీ గార్డు రాజేశ్ తీవ్రంగా గాయపడ్డారు. షాపులోకి ఎంటరైన ఐదు నిమిషాల్లోనే పని ముగించుకున్న దొంగలు.. బయటికి పరుగెత్తి పల్సర్, అపాచీ బైక్‌లపై పరారయ్యారు. సమాచారం అందుకున్న పోలీసులు పది నిమిషాల్లోనే సంఘటన స్థలానికి చేరుకున్నారు. గాయపడిన సిబ్బందిని ఆస్పత్రికి తరలించారు. సీసీ ఫుటేజీల ఆధారంగా దర్యాప్తు చేపట్టారు. ఎంపీ బండి సంజయ్ ఆఫీస్, జిల్లా జడ్జి ఇంటికి సమీపంలోనే సినీ ఫక్కీలో భారీ చోరీ జరగడంతో తీవ్ర కలకలం రేగింది.

# బండి భగీరథ్ బెయిల్ పిటిషన్ విచారణ

- వారం రోజులకు వాయిదా వేసిన కోర్టు
- బెయిల్‌పై నేడు తీర్పు ఇవ్వనున్న హైకోర్టు



హైదరాబాద్, మే 14: బండి భగీరథ్ ముందస్తు బెయిల్ పిషటన్‌పై విచారణనను హైకోర్టు వెకేషన్ బెంచ్ వారం రోజులకు వాయిదా వేసింది. నిందితుడు బండి సాయి భగీరథ్ తరపు న్యాయవాది హైకోర్టులో ముందస్తు బెయిల్ పిటిషన్ దాఖలు చేయగా.. హైకోర్టు విచారణ వారం రోజులు వాయిదా వేసింది. భగీరథ్ దాఖలు చేసిన ముందస్తు, మధ్యంతర బెయిల్ పిటిషన్లపై తెలంగాణ హైకోర్టులో గురువారం సుదీర్ఘ విచారణ జరిగింది. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయస్థానం, మధ్యంతర బెయిల్‌పై నిర్ణయాన్ని శుక్రవారానికి వాయిదా వేయగా, ముందస్తు బెయిల్ పిటిషన్‌పై విచారణను వారం రోజుల పాటు వాయిదా వేసింది. విచారణ సందర్భంగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ కీలక అంశాలను లేవనెత్తారు. కరీంనగర్‌లో బాధితురాలిపై తప్పుడు కేసు నమోదు చేశారని కోర్టుకు తెలిపారు. బాధితురాలి తల్లి పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లిన సమయంలో, కరీంనగర్ పోలీసులకు సమాచారం ఇచ్చి కేసు నమోదు చేశారని వివరించారు. నిందితుడు కేంద్ర మంత్రి కుమారుడు కావడంతో ఈ కేసులో సాక్ష్యాధారాలను ప్రభావితం చేసే అవకాశం ఉందని పీపీ వాదించారు. అయితే, దీనిపై స్పందించిన హైకోర్టు.. 'ప్రతిసారీ నిందితుడు కేంద్ర మంత్రి కుమారుడని పదే పదే చెప్పాల్సిన అవసరం లేదు' అని వ్యాఖ్యానించింది. భగీరథ్ తరపున అడ్వకేట్ కృష్ణకాంత్ తన వాదనలు వినిపిస్తూ.. ఈ కేసులో భగీరథ్‌పై 'పోక్సో' చట్టం వర్తించదని, ఇందుకు సంబంధించి పూర్తి ఆధారాలను కోర్టుకు సమర్పించామని తెలిపారు. యువతి మైనర్ అనే నెపంతో విచారణకు వెళ్లే సమయంలో భగీరథ్‌ను అరెస్ట్ చేసే అవకాశం ఉందని, అందుకే బెయిల్ పిటిషన్ దాఖలు చేసినట్లు పేర్కొన్నారు. 'బండి సంజయ్ కుమారుడు కావడంతోనే నిరాధారంగా పోక్సో చట్టాన్ని ప్రయోగించారు. సోషల్ మీడియాలో అసత్య ప్రచారం చేస్తూ పొలిటికల్ ట్రయల్స్ నిర్వహిస్తున్నారు. నిందితుడిని సామాన్యుడిలాగే పరిగణించి న్యాయం చేయాలి' అని ఆయన కోరారు. ఇక, తమ వాదనలు వినిపించడానికి సమయం కావాలని బాధితురాలి తరపు న్యాయవాది కోరడంతో, కోర్టు శుక్రవారం మధ్యంతర బెయిల్‌పై తుది నిర్ణయం తీసుకుంటామని వెల్లడించింది. కాగా, ముందస్తు బెయిల్ రావడానికి వారం సమయం పట్టేలా ఉండటంతో, ఆ వారం లోపు అరెస్టు కాకుండా ఉండేందుకు బండి భగీరథ్ న్యాయవాది మధ్యంతర బెయిల్ కోరారు. దీనిపై నేడు కోర్టు ఇచ్చే ఆదేశాలు బండి భగీరథ్‌కు కీలకం కానున్నాయి. బండి సాయి భగీరథ్ ఇంటరిమ్ ప్రొటెక్షన్ (మధ్యంతర రక్షణ)పై విచారణను వాయిదా వేస్తున్నట్టు హైకోర్టు తెలిపింది. బాలికపై లైంగిక దాడి, ఇతర నేరారోపణల నేపథ్యంలో కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి సాయి భగీరథ్‌పై పోక్సో కేసు నమోదైన విషయం తెలిసిందే. బండి సాయి భగీరథ్ కోసం గాలింపు చర్యలు మొదలు పెట్టిన పేట్ బషీరాబాద్ పోలీసులు మంగళవారం కరీంనగర్‌కు వెళ్లి, విచారణ నిమిత్తం భగీరథ్‌ను వెంట తీసుకొని బుధవారం మధ్యాహ్నం 2గంటలకు పేట్ బషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌లో హాజరుకావాలని అతడి మేనమామ వంశీకృష్ణకు నోటీసులు కూడా అందజేశారు. అయితే బుధవారం మధ్యాహ్నం విచారణకు పోలీసులు సిద్ధంగా ఉన్నా నిందితుడు మాత్రం హాజరుకాకుండా దుమ్మాకొట్టాడు. పైగా వ్యక్తిగత కారణాలతో తాను ఈ రోజు విచారణకు హాజరుకాలేక పోతున్నానని, పూర్తి ఆధారాలతో ఈ నెల 15న హాజరై పోలీసులకు సహకరిస్తానని, రెండు రోజుల గడువు ఇవ్వాలంటూ పోలీసులకు పంపిన ఈ–మెయిల్‌లో పేర్కొన్నాడు. ఇప్పుడు హైకోర్టు బెయిల్ పిటిషన్పై విచారణ వాయిదా వేయడంతో 15న విచారణకు హాజరవుతాడా లేదా అన్న అనుమానం ఉంది.

# 40 అంశాలకు క్యాబినెట్ ఆమోదం

- రూ.2లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టే 25 ప్రాజెక్టులకు ఓకే
- ఎనర్జీ, గ్రీన్ హైడ్రోజన్, భారీ సోలార్ ప్రాజెక్టులకు అనుమతి
- ఎపి కేబినేట్‌లో కీలక నిర్ణయాలు



అమరావతి,మే14 : ఏపీ సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన క్యాబినెట్ భేటీలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. 40కి పైగా అజెండా అంశాలకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. రూ.2లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టే 25 ప్రాజెక్టులతో పాటు ఉద్యోగాల కల్పనపై కీలక ప్రాజెక్టుల ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. శుద్ధ ఇంధనం, ఎనర్జీ, గ్రీన్ హైడ్రోజన్, భారీ సోలార్ ప్రాజెక్టులు, పంప్డ్ స్టోరేజ్, బయోగ్యాస్ యూనిట్ల ఏర్పాటుకు అనుమతి ఇచ్చింది. శుద్ధ ఇంధన రంగంలో ఏపీని అగ్రస్థానంలో నిలిపేలా క్యాబినెట్ చర్యలు తీసుకుంది. ప్రకాశం, రాయలసీమజిల్లాల్లో ఇంటిగ్రేటెడ్ హార్టికల్చర్ ప్రణాళికకుఆమోదం తెలిపింది. డేటా సెంటర్లు, ఆటో మొబైల్,సిమెంట్, ఫుడ్‌ప్రాసెసింగ్ రంగాల్లో పెట్టుబడులఆమోదంపై చర్చించింది. కర్నూలు విమానాశ్రయం పీపీపీ మోడల్‌లో అభివృద్ధి ప్రతి పాదన చర్చకు వచ్చింది.వివిధ సంస్థలకుభూముల కేటాయింపులపై క్యాబినెట్ నిర్ణయం తీసు కుంది. ఎంఎస్ఎంఈలకు నిధుల సౌలభ్యానికి ప్రత్యే క ఏర్పాటుపై చర్చించింది.సాగునీటి కాల్వలవిస్తరణ,రోడ్లు, పరిశ్రమలకు మౌలిక సదుపా యాలపై మంత్రి వర్గం లోచర్చ జరిగింది. ఇకపోతే మంత్రివర్గ సమావేశానికి వివిధ శాఖల కార్య దర్శులు సకాలంలో రాకపోవడంపై సీఎం చంద్ర బాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంధన పొదుపుపై మొదటి అజెండాగా చర్చిద్దామని మంగళవారమే సీఎం చెప్పారు. సమావేశంలో అధికారులు లేకపో వడంపై సీఎం ప్రత్యేక ప్రధాన కార్యదర్శి విజయా నంద్‌ను చంద్రబాబు ప్రశ్నించారు. సమాచారం సరిగా ఇవ్వలేదా అని సీఎం ప్రశ్నించగా.. ఇచ్చి నట్లు విజయానంద్ సమాధానమిచ్చారు. సమ యానికి రాని అధికారులపై చర్యలు తీసుకోవాలని చంద్రబాబు ఆదేశించారు. అజెండా అంశాలు ముగిశాక తాజా పరిణామాలపై మంత్రులతో సీఎం చర్చించారు.

# చక్కెర ఎగుమతులపై కేంద్రం కీలక నిర్ణయం

- ఎగుమతులను నిషేధిస్తూ ఉత్తర్వులు

న్యూఢిల్లీ,మే14 : పంచదార ఎగుమతులపై కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ ఎగుమతులను తక్షణం నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. దేశీయంగా చక్కెర ధరలు పెరగకుండా, సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు కేంద్రం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వశాఖ పరిధిలోని విదేశీ వాణిజ్య డైరెక్టరేట్ జనరల్ ఈమేరకు ఉత్తర్వులు జారీ చేసింది. దీని ప్రకారం.. ముడి, తెల్ల, శుద్ధి చేసిన చక్కెరలకు ఈ నిషేధం వర్తిస్తుందని స్పష్టంచేసింది. ఈ ఏడాది సెప్టెంబర్ 30 వరకు లేదా తదుపరి ఆదేశాలు జారీ అయ్యేవరకు ఈ నిషేధం కొనసాగుతుందని తెలిపింది. అయితే, ఈ ఉత్తర్వులకు ముందే లోడింగ్ ప్రారంభమైనా, చక్కెర నిల్వలను కస్టమ్స్‌కు అప్పగించినా వాటి ఎగుమతులకు అనుమతిస్తామని వెల్లడించింది. కాగా.. ఇప్పటికే కుదిరిన ఒప్పందాల ప్రకారం ఐరోపా, అమెరికాకు ఈ ఎగుమతుల నిషేధం వర్తించదని ప్రభుత్వం పేర్కొంది.

# చెన్నై ఎక్స్‌పెస్‌లో సాంకేతిక లోపం

- రెండున్న గంటలపాటు నిలిపివేత

నల్లగొండ,మే14 : నల్లగొండ జిల్లా మిర్యాలగూడ రైల్వే స్టేషన్ సమీపంలో చెన్నై ఎక్స్‌ప్రెస్ రెండున్నర గంటలు పాటు నిలిచిపోయింది. ఇంజిన్‌లో విద్యుత్ సమస్య తలెత్తడంతో రైలు ఆగిపోయింది. మరమ్మతుల అనంతరం రైలు 9:50 గంటలకు బయలుదేరి వెళ్లింది. ట్రెయిన్ ఆగిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అసలే ఎండాకాలం కావడంతో ట్రైన్‌లో ఫ్యాన్లు, ఎసిలు పనిచేయక పోవడంతో నానాయాతన పడ్డారు.

# అగ్రిగోల్డ్ బాధితులకు తక్షణ న్యాయం

- ముగ్గురు సభ్యులతో కమిటీకి సిఎం ఆమోదం

అమరావతి,మే14 : అగ్రిగోల్డ్ బాధితులకు ఆరునెలల్లో న్యాయం చేయాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారు. ఈ మేరకు అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. సీఎం అధ్యక్షతన గురువారం సచివాలయంలో కేబినెట్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై మంత్రులతో సీఎం చంద్రబాబు చర్చించారు. అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయడానికి సంబంధించి ముగ్గురు సభ్యులతో కమిటీ వేయాలని సీఎం ఆదేశించారు. ఎనిమిది రాష్ట్రాల్లో 19 లక్షల మంది బాధితులు ఉన్నారని తెలిపారు. ఒక్క ఆంధ్రప్రదేశ్‌లోనే 11 లక్షల మంది బాధితులు ఉన్నారని చెప్పుకొచ్చారు. ఈ కేసులో బాధితుల సొమ్ము తిన్న వారిలో వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వంలోని కొంతమంది కీలక అధికారులు ఉన్నారని వెల్లడించారు. అందువల్లే ఈ కేసుపై ముగ్గురు సభ్యులతో కమిటీ వేయాలని ఆదేశించారు. అగ్రిగోల్డ్‌లో పెట్టుబడులు పెట్టి మోసపోయిన వారందరికీ తప్పనిసరిగా న్యాయం చేయాలని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు.

# కేరళ సిఎం అభ్యర్థి సతీషన్‌కు రేవంత్ అభినందనలు

## ఆయనకు పదవి దక్కడం సముచిత గుర్తింపు అని వెల్లడి

హైదరాబాద్,మే14 : కేరళం ముఖ్యమంత్రిగా ఎంపికైన వీడీ సతీశన్‌కు తెలంగాణ సీఎం ఎ. రేవంత్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు. కేరళం ప్రజలకు దశాబ్దాలుగా సేవ చేస్తూ... విలువలతో కూడిన రాజకీయాలు చేసే సతీశన్‌కు ఈ పదవి రావడం సముచిత గుర్తింపు అని సీఎం రేవంత్ అభిప్రాయపడ్డారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజల ప్రజాస్వామ్యం, సామాజిక న్యాయం, సమగ్రాభివృద్ధికి మద్దతుగా విస్తృతంగా ప్రచారం చేసిన కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్‌కు అధికార బాధ్యతలు అప్పగించారని వ్యాఖ్యానించారు. విద్య, వైద్యం, అక్షరాస్యతలో కేరళం దేశానికి ఆదర్శంగా నిలిచిందని తెలిపారు. సతీశన్ నాయకత్వంలో రాష్ట్రం మరింత అభివృద్ధి సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. పెట్టుబడులు, నైపుణ్యాభివృద్ధి, పర్యాటకం, పరస్పర సహకారం వంటి రంగాల్లో కేరళం ప్రభుత్వంతో కలిసి పనిచేయడానికి తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పుకొచ్చారు. కేరళం మరింత ప్రగతి, సుసంపన్నత దిశగా ముందుకు సాగాలని ఆకాంక్షిస్తున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

(మొదటిపేజీ తరువాయి)

# సింగరేణిలో మహిళా డంపర్ ఆపరేటర్ల నియామకం

తగు ప్రాధాన్యత కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం సింగరేణిని ఆదేశించింది. ఈ నేపథ్యంలో సింగరేణి సంస్థ ఓపెన్ కాస్ట్ గనుల్లో డంపర్ ఆపరేటర్లుగా పని చేయడానికి ఆసక్తి గల మహిళా ఉద్యోగుల నుంచి దరఖాస్తులను కోరింది. మొదట దాదాపు 35 మంది వరకు ముందుకు వచ్చారు. అయితే భారీ డంపర్లను నడపడానికి వారికి అంతకుముందే సాధారణ డ్రైవింగ్ లైసెన్స్ తో పాటు భారీ వాహనాలను నడిపే లైసెన్స్ కూడా అవసరమై ఉన్నాయి. దీనిని దృష్టిలో ఉంచుకున్న యాజమాన్యం సిరిసిల్లలో ఉన్న తెలంగాణ ఇనిస్టిట్యూట్ ఆఫ్ డ్రైవింగ్ ఎడ్యుకేషన్ అండ్ స్కిల్స్ (ట్రైడ్స్)అనే సంస్థ ద్వారా ఆసక్తి గల మహిళలకు కంపెనీ ఖర్చులతో భారీ వాహనాలపై ఉచిత డ్రైవింగ్ శిక్షణను అందించింది. శిక్షణను విజయవంతంగా పూర్తి చేసుకున్న 13 మంది మహిళా ఉద్యోగులు తాము డంపర్ ఆపరేటర్లుగా పనిచేయటానికి సంసిద్ధంగా ఉన్నామని కంపెనీకి తెలిపారు. శిక్షణ పూర్తి చేసుకున్న వీరందరికీ త్వరలో విడుదలయ్యే డంపర్ ఆపరేటర్ల నియామకల్లో అవకాశం కల్పించనున్నట్లు యాజమాన్యం తెలిపింది. రాష్ట్ర ప్రభుత్వం మహిళా సాధికారతపై ప్రత్యేక దృష్టి సారించిన నేపథ్యంలో సింగరేణి సంస్థ కూడా ఆ దిశగా కీలక అడుగులు వేస్తోంది. పురుషులకు మాత్రమే పరిమితమైన కఠినమైన పనుల్లో మహిళలకు సైతం ప్రాధాన్యతనిస్తూ సింగరేణి సంస్థ తొలిసారిగా డంపర్ ఆపరేటర్లుగా మహిళలకు కూడా అవకాశం కల్పించటానికి విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టింది, ఈ విధంగా అనతి కాలంలోనే సింగరేణి సంస్థలో భారీ డంపర్లపై మహిళా ఉద్యోగులు పెద్ద సంఖ్యలో కనపడే అవకాశం ఉంది. సందర్భంగా కొందరు మహిళా ఆపరేటర్లు మాట్లాడుతూ, భారీ డంపర్లను నడపడం శారీరక కష్టం, నైపుణ్యంతో కూడుకున్న పని అని, తాము చేయగలమో లేదో అని కొంత భయపడినప్పటికీ, స్వయంగా డంపర్లు నడుపుతున్నప్పుడు తాము కూడా ఇటువంటి పనులు చేయగమన్న ఆత్మవిశ్వాసం కలగిందన్నారు. నేటి ఆధునిక కాలంలో మహిళలు అన్ని రంగాలతో పాటు రోదసిలోకి వెళ్తున్నారని కనుక గనిలోని డంపర్లను మహిళలు నడపడం అంత కష్టమేమీ కాదని, ఇటువంటి మంచి అవకాశాన్ని కల్పించిన రాష్ట్ర ప్రభుత్వానికి, సింగరేణి యాజమాన్యానికి తాము ధన్యవాదాలు తెలుపుతున్నట్లు వారు పేర్కొన్నారు. సందర్భంగా అధికారులు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు శ్రీ ఎ. రేవంత్ రెడ్డి, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు, ఇంధన శాఖామాత్యులు శ్రీ భట్టి విక్రమార్క మల్లు ల ఆదేశాల మేరకు సింగరేణిలో మహిళా శక్తికి తగిన అవకాశాలు కల్పిస్తూ వస్తున్నామని, బెల్లంపల్లి ఖైరీగూడ ఓపెన్ కాస్ట్ గనిలో అత్యంత క్లిష్టమైన బ్లాస్టింగ్ విభాగంలో కూడా కేవలం మహిళలను మాత్రమే నియమించగా వారు పురుష ఉద్యోగులతో సమానంగా బ్లాస్టింగ్ ను నిర్వహిస్తున్నారని, అలాగే ఇతర విభాగాల్లో కూడా మహిళలు రాణిస్తున్నారని ఒక అధికారి పేర్కొన్నారు. సంస్థ చరిత్రలో తొలిసారిగా మహిళా రెస్క్యూ జట్టును కూడా ఏర్పాటు చేశామన్నారు. ఇలాగే ఇకపై కూడా వివిధ క్లిష్టతరమైన ఉద్యోగాలలో ఆసక్తి గల మహిళలకు పురుషులతో సమానంగా అవకాశాలు ఇవ్వడం జరుగుతుందని అధికారులు పేర్కొంటున్నారు.

# నీట్-యూజీ 2026 రద్దు... మోడీ సర్కార్ ఫెయిల్

ఆందోళన వ్యక్తం చేశారు. ఎంతోమంది విద్యార్థుల తల్లిదండ్రులు అప్పులు చేసి, కొంతమంది పేరెంట్స్ నగలు అమ్మి తమపిల్లలనునీట్ ఎగ్జామ్ కు ప్రిపేర్ చేయించారని... వారి ఆశలన్నీగల్లంతవడంబాధాకరమన్నారు. 2019 నుండి 15 రాష్ట్రాల్లో ప్రధాన నియామక పరీక్షల పేపర్లు లీక్ అయినా, ఒక్క కేంద్ర మంత్రి కూడా రాజీనామా చేయలేదని గుర్తు చేశారు. బీజేపీ పాలిత రాష్ట్రాలే ఈ లీక్‌లకు ప్రధాన కేంద్రాలుగా మారాయని సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. గుజరాత్ రాష్ట్రంలోనే 14 పేపర్లు లీక్ అయ్యాయన్నారు. 2014 మే నెలలో నరేంద్ర మోడీ అధికారంలోకి వచ్చినప్పటి నుండి, భారతదేశంలోని ప్రభుత్వ పరీక్షా వ్యవస్థలో వ్యవస్థీకృత లోపాలు బహిర్గతమయ్యాయని చెప్పారు. కాంగ్రెస్ విడుదల చేసిన 'ది పేపర్ లీక్ డెకేడ్' శ్వేతపత్రం ప్రకారం, కేంద్ర, రాష్ట్ర పరీక్షలలో 93 పేపర్ లీక్ ఘటనలుజరిగాయని ఈ సందర్భంగా సీఎం ప్రస్తావించారు. వీటివల్ల సుమారు 2 కోట్ల మంది విద్యార్థులు ప్రభావితమయ్యారని చెప్పారు. 2024లో కేవలం ఎనిమిది వారాల్లోనే నాలుగు ప్రధాన జాతీయ పరీక్షలు రద్దయ్యాయని తెలిపారు. నీట్-యూజీ (24 లక్షల మంది అభ్యర్థులు), యుజిసి-నెట్ (9 లక్షలు), సిఎస్ఐఆర్-నెట్, నీట్-పిజిరద్దుఅయినట్టు గుర్తు చేశారు. 2024లో ఉత్తరప్రదేశ్ పోలీస్ కానిస్టేబుల్ పరీక్ష (16 లక్షల మంది మహిళలతో సహా 48 లక్షల మంది అభ్యర్థులు) కూడా కొన్ని రోజుల్లోనే రద్దైందని, ప్రధాని సొంత రాష్ట్రమైన గుజరాత్‌లో 14 ప్రధాన లీక్‌లు జరిగాయన్నారు. ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, హర్యానా వంటి ఇతర బీజేపీ పాలిత రాష్ట్రాలు కూడా ఈ కుంభకోణాల జాబితాలో ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వం 2024 ఫిబ్రవరిలో 'పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (తప్పుడు మార్గాల నివారణ) చట్టం'ను ఆమోదించినప్పటికీ, పెద్ద కుంభకోణాలు వెలుగు చూసిన తర్వాత, 2024 జూన్ వరకు దాని నోటిఫికేషన్‌ను కేంద్రం ఆలస్యం చేసిందన్నారు. కాగా, తెలంగాణ ముఖ్యమంత్రిగా, విద్యార్థులకు, తల్లిదండ్రులకు సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక హామీ ఇచ్చారు. నీట్రద్దునేపథ్యంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళన చెందవద్దనిభరోసానిచ్చారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతి విద్యార్థికి, వారి కుటుంబానికి అండగా నిలుస్తుందని హామీనిచ్చారు.

## భారీగా డ్రగ్స్ పట్టివేత

వద్ద నుంచి కొనుగోలు చేస్తున్నారు, ఎప్పటి నుంచి ఈ దందా నడిపిస్తున్నారనే దానిపై పోలీసులు విచారణ చేపట్టారు. నిందితుల వెనక పెద్ద ముఠా ఉన్నట్లు పోలీసులు చెబుతున్నారు. నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

## చివరిగింజ వరకు కొంటాం

ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ మాట్లాడారు. ట్రాన్స్‌పోర్ట్, హమాలీల విషయంలో కొంత ఇబ్బంది ఉందని చెప్పుకొచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా తిరిగి ఆ సమస్యను ప్రభుత్వం పరిష్కారింస్తోందని పేర్కొన్నారు. యాసంగిలో 85 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని తమ ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని వెల్లడించారు. బిహార్, పశ్చిమబెంగాల్ నుంచి ఎక్కువగా హమాలీలు తెలంగాణకు వస్తారని చెప్పుకొచ్చారు. ఇటీవలే పశ్చిమబెంగాల్‌లో ఎన్నికలు జరగడం వల్ల హమాలీల కొరత ఏర్పడిందని తెలిపారు. కేవలం ధాన్యం తరలించడానికి లారీలు, డీసీఎంలు ఏర్పాటు చేయాలని అన్నిజిల్లాల కలెక్టర్‌లకు మంత్రి ఉత్తమ్ ఆదేశాలు జారీచేశారు.

## అత్యుత్తమ మార్కులు సాధించిన బిసి విద్యార్థులు

భవిష్యత్ లో అసెంబ్లీ, పార్లమెంటుకు ఎన్నికై చట్టాలు చేయాలి. రాజకీయ నాయకులు చేసే చట్టాలు దేశ భవిష్యత్తును మారుస్తున్నాయి. సీఎం రేవంత్ రెడ్డి విద్యారంగం విప్లవాత్మకంగా మార్పులు తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నారు.ప్రజా ప్రభుత్వం విద్యార్థుల కోసం ఇస్తున్న ప్రాధాన్యతను గుర్తించి, విద్యార్థులు అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని మంత్రి శ్రీహరి వివరించారు.

## కెటిఆర్‌తో ఆస్ట్రేలియా హైకమిషన్ భేటీ

పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రిగా పనిచేసిన అనుభవం ఉన్న కేటీఆర్‌తో ఈ అంశంలో అనేక అంశాలపై చర్చించారు. ఐటీ, గ్రీన్ ఎనర్జీ, ఫార్మా, ఇన్నోవేషన్ రంగాల్లో హైదరాబాద్ కేంద్రంగా జరుగుతున్న అభివృద్ధిపై మాట్లాడారు. తెలంగాణ, ఆస్ట్రేలియా మధ్య సహకారం భవిష్యత్తులో స్థానిక యువతకు మరిన్ని అంతర్జాతీయ అవకాశాలను కల్పిస్తుందని కేటీఆర్ ఆశాభావం వ్యక్తం చేశారు. భారత్, ఆస్ట్రేలియా మధ్య ఉన్న దృఢమైన మైత్రిని మరింత ఉన్నత శిఖరాలకు తీసుకెళ్లే దిశగా తీసుకునే చర్యలపై చర్చించారు. ఆస్ట్రేలియా ప్రతినిధులతో జరిగిన ఈ భేటీపై సంతోషం వ్యక్తం చేశారు కేటీఆర్. ఈ భాగస్వామ్యం ఇరుదేశాల ఆర్థిక వ్యవస్థలకు, సాంస్కృతిక బంధాలకు మరింత బలాన్ని చేకూరుస్తుందని కేటీఆర్ పేర్కొన్నారు.



# పొదుపు మంత్రంపై కేబినేట్‌లో చర్చ

- వారానికి ఓ సారి వెహికిల్ హాలిడే ప్రతిపాదన
- వర్క్‌ఫ్రమ్‌పైనా మావేశంలో సుదీర్ఘ చర్చ
- మంత్రులు సైకిళ్లపై సచివాలాయానికి రావాలసి సూచన
- ప్రజలకు అవహ్వాన కల్పించాలని నిర్ణయం

అమరావతి,మే14 : ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన గురువారం సచివాలయంలో కేబినెట్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై మంత్రులతో సీఎం చంద్రబాబు చర్చించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ సూచించిన పొదు పు చర్యలపై ప్రత్యేకంగా కేబినెట్‌లో చర్చించారు. ఏపీలోఉద్యోగులకు వర్క్‌ఫ్రమ్ హోంపై చర్చించినట్లు సమాచారం. సూర్యఘర్, పీఎం కుసుంను సీరియస్‌గా తీసు కోవాలని సీఎం ఆదేశించారు. దేశాన్ని కాపాడుకోవడం అందరి బాధ్యత అని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. కాన్వాయ్‌ల తగ్గింపుతో సరిపోదని.. మరిన్ని పొదుపు చర్యలు అవసరమని అభిప్రాయపడ్డారు. ప్రజలకు ముందుగా అవగాహన కల్పిద్దామని తెలిపారు. వారానికి ఒక రోజు నో వెహికల్ డే పాటిద్దామని పిలుపునిచ్చారు. కొన్ని రోజులు మంత్రుల విదేశీ పర్యటనలు రద్దు చేసుకోవాలని అన్నారు. ఎమ్మెల్యేలు, మంత్రులు పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ వాడాలని సూచించారు. అవసరమైతే సెక్రటేరియట్‌కి సైకిల్ మీద రావాలని మార్గనిర్దేశం చేశారు. సంక్షోభ నిర్వహణ అందరికీ రావాలని సూచించారు. సంక్షోభాన్ని మేనేజ్ చేయడం అందరు తెలుసుకోవాలని సూచించారు. ఈ విషయంలో మంత్రులు, అధికారులకు బాధ్యత ఉంటుందని తెలిపారు. దేశాన్ని మనం కాపాడుకోవాలని చెప్పారు. అందరం కాన్వాయ్‌లు తగ్గించుకుంటే సరిపోదని అన్నారు. ఇంకా ఇతర పొదుపు చర్యలు తీసుకోవాలని తెలిపారు. వాడే వాహనాలను ఎలక్ట్రిక్ వాహనాలుగా మార్చుకోవాలని మార్గనిర్దేశర చేశారు. మంత్రులు పబ్లిక్ ట్రాన్స్‌పోర్టు లేదా.. ఈవీ, సైకిల్ వినియోగించాలని నిర్ణయించారు. జిల్లాల పర్యటనల్లోనూ కాస్ట్ కటింగ్ పాటించాలని నిర్ణయం తీసుకున్నారు. అధిక సంఖ్యలో సమావేశాలు వర్చువల్‌గా నిర్వహించాలని తెలిపారు. ప్రెజెన్స్ అవసరం లేని ఉద్యోగులకు వర్క్ ఫ్రమ్ హోమ్ ఇవ్వాలని నిర్ణయించారు. ప్రభుత్వ కార్యక్రమాల నిర్వహణలో ఖర్చులు తగ్గించాలని నిర్ణయం తీసుకున్నారు. పొదుపు చర్యలని మనం ఒకేసారి ప్రజలకు చెబితే ఇబ్బంది పడతారని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. నిదానంగా వెళ్దామని పవన్ కల్యాణ్ సూచించారు. రెండు రోజుల పాటు మనం ప్రజలకు అన్ని పొదుపు చర్యలు వివరిద్దామని సీఎం అన్నారు. అలానే చేద్దామని మిగతా మంత్రులు చెప్పారు. వర్క్ ఫ్రం హోం, కార్ పూలింగ్ పాటించాలని సీఎం సూచించారు. ఆయా శాఖల్లో చేపట్టాల్సిన పొదుపు చర్యలపై కార్యదర్శులు నివేదిక ఇవ్వాలని కోరారు. ఒక కేబినెట్ సబ్‌కమిటీని నియమిస్తే బాగుంటుందని వివరించారు. ముందుగా ప్రజలకు అన్ని విషయాలు విడమర్చి చెబుదామని మంత్రులు ప్రస్తావించారు. ప్రజలకు అవగాహన కలిగించిన తర్వాత మనం ఒక నిర్ణయం తీసుకుందామని డిప్యూటీ సీఎం చెప్పారు.

# గార్బేజీ స్టేషన్‌లో జెసిబి వాహనాలు






- కొత్త వాహనాలను ప్రారంభించిన ఎంపి

విజయవాడ,మే14 : విజయవాడ అజిత్‌సింగ్ నగర్‌లోని గార్బేజ్ ట్రాన్ఫ్ఫర్ స్టేషన్‌లో 5 జేసీబీ వాహనాలను విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్(వీఎంసీ) ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే బోండా ఉమా మహేశ్వర రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. సెంట్రల్ నియోజక వర్గంలో గార్బేజ్ ట్రాన్ఫ్ఫర్ స్టేషన్‌లో జేసీబీ వాహనాల ప్రారంభం ఆనందదాయకమని అన్నారు. గతంలో ఈ ప్రాంత వాసులు అనేక సమస్యలతో ఇబ్బంది పడేవారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఎమ్మెల్యే బోండా ఉమా.. నియోజకవర్గం అభివృద్ధికి సహకరిస్తున్నారని తెలిపారు. ఈ ప్రాంత అభివృద్ధికి కారణం ఎమ్మెల్యే ఉమా అనడంలో అతిశయోక్తి లేదన్నారు. డ్రైనేజ్‌లు, రోడ్లను సుందరీకరణగా తీర్చిదిద్దామన్నారు. గత ప్రభుత్వంలో విజయవాడ సెంట్రల్ నియోజక వర్గంలో చిన్న పనులు కూడా జరగలేదని విమర్శించారు. గ్రేటర్ విజయవాడ అభివృద్ధి కోసం ఎమ్మెల్యేతో సమన్వయం చేసుకుని ముందుకు సాగుతామని స్పష్టం చేశారు. జేసీబీ యాజమాన్యానికి ఎంపీ కేశినేని శివనాథ్ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. పార్లమెంట్ సభ్యులు నిరంతరం కేంద్రం నుంచి నిధులు తెస్తున్నారని ఎమ్మెల్యే బోండా ఉమా మహేశ్వరరావు తెలిపారు. ప్రధాని, సీఎం.. ప్రతినెల స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో పాల్గొంటూ ప్రత్యేక దృష్టి పెడుతున్నారన్నారు. గతంలో చెత్తా చెదారంగా ఉన్న ఈ ప్రాంతాన్ని టీడీపీ ప్రభుత్వం.. చెత్త నుంచి సంపద సృష్టించే దిశగా మారుస్తోందని అన్నారు. విజయవాడ నగర అభివృద్ధి ఎంపీ కేశినేని శివనాథ్ కృషికి నిదర్శనమన్నారు. రూ.23 కోట్ల నిధులు తీసుకువచ్చి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని తెలిపారు. అధికారం అలంకారం కాదని.. ఒక బాధ్యత అని బోండా ఉమా మహేశ్వరరావు పేర్కొన్నారు.

# ట్రాన్స్‌జెండర్స్‌కు అండ

### వారు అత్మగౌరవంతో బతికేలా చర్యలు: మంత్రి డోలా

అమరావతి,మే14 : ట్రాన్స్‌జెండర్స్ సమాజంలో ఆత్మగౌరవంతో జీవించాలన్నదే కూటమి ప్రభుత్వ ఆశయమని ఆంధ్రప్రదేశ్ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి వ్యాఖ్యానించారు. ట్రాన్స్‌జెండర్స్‌కి అన్ని ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందజేస్తున్నామని పేర్కొన్నారు. గురువారం వెలగపూడి సచివాలయంలో మంత్రి డీబీవీ స్వామి అధ్యక్షతన ట్రాన్స్‌జెండర్ వెల్ఫేర్ బోర్డు సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ట్రాన్స్‌జెండర్స్ సంక్షేమం, నైపుణ్య శిక్షణ, స్వయం ఉపాధి కల్పనపై చర్చించారు. ఈ సందర్భంగా డీబీవీ స్వామి మాట్లాడారు. ట్రాన్స్‌జెండర్స్‌కి ఆస్పత్రుల్లో ప్రత్యేక ఓపీ సదుపాయం కల్పిస్తామని చెప్పుకొచ్చారు. బహిరంగ ప్రదేశాలు, ఆస్పత్రుల్లో ట్రాన్స్‌జెండర్స్‌కి ప్రత్యేక టాయిలెట్లు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు. సెర్ప్, మెప్మా సహకారంతో ట్రాన్స్‌జెండర్స్‌కి స్వయం ఉపాధి కల్పిస్తున్నామని వివరించారు. తిరుపతిలో గరీమా గృహం ఏర్పాటు చేసి నిరాశ్రయులైన వారికి ఆసరా కల్పిస్తున్నామని చెప్పుకొచ్చారు. ట్రాన్స్‌జెండర్స్‌లోని 676 మందికి ఇప్పటికే గృహాలు కేటాయించామని తెలిపారు. వారి రక్షణ కోసం సీఐడీ కేంద్ర కార్యాలయంలో స్వాభిమాన్ పేరుతో ప్రత్యేక ప్రొటెక్షన్ సెల్, హెల్ప్‌లైన్ (1091) ఏర్పాటు చేశామని అన్నారు. ట్రాన్స్‌జెండర్స్‌కి గుర్తింపు కార్డులు, సింగిల్ రేషన్ కార్డులు జారీ చేస్తున్నామని ప్రకటించారు. మనమిత్ర వాట్సాప్ యాప్, స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డు కార్యాలయాల ద్వారా వారు ప్రభుత్వ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. ట్రాన్స్‌జెండర్స్ సంక్షేమం, అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి డీబీవీ స్వామి పేర్కొన్నారు.

# ఎసిబికి చిక్కిన మరో లంచావతారం

- 10వేలు లంచం తీసుకుంటుండగా పట్టివేత

వరంగల్,మే14 : పూర్వీకుల ఆస్తిని తన పేరుపై మ్యూటేషన్ కోసం సంప్రదించిన బాధితుడి నుంచి లంచం డిమాండ్ చేసిన రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌ను ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం తహసీల్ కార్యాలయంలో ఆర్ఐగా పనిచేస్తున్న జి రాంబాబు బాధితుడి నుంచి రూ. 10 వేలు తీసుకుంటుండగా గురువారం వరంగల్ రేంజ్ ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. నగదును స్వాధీనం చేసుకుని ఆర్ఐపై కేసు నమోదు చేసి వరంగల్ఏసీబీ కోర్టులో హాజరు పరిచినట్లు ఏసీబీ అధికారులు వివరించారు. ప్రభుత్వ ఉద్యోగి ఎవరైనా అవినీతి, అక్రమాలకు పాల్పడితే ఏసీబీ టోల్ ఫ్రీ నంబర్ 1064 అనే నంబర్‌కు ఫిర్యాదు చేయాలని, వాట్సప్ నంబర్ 9440446106కు ఫిర్యాదు చేయవచ్చని సూచించారు.

# ఆర్థిక లక్ష్యాలకు అనుగుణంగా పనిచేయాలి

### అధికారులకు సిఎం చంద్రబాబు ఆదేశం

అమరావతి,మే14:2026-27 ఆర్థిక సంవత్సరంలో లక్ష్యాలకు అనుగుణంగా పనిచేయాలని వివిధ శాఖలకు సీఎం చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. ఆంధప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన వివిధ శాఖలపై గురువారం సచివాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. స్టేట్ ఓన్ రెవెన్యూస్ 2024-25 ఆర్థిక సంవత్సరానికిరూ.1,04,345కోట్లుగా ఉంటే... 2025-26 ఆర్థిక సంవత్సరానికి రూ. 1,10,643 కోట్లుగా నమోదైందని వెల్లడించారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో జీఎస్టీ నుంచి రూ.33,679 కోట్లు, గనుల శాఖ నుంచి రూ. 10,300 కోట్లు, స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ నుంచి రూ.11,047 కోట్ల మేర ఆదాయం వచ్చిందని తెలిపారు. 2024-25 ఆర్థిక సంవత్సరంతో పోల్చుకుంటే 2025-26 ఆర్థిక సంవత్సరంలో స్టేట్ ఓన్ రెవెన్యూలో 6 శాతం వృద్ధి నమోదైందని సీఎం వివరించారు. 2026-27 ఆర్థిక సంవత్సరానికి రూ.1,27,506 కోట్ల మేర ఆదాయాన్ని లక్ష్యంగా ప్రభుత్వం పెట్టుకుందని వెల్లడించారు. గనులు, ఎక్సైజ్, స్టాంపులు రిజిస్ట్రేషన్, వాణిజ్య పన్నులు, రవాణా తదితర శాఖలు లక్ష్యాలకు అనుగుణంగా పనిచేయాలని ఆదేశించారు. ప్రభుత్వ ఆదాయంలో ప్రతీ రూపాయీ సద్వినియోగం అయ్యేలా ప్రభుత్వ శాఖలు చూడాలని సీఎం చంద్రబాబు దిశానిర్దేశర చేశారు. ఈ సమీక్షకు సీఎస్ సాయిప్రసాద్, ఆర్థిక, రవాణా, ఎక్సైజ్, గనులు, స్టాంపులు రిజిస్ట్రేషన్, వాణిజ్య పన్నులు, అటవీ, పురపాలక శాఖల అధికారులు హాజరయ్యారు.

# అల్పపీడనంతో కోస్తాంధ్ర, రాయలసమీల్లో వర్షాలు

### 16 నాటికి అండమాన్‌లోకి నైరుతి ప్రవేశం

విశాఖపట్నం,మే14: నైరుతి బంగాళాఖాతం- పశ్చిమ మధ్య బంగాళా ఖాతం సమీపంలో అల్పపీడనం కొనసాగుతోందని విశాఖ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. ఇదే ప్రాంతంలో సముద్ర మట్టానికి 5.9 కి.మీ ఎత్తులో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోందని పేర్కొన్నారు. దీని ప్రభావంతో రాగల 48 గంటల్లో కోస్తాంధ్ర, రాయలసీమ, యానాంలో ఉరుములు, మెరుపులతో కూడిన జల్లులు, గంటకు 30 నుంచి 40 కి.మీ వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశముందని తెలిపారు. నైరుతి రుతుపవనాలు చురుగ్గా కదులుతున్నాయని, ఈనెల 16 నాటికి దక్షిణ బంగాళాఖాతం, అండమాన్ నికోబార్ దీవులను తాకే అవకాశముందన్నారు. నైరుతి రుతుపవనాలు ఈ నెల 16నాటికి దక్షిణ బంగాళాఖాతం, అండమాన్ సముద్రం, అండమాన్ నికోబార్ దీవుల ప్రాంతంలో ప్రవేశించే అవకాశం ఉన్నదని వాతావరణ కేంద్రం తెలిపింది. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేసింది. నైరుతి బంగాళాఖాతంలో కొనసాగుతున్న అల్పపీడనం బుధవారం తీవ్ర అల్పపీడనంగా మారిందని పేర్కొన్నది. గురువారం నుంచి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2 నుంచి 3 డిగ్రీలు పెరిగే అవకాశం ఉన్నదని వెల్లడించింది. ఈనెల 22 వరకు భానుడు తన ప్రతాపాన్ని చూపుతాడని హెచ్చరించింది. గడిచిన 24 గంటల్లో నిజామాబాద్‌లో అత్యధికంగా 44.5 డిగ్రీలు, జగిత్యాల జిల్లా బీర్పూర్‌లో 44.4, కామారెడ్డి జిల్లా బిచ్కుందలో 44.2, సిద్దిపేట జిల్లా కోహెడలో 43.9, నిర్మల్ జిల్లా దస్తురాబాద్‌లో 43.8 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదైనట్టు వివరించింది. వచ్చే రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా వడగాల్పులు ఎక్కువగా ఉంటా యని 11 గంటల తర్వాత బయటకు వెళ్లే సమయాల్లో తగిన జాగ్రత్తలు తీ సుకోవాలని సూచించింది. చిన్నపిల్లలు, వృద్ధులు, గర్భిణులు ఈ వారంపాటు జాగ్రత్తగా ఉండాలని కోరింది.

# ఉపాధి హామీ ద్వారా 137.97 లక్షల పనిదినాలు

విజయనగరం,మే14 : జిల్లాలో 2025-26 ఆర్థిక సంవత్సరానికి మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా 137.97 లక్షల పనిదినాలు కల్పించినట్లు రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పనిదినాలకు సంబంధించి వేతనాల రూపంలో రూ.310.31 కోట్లు చెల్లింపులు వారి ఖాతాల్లో వేసినట్లు మంత్రి తెలిపారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి జనరేట్ చేసిన మెటీరీయల్ మొత్తం విలువ రూ. 173.60 కోట్లు కాగా.. జనవరి నెల వరకు రూ.71.67 కోట్లు చెల్లింపులు చేసినట్లు పేర్కొన్నారు. ఇంకా పెండింగ్ ఉన్న రూ. 101.93 కోట్లు త్వరలోనే లబ్దిదారుల ఖాతాలో జమచేస్తామన్నారు.

# హయత్‌నగర్‌లో భారీ అగ్నిప్రమాదం

### ఎటక్రిక్ సాపులో షాట్ సర్క్యూట్‌తో మంటలు

హైదరాబాద్,మే14 : హయత్ నగర్‌లో భారీ అగ్నిప్రమాదం జరిగింది. షార్ట్ సర్క్యూట్ కారణంగా ఓ హార్డ్‌వేర్, ఎలక్ట్రికల్ షాపులో మొదలైన మంటలు.. క్షణాల్లోనే పక్కనే ఉన్న పరుపుల షాపుకు విస్తరించి భీభత్సాన్ని సృష్టించాయి. ఎగిసిపడుతున్న మంటలు, దట్టమైన పొగతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ముందుగా జయశ్రీ ఎలక్ట్రానిక్ అండ్ హార్డ్‌వేర్ షాపులో మంటలు చెలరేగాయి. ఆ మంటలు పక్కనే ఉన్న పరుపుల తయారీ షాపుకు వ్యాపించడంతో ప్రమాద తీవ్రత రెట్టింపైంది. పరుపులు, ఇతర ప్లాస్టిక్ వస్తువులు ఉండటంతో మంటలు వేగంగా వ్యాపించి.. ఆ రెండు షాపులు పూర్తిగా దగ్ధమయ్యాయి. మంటల ధాటికి సమీపంలోని మరో రెండు షాపులు కూడా స్వల్పంగా దెబ్బతిన్నాయి. ఈ ప్రమాదంలో షాపుల బయట నిలిపి ఉంచిన ఒక బైక్ కూడా పూర్తిగా కాలి బూడిదైపోయింది. సమాచారం అందుకున్న వెంటనే హయత్ నగర్ అగ్నిప్రమాద సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చే ప్రయత్నం చేసారు. అయితే, షాపు లోపల పరుపుల నిల్వలు ఉండటంతో.. మంటలు ఆరిపోయినట్టే కనిపిస్తూనే మళ్ళీ మళ్ళీ రాజుకున్నాయి. ఈఘటనలో రోడ్డుపై భారీగా ట్రాఫిక్ జామ్ అయ్యింది. ప్రస్తుతం ÷ర్ సిబ్బంది నిరంతరాయంగా శ్రమిస్తూ మంటలు పూర్తిగా ఆరిపోయేలా చర్యలు చేపడుతున్నారు. ఈ ప్రమాదంలో భారీగా ఆస్తి నష్టం జరిగినట్లు తెలుస్తోంది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# పర్యాటక రంగంలో భారత్ - అమెరికా బంధం

అమరావతి,మే14 : పర్యాటక రంగంలో భారత్ - అమెరికా బంధం బలోపేతమవుతోందని ఏపీ మంత్రి కందుల దుర్గేశ్ వ్యాఖ్యానించారు. ఆంధ్రప్రదేశ్‌కు అమెరికా పర్యాటక పెట్టుబడులే లక్ష్యంగా సచివాలయంలో మంత్రి దుర్గేశ్‌తో 'యూఎస్-ఇండియా స్ట్రాటజిక్ పార్టనర్‌షిప్ ఫోరమ్' భేటీ గురువారం జరిగింది. రాష్ట్ర పర్యాటక సంస్కరణలపై ప్రశంసలు కురిపించింది. అమెరికా ఇన్వెస్టర్ల దృష్టికి ఏపీ పర్యాటక రంగం విధానాలను తీసుకెళ్తామని వెల్లడించారు. ఏపీని గ్లోబల్ టూరిజం హబ్‌గా మార్చే ప్రక్రియలో ఇలాంటి భాగస్వామ్యాలు ఎంతో కీలకమని ప్రకటించారు.



# స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు బుట్టదాఖలు

- రైతులను పట్టించుకోని కేంద్ర ప్రభుత్వం
- జొన్న, మక్కలను రాష్ట్ర ప్రభుత్వమే కొంటోంది
- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**భద్రాద్రి కొత్తగూడెం,మే14 :** స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను కేందప్రభుత్వం బుట్టదాఖలు చేసిందని తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రం రైతులను మోసం చేస్తోందని ధ్వజమెత్తారు. దళారుల దయాదాక్షిణ్యాలపై రైతులు ఆధారపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల కోసం మొక్కజొన్న, జొన్నలను రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేస్తోందని స్పష్టం చేశారు. కొనుగోళ్లతో రాష్ట్రంపై రూ.4 వేల కోట్ల అదనపు భారం పడుతోందని తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో గురువారం మంత్రి తుమ్మలకు పామాయిల్ రైతులు ఆత్మీయ సత్కారం చేశారు. మంత్రిగా నలభై సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా తుమ్మలను సత్కరించారు. అశ్వారావుపేట పామాయిల్ ఫ్యాక్టరీలో మంత్రి తుమ్మల ఆత్మీయ సత్కార కార్యక్రమంలో పది ఉమ్మడి జిల్లాల పామాయిల్ రైతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడారు. పెరిగిన సాగు వ్యయాలకు ఎంఎస్‌పి సరిపోవని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చెప్పుకొచ్చారు. వరి ఎంఎస్‌పిని కేవలం 72శాతం మాత్రమే కేంద్ర ప్రభుత్వం పెంచిందని దుయ్యబట్టారు. మొక్కజొన్న పైనా మంత్రి అసంతృప్తి వ్యక్తం చేశారు. 10శాతం పెంపుతో రైతులకు న్యాయం జరగదని తెలిపారు. మద్దతు ధరలు కనీసం 30 నుంచి 40 శాతం వరకు పెంచాలని డిమాండ్ చేశారు. ఎంఎస్‌పి ప్రకటించడం కాదని.. కొనుగోలు చేయడమే ముఖ్యమని తెలిపారు. ప్రతి పంటలో 75శాతం దిగుబడిని కేంద్రం కొనాలని డిమాండ్ చేశారు. మొక్కజొన్న, జొన్నలను ఖాలో చేర్చాలని విజ్ఞప్తి చేశారు.పత్తి, వేరుశనగ, సోయాబీన్ ఓ÷ూఖలపై కూడా అసంతృప్తి వ్యక్తం చేశారు. రైతుల ఆదాయం పెంచే సంకల్పం కేంద్రానికి లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పామాయిల్ సాగుకు దివంగత మాజీ సీఎం నందమూరి తారక రామారావు చేతుల మీదుగా శ్రీకారం చుట్టామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. నలభై ఏళ్ల రాజకీయ ప్రస్థానంలో పామాయిల్ సాగు విస్తరణకు ప్రాధాన్యం ఇచ్చానని ప్రస్తావించారు. అకాల వర్షాలతో ధాన్యం, మొక్కజొన్న రైతులు కష్టాలు పడుతున్నారని చెప్పుకొచ్చారు. ఆ సమస్యలు చూసిన వారు పామాయిల్ సాగు చేయాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వ అసమర్థ విధానాల వల్లే తెలంగాణ రైతాంగం అవస్థలు పడుతోందని ధ్వజమెత్తారు. దేశంలో ఎక్కడా లేని విధంగా కేంద్రం సహకరించకున్నా మద్దతు ధరకు పంటలు కొనే ఏకైక రాష్ట్రం తెలంగాణ అని ఉద్ఘాటించారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రైతాంగం కోసం ఏడాదిలోనే లక్ష కోట్ల రూపాయలకుపైగా ఖర్చు పెట్టామని తెలిపారు. ఆదివాసీ బిడ్డలకు ఉద్యోగాలు దక్కేలా చంద్రబాబు జీఓ నంబర్ -3 తీసుకువచ్చారని ప్రస్తావించారు. నలభై ఏళ్ల క్రితం రైతాంగం కష్టాలు ఈ తరం వారికి లేవని చెప్పుకొచ్చారు. మారిన కాలానుగుణంగా అన్నదాతలు ప్రకృతి వైపరీత్యాలు, కోతుల బెడద, చీడ పీడలు లేకుండా పామాయిల్ సాగు చేయాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. ఉమ్మడి రాష్ట్రంలో ఎందరో పోటీ పడ్డా ఎన్టీఆర్ వ్యవసాయ కళాశాల అశ్వారావుపేటకే ఇచ్చారని ప్రస్తావించారు. హార్టికల్చర్ హబ్‌గా అశ్వారావుపేట ఉందని వ్యాఖ్యానించారు. వ్యవసాయ కళాశాలకు తోడు ఉద్యాన కళాశాల అశ్వారావుపేట కు మణిహారమని ఉద్ఘాటించారు. చంద్రబాబు హెలికాప్టర్ నుంచి చూసి అశ్వారావుపేట పచ్చదనంపై ఆశ్చర్య పోయారని తెలిపారు. యుద్ధాలు జియో పాలిటిక్స్ వల్ల యూరియా సరఫరాలో కేంద్రం అనుకున్న స్థాయిలో సరఫరా చేయలేదని అన్నారు. ప్రతి ఏటా మన దేశంలో లక్ష కోట్ల రూపాయలు పామాయిల్ దిగుమతి అవుతోందని వివరించారు. పామాయిల్ ఇంపోర్ట్ ట్యాక్స్ పెంచితే మన రైతాంగానికి మద్దతు ధర పెరుగుతుందని మంత్రి తుమ్మల అన్నారు. రానున్న రోజుల్లో తెలంగాణకు పామాయిల్ సాగు వరంగా మారుతుందని చెప్పుకొచ్చారు. లక్షలాది రైతుల తలరాత మారేలా పామాయిల్ సాగు విస్తరణ చేసే అవకాశం భగవంతుడు తనకు ఇచ్చారని తెలిపారు. ఎన్ని పదవులు చేశామని కాదని.. ముందు తరాలకు మేలు చేసేలా తన రాజకీయ ప్రస్థానం ఉంటుందని ఉద్ఘాటించారు. మంత్రిగా నలభై ఏళ్ల ప్రస్థానంలో భద్రాద్రి శ్రీ రాముడు దయవల్ల ఉమ్మడి ఖమ్మం జిల్లా అభివృద్ధి చేసే భాగ్యం దక్కిందని చెప్పుకొచ్చారు. తన చివరి శ్వాస వరకు ప్రజాసేవలో ఉంటానని స్పష్టం చేశారు. తన రాజకీయ ప్రస్థానంలో తనకు సహకరించిన ముఖ్యమంత్రులు, అధికారులకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ధన్యవాదాలు తెలిపారు.




# 16 రాష్ట్రాలు, 3 కేంద్ర పాలిత ప్రాంతాల్లో సర్ ప్రక్రియ

- జాబితాలో ఉభయ తెలుగు రాష్ట్రాలు
- కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటన

**న్యూఢిల్లీ,మే14 :** దేశంలోని 16 రాష్ట్రాలు, 3 కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఓటర్ల జాబితాల 'ప్రత్యేక విస్తృత సవరణ' (సర్) మూడవ దశను ప్రారంభించనున్నట్లు భారత ఎన్నికల సంఘం గురువారం ప్రకటించింది. హిమాచల్ ప్రదేశ్, జమ్ముకశ్మీర్, లడఖ్ మినహా దేశం మొత్తం 'సర్' పరిధిలోకి వస్తుందని ఈసీ వెల్లడిం చింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తో పాటు మహారాష్ట్ర, పంజాబ్, హర్యానా, జార్ఖండ్, కర్ణాటక, ఒడిశా, ఉత్తరాఖండ్, మణిపూర్, మేఘాలయ, మిజోరం, నాగాలాండ్, సిక్కిం, త్రిపుర, అరుణాచల్ ప్రదేశ్ రాష్ట్రాలు, దేశ రాజధాని ఢిల్లీ, చండీగఢ్, దాద్రా- నగర్ హవేలి- దమన్-దియు కేంద్ర పాలిత ప్రాంతాల్లో మూడో దశ 'సర్' పక్రియ నిర్వహించనున్నారు. కాగా, 'సర్' మూడో దశలో భాగంగా 3.94 లక్షల మందికి పైగా బూత్ స్థాయి అధికారులు (బీఎల్వోలు), జనాభా గణనకు రాజకీయ పార్టీలు నియమించిన 3.42 లక్షల మంది బూత్ స్థాయి ఏజెంట్ల (బీఎల్ఏల) సహాయంతో ఇంటింటికి వెళ్లి 36.73 కోట్ల మంది ఓటర్ల వివరాలు తనిఖీ చేస్తారని ఈసీ తెలిపింది. మే 30 నుంచి అక్టోబర్ 14 వరకు 'సర్' మూడో దశ పక్రియ జరుగుతుందని పేర్కొంది. జూలై 5 నుంచి అక్టోబర్ 21 వరకు ముసాయిదా ఓటర్ల జాబితాల ప్రచురణ కొనసాగుతుందని ఈసీ వెల్లడించింది.

# కేరళ సీఎంగా విడి సతీశన్



- ఉత్కంఠకు తెరదించిన కాంగ్రెస్
- పదరోజుల కసరత్తు అనంతరం ప్రకటన

**తిరువనంతపురం,మే14 :** కేరళ సీఎం పోస్టుపై ఉత్కంఠ వీడింది. ఆ రాష్ట్రానికి తదుపరి సీఎంగా వీడీ సతీశన్ ను కాంగ్రెస్ అధిష్ఠానం ఎంపిక చేసింది. ఈ పదవి కోసం కె.సి. వేణుగోపాల్, రమేశ్ చెన్నితాల నుంచి గట్టి పోటీ ఎదురైంది. చివరకు సతీశన్‌నే ముఖ్యమంత్రి పదవి వరించింది. గత నెలలో జరిగిన కేరళ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ విజయం సాధించింది. మొత్తం 140 స్థానాల్లో పోటీపడిన ఈ కూటమి 102 చోట్ల విజయం సాధించింది. అయితే ముఖ్యమంత్రి పదవికి పోటీ ఎక్కువగా ఉండటంతో సతీశన్ ఎంపికకు అధిష్ఠానం పది రోజుల సమయం తీసుకోవడం గమనార్హం. కొచ్చికి సమీపంలోని నెట్టూర్‌లో 1964లో వీడీ సతీశన్ జన్మించారు. వృత్తిరీత్యా న్యాయవాది అయిన ఆయన.. సామాజిక కార్యకర్తగానూ పేరొందారు. కేరళ విద్యార్థి విభాగంతో ఆయన రాజకీయ ప్రస్థానం మొదలైంది. తర్వాత యూత్ కాంగ్రెస్‌లో చేరి, పార్టీని బలంగా ముందుకు తీసుకెళ్లారు. మంచి వక్తగానూ గుర్తింపు వచ్చింది. తర్వాత కాంగ్రెస్‌లో ఒక్కో మెట్టు ఎక్కుతూ ప్రజానేతగా, ఎలాంటి గ్రూపు రాజకీయాలకు తావివ్వకుండా సంస్కరణాభిలాషిగా ఎదిగారు. 2001లో పరావూర్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి బరిలో నిలిచి, వరుసగా ఆరుసార్లు విజయం సాధించారు. 2021లో ఆయన కెరీర్ మలుపు తిరిగింది. ఆ ఎన్నికల్లో ఎల్‌డీఎఫ్ గెలుపొందగా.. యూడీఎఫ్ విపక్షానికే పరిమితమైంది. కానీ ఆయన అసెంబ్లీలో ప్రతిపక్ష నేతగా నియమితులయ్యారు. పాలనాపరంగా ఎలాంటి అనుభవం లేని సతీశన్‌ను ప్రతిపక్ష నేతగా నియమిస్తూ తీసుకున్న నిర్ణయంపై అప్పట్లో పలువురు అనుమానం వ్యక్తంచేశారు. కానీ ఎల్‌డీఎఫ్‌ను ఎదుర్కొనే నేతగా తనను తాను నిరూపించుకున్నారు. అవినీతి, గోల్డ్ స్మగ్లింగ్ వివాదం, శాంతి భద్రతలు, పరిపాలనాపరమైన వైఫల్యాలను ఎత్తిచూపి పినరయి విజయన్ ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టారు. జాతీయ స్థాయిలో కాంగ్రెస్ పార్టీ పరాజయాలతో సతమతమవుతుంటే.. రాష్ట్రంలో మాత్రం హస్తం పార్టీ శ్రేణుల్లో ఆయన ఉత్సాహం నింపారని రాజకీయ విమర్శకులే అంగీకరించిన సందర్భాలున్నాయి. ఎన్నికల వేళ రాష్ట్రవ్యాప్తంగా విస్తృతంగా ప్రచారం నిర్వహించిన.. విజయన్(ఖతినిజీసజాతి ÷ఎతితీజాజీని)కు ప్రధాన పోటీదారుగా తనను తాను నిరూపించుకున్నారు. క్షేత్రస్థాయిలోకి బలంగా చొచ్చుకెళ్లారు. అందుకే సీఎం ఎంపిక కోసం ఏఐసీసీ పరిశీలకులు జరిపిన



అభిప్రాయ సేకరణలో కూడా ఇదే విషయం వెల్లడైంది. పార్టీ ఎమ్మెల్యేల్లో అత్యధికులు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కె.సి.వేణుగోపాల్ నాయకత్వం వైపు మొగ్గు చూపగా, ప్రజల్లో మటుకు సతీశన్ పేరు ఎక్కువగా వినిపించింది. దాంతో ప్రజాభిప్రాయం వైపే మొగ్గు చూపిన అధిష్ఠానం చివరకు ఆయన్నే సీఎం పదవికి ఎంపిక చేయాల్సివచ్చింది.

# పదేపదే విమర్శలు తగని పని

- అభివృద్ధి కోసం కష్టపడితే అడ్డుకోవడం సరికాదు
- వైసిపి నేత బైరెడ్డి తీరుపై మండిపడ్డ మంత్రి టిజి భరత్

**కర్నూలు,మే14 :** అదే పనిగా విమర్శలు యచేయడం మానుకోవాలని వైసీపీ నేత బైరెడ్డి సిద్దార్థ్ రెడ్డిపై ఏపీ పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి టీజీ భరత్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం కర్నూలు వేదికగా ఆయన మీడియాతో మాట్లాడారు. కర్నూల్‌లో తమ పోలింగ్ బూత్ ఇన్‌చార్జి సునీల్‌పై హత్యాయత్నం జరిగిందని తెలిపారు. ఈ విషయంపై పోలీసులు బాలు అనే వైసీపీ వ్యక్తిని విచారించారని అన్నారు. దీంతో ఈ అంశాన్ని డ్రామా రూపంలో బైరెడ్డి తెరపైకి తీసుకువచ్చారని ధ్వజమెత్తారు. ఆయనకు మైండ్ లేక ఇలాంటి ఆరోపణలు చేస్తున్నారని ఆగ్రహించారు. బైరెడ్డి సిద్దార్థ్ రెడ్డి ఒక జోకర్ అని జగన్‌కు కూడా తెలుసునని ఎద్దేవా చేశారు. తనపై లేని పోని ఆరోపణలు చేస్తే చూస్తూ ఊరుకోనని హెచ్చరించారు. ఇంతవరకూ తమపై బైరెడ్డిలాగా ఆరోపణలు చేసిన వారు ఎవరు లేరని అన్నారు. ఈ విషయంలో తాను బైరెడ్డి సిద్దార్థ్ రెడ్డిపై పరువు నష్టం దావా వేస్తానని హెచ్చరించారు. ఈ పరువు నష్టం దావా కేసును ఆయన ఎలా ఫేస్ చేస్తారో చూస్తానని వార్నింగ్ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచి పరిశ్రమలు, కంపెనీల రాకకోసం తాము ఎంతగా కష్టపడుతున్నామో ప్రజలందరికీ తెలుసునని మంత్రి టీజీ భరత్ చెప్పుకొచ్చారు. ఐటీ కంపెనీలు, పరిశ్రమలు ఏపీకి తీసుకురావడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్, తాను ఎంతో కష్టపడుతు న్నామని వ్యాఖ్యానించారు. సీబీఎన్ బ్రాండ్ మూలంగానే తాము వీటిని సాధించ గలుగుతున్నామని ఉద్ఘాటించారు. తమ మైండ్‌ను డైవర్ట్ చేయడానికి కర్నూలుకు బైరెడ్డి అనే ఓ జోకర్ వచ్చారని ఎద్దేవా చేశారు. ఆయన ఇక్కడకు వచ్చి పిట్టకథలు చెబుతున్నారని సెటైర్లు గుప్పించారు. బైరెడ్డి కర్నూలుకు వచ్చి తనపై లేని పోని ఆరోపణలు చేశారని ధ్వజమెత్తారు. ఆయన చేసిన ఆరోపణలపై తాను పశ్చాత్తాపం చెందాల్సి వస్తోందని పేర్కొన్నారు. బైరెడ్డి సిద్దార్థ్ రెడ్డికి చేతనైతే కర్నూలు నుంచి 2029 ఎన్నికల్లో వైసీపీ నుంచి టికెట్ తెచ్చుకోవాలని మంత్రి టీజీ భరత్ సవాల్ విసిరారు. ప్రజలు అప్పుడు ఆయనను గెలిపిస్తారో లేదో చూద్దామని అన్నారు. బైరెడ్డి చిన్నవయసులోనే జైలుకెళ్లారని.. హత్యకేసులో కూడా ఉన్నారని ఆరోపించారు. ఓర్వకల్లులో పరిశ్రమల కోసం తాము ఎంతో కష్టపడుతున్నామని చెప్పుకొచ్చారు. ఆయన వీటి గురించి తెలియకుండా చిల్లరగా మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. సోషల్ మీడియాలో వైరల్ అయితే.. తాను చాలా గొప్పవాడినని బైరెడ్డి అనుకుంటున్నారని విమర్శించారు. అందుకనే ఆయనకు జోకర్



బైరెడ్డి సిద్దార్థ్ రెడ్డి అని పేరు పెడుతున్నానని ఎద్దేవా చేశారు. తాను సీరియస్‌గా రాజకీయాలు చేస్తే తట్టుకోగలవా అని ప్రశ్నించారు. ఆయనకు నోటికి వచ్చినట్లుగా ఏది పడితే అది మాట్లాడితే చూస్తూ ఊరుకోనని హెచ్చరించారు. కర్నూలు వచ్చి స్టాండప్ కామెడీ షోలా.. బైరెడ్డి షో చేసి వెళ్లిపోయారని మంత్రి టీజీ భరత్ సెటైర్లు గుప్పించారు.

# పొదుపు మంత్రంపై మహా సిఎం వినూత్న ప్రయోగం

- రాయల్ ఎన్‌ఫీల్డ్‌పై విధాన సభకు పయనం

**ముంబై,మే14 :** పశ్చిమాసియా సంక్షోభంతో ప్రధాని నరేంద్ర మోదీ పొదుపు మంత్రం పాటిస్తున్న సంగతి తెలిసిందే. పెట్రోల్, గ్యాస్, డీజిల్ వినియోగాన్ని తగ్గించాలని ఇటీవల భారతదేశ ప్రజలకు ప్రధాని పిలుపునిచ్చారు. ఎన్డీయే పాలిత రాష్ట్రాలు మోదీ పిలుపును ఆహ్వానించాయి. ఈ మేరకు ముఖ్యమంత్రులు, మంత్రులు తమ కాన్వాయ్‌ల సంఖ్యను తగ్గిం చుకుంటున్నారు. ఈ నేపథ్యంలో మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ ఒక అడుగు ముందుకేసి సంచలన నిర్ణయం తీసుకున్నారు. తన కార్ల కాన్వాయ్‌కి బదులుగా ద్విచక్రవాహ నాలను ఎంచుకున్నారు. గురువారం మహారాష్ట్ర శాసన



మండలికి కొత్తగా ఎన్నికైన సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవం జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరయ్యేందుకు ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ ద్విచక్రవాహనంపై బయలుదేరారు. తన అధికారిక నివాసం నుంచి రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్‌పై విధాన భవన్‌కు వెళ్లారు. సీఎంతో పాటు మంత్రి ఆశిష్ షెలార్, భద్రతా సిబ్బంది కూడా ద్విచక్రవాహనాలపై శాసన మండలికి చేరుకున్నారు. దీనికి సంబంధించిన ఫొటోలు, వీడియోలను ఎక్స్ వేదికగా ఫడ్నవీస్ పోస్టు చేశారు. 'ప్రధాని మోదీ పిలుపు మేరకు పొదుపు చర్యల్లో భాగంగా దేశం కోసం ఇది నా వంతు సహకారం. ప్రతి ఒక్కరూ దేశం కోసం తమ జీవనశైలిలో మార్పులు చేసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నా' అంటూ ఆయన పోస్టు చేశారు. కాగా, ప్రపంచ మార్కెట్‌లో ఇంధన ధరలు పెరుగుతున్న నేపథ్యంలో వినియోగాన్ని తగ్గించాలని దేశ ప్రజలకు ప్రధాని మోదీ విజ్ఞప్తి చేశారు. ఈ దిశగా ఆయన తన కాన్వాయ్‌ని 15 నుంచి కేవలం రెండు కార్లకు తగ్గించారు. తాజా కాన్వాయ్‌లో రేంజ్ రోవర్, టయోటా ఫార్చ్యూనర్ మాత్రమే ఉన్నాయి. ప్రధాని పిలుపుతో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్, మంత్రులు కూడా తమ కాన్వాయ్‌ల సంఖ్యను తగ్గించుకున్నారు.

మరోవైపు ఢిల్లీ ప్రభుత్వం ఉద్యోగులపై ఆంక్షలు విధించింది. ప్రభుత్వ క్వార్టర్ల నుంచి కార్యాలయాలకు వెళ్లేందుకు మెట్రోస్టేషన్ల మీదుగా ప్రత్యేక షటిల్ బస్సులను వినియోగించాలని తెలిపింది. ప్రజలు కూడా కార్లలో కాకుండా బస్సులు, మెట్రోలో ప్రయాణించాలని విజ్ఞప్తి చేసింది.

# పొదుపు చర్యలకు దిగిన ఢిల్లీ ప్రభుత్వం

- వారానికి రెండు రోజులు వర్క్ ఫ్రమ్ హోమ్
- వారానికి ఒకరోజు నో వెహికిల్ డే
- సిఎం రేఖాగుప్తా పలు నిర్ణయాలు ప్రకటన

**న్యూఢిల్లీ,మే14 :** దేశవ్యాప్తంగా ఇంధన పొదుపు, పర్యావరణ పరిరక్షణ, ప్రజా రవాణా వినియోగంపై కేంద్ర ప్రభుత్వం దృష్టి సారిస్తోంది. ఈ నేపథ్యంలో ఢిల్లీ ప్రభుత్వం కూడా కీలక నిర్ణయాలు తీసుకుంది. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఇచ్చిన పొదుపు సూత్రాల పిలుపు మేరకు ఢిల్లీ ప్రభుత్వం పలు సంస్కరణాత్మక చర్యలను ప్రకటించింది. ముఖ్యమంత్రి రేఖాగుప్తా ఆధ్వర్యంలో తీసుకున్న ఈ నిర్ణయాలు ప్రభుత్వ ఖర్చులు తగ్గించడం, ఇంధన వినియోగ నియంత్రణ, ప్రజా రవాణా ప్రోత్సాహంపై కేంద్రీకృతమై ఉన్నాయి. ట్రాఫిక్ రద్దీ తగ్గించడం, ఇంధన వినియోగాన్ని నియంత్రించడం లక్ష్యంగా ఢిల్లీ ప్రభుత్వం ఉద్యోగులకు వారానికి రెండు రోజులు వర్క్ ఫ్రం హోమ్ విధానాన్ని అమలు చేయాలని నిర్ణయించింది. ఈ నిర్ణయం రేపటి నుంచే అమల్లోకి వస్తుందని సీఎం రేఖా గుప్తా ఆదేశాలు జారీ చేశారు. ఈ విధానం వల్ల ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే వాహనాల సంఖ్య తగ్గి, కాలుష్య నియంత్రణకు తోడ్పడుతుందని ప్రభుత్వం భావిస్తోంది. ప్రభుత్వ ఖర్చులు తగ్గించడంలో భాగంగా సీఎం కాన్వాయ్‌లోని వాహనాల సంఖ్యను నాలుగుకు పరిమితం చేశారు. ఇందులో రెండు ఎలక్ట్రిక్ వాహనాలను వినియోగించాలని నిర్ణయించారు. ప్రజలకు ఆదర్శంగా నిలవాలనే ఉద్దేశంతో ఈ చర్యలు చేపట్టినట్లు ప్రభుత్వం తెలిపింది.పౌరుల్లో దేశభక్తి, సామాజిక



బాధ్యత పెంపొందించే లక్ష్యంతో 'నా భారతదేశం ? నా కర్తవ్యం' పేరుతో ప్రత్యేక ఉద్యమాన్ని ఢిల్లీ ప్రభుత్వం ప్రారంభించింది. ఈ కార్యక్రమం 90 రోజుల పాటు కొనసాగనుంది.ఇంధన పొదుపు, ప్రజా రవాణా వినియోగం, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలపై ప్రజల్లో అవగాహన కల్పించడం ఈ ఉద్యమం ప్రధాన లక్ష్యం. ప్రభుత్వ ఉద్యోగులు, మంత్రులు, ఉన్నతాధికారులు ప్రతి సోమవారం తప్పనిసరిగా ఢిల్లీ మెట్రోలోనే ప్రయాణించాలని ప్రభుత్వం ఆదేశించింది. దీనిని 'మండే మెట్రో' పేరుతో ప్రత్యేక కార్యక్రమంగా అమలు చేయనున్నారు. ఈ నిర్ణయం ద్వారా ప్రజారవాణా వినియోగాన్ని ప్రోత్సహించడమే కాకుండా, ట్రాఫిక్ రద్దీ తగ్గించాలనే లక్ష్యాన్ని ప్రభుత్వం ముందుకు తీసుకెళ్తోంది. సామాన్య ప్రజలు కూడా వారంలో కనీసం ఒక రోజైనా 'నో వెహికిల్ డే' పాటించాలని ప్రభుత్వం సూచించింది. వ్యక్తిగత వాహనాల వినియోగాన్ని తగ్గించి, సైకిళ్లు, మెట్రో, బస్సులు వంటి పర్యావరణహిత రవాణా మార్గాలను వినియోగించాలని కోరింది. ప్రభుత్వ శాఖలు వచ్చే ఆరు నెలల వరకు పెట్రోల్, డీజిల్, ఎలక్ట్రిక్ వాహనాల కొనుగోలు చేయొద్దని ప్రభుత్వం నిర్ణయించింది. అవసరమైతే ఇప్పటికే ఉన్న వాహనాలనే వినియోగించాలని ఆదేశాలు జారీ చేసింది. ఇది ప్రభుత్వ ఖర్చులను తగ్గించడమే కాకుండా, వనరుల సమర్థ వినియోగానికి దోహదపడుతుందని అధికారులు పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు ట్రాన్స్‌పోర్ట్ అలవెన్స్‌ను 10 శాతం పెంచుతూ ఢిల్లీ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ప్రజా రవాణా వినియోగాన్ని ప్రోత్సహించేందుకు ఈ చర్య తీసుకున్నట్లు తెలిపింది. ప్రభుత్వ వ్యయ నియంత్రణలో భాగంగా వచ్చే ఏడాది వరకు అన్ని విదేశీ అధికారిక పర్యటనలను పూర్తిగా రద్దు చేశారు. అత్యవసర పరిస్థితులు మినహా విదేశీ ప్రయాణాలకు అనుమతి ఉండదని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఢిల్లీ ఇప్పటికే వాయు కాలుష్య సమస్యతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు పర్యావరణ పరిరక్షణకు కీలకంగా మారే అవకాశం ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. వర్క్ ఫ్రం హోమ్, మెట్రో వినియోగం, నో వెహికిల్ డే వంటి చర్యలతో వాహనాల సంఖ్య తగ్గి కాలుష్యం నియంత్రణలోకి వచ్చే అవకాశముందని భావిస్తున్నారు.



## జిల్లా స్థాయిలో 'ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక' సభ

**- కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల :**

రాజన్న సిరిసిల్ల: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకగా చేపట్టిన 'ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక' 99 రోజుల కార్యాచరణలో భాగంగా ఈ నెల 22న (శుక్రవారం) జిల్లా స్థాయి సభను నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో సభ నిర్వహణపై కలెక్టర్ గరిమ అగ్రవాల్ దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ

ప్రభుత్వ ఆదేశాల మేరకు సభ ప్రాంగణంలో ఆరు గ్యారంటీలు మరియు వివిధ పథకాల ప్రగతిని వివరించేలా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని, లబ్ధిదారుల వివరాలతో కూడిన ప్రత్యేక కరపత్రాలను రూపొందించి పంపిణీ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమానికి జిల్లా మంత్రి, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులతో పాటు స్వయం సహాయక సంఘాల సభ్యులు, యువత, రైతులు మరియు లబ్ధిదారులను భారీ సంఖ్యలో ఆహ్వానించాలని తెలిపారు. సభలో తెలంగాణ రాష్ట్ర గీతం 'జయ జయహే తెలంగాణ' ఆలపించడంతో పాటు ముఖ్యమంత్రి సందేశాన్ని వినిపించాలని, అనంతరం లబ్ధిదారులు తమ అనుభవాలను, అభిప్రాయాలను అందరితో పంచుకునేలా వేదిక కల్పించాలని ఆదేశించారు.?ముఖ్యంగా రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.500 కే గ్యాస్ సిలిండర్, గృహజ్యోతి, సన్న వడ్లకు బోనస్, చేయూత పెన్షన్లు, కళ్యాణలక్ష్మి వంటి పథకాల ద్వారా చేకూరిన ప్రయోజనాలపై చర్చించాలని పేర్కొన్నారు. ఇప్పటి వరకు సాధించిన విజయాల రిపోర్ట్‌ను సిద్ధం చేయడంతో పాటు, భవిష్యత్తులో చేపట్టబోయే అభివృద్ధి పనులపై తీర్మానాలు చేయాలని అధికారులను ఆదేశించారు.

**18 నుంచి పర్యాటక, యువజన వారోత్సవాలు**

ఇదే క్రమంలో జిల్లాలో ఈ నెల 18 నుంచి 23 వరకు పర్యాటక శాఖ మరియు యువజన వారోత్సవాలను ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. 18న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో '2కే రన్' నిర్వహించనున్నట్లు తెలిపారు. 21న సమ్మర్ క్యాంప్ పిల్లలతో 'స్పోర్ట్స్ డే' నిర్వహించాలని, 22న ఆధ్యాత్మిక, పర్యాటక ప్రాంతాల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలతో పాటు జిల్లా స్థాయి సాంస్కృతిక పోటీలు చేపట్టాలని సూచించారు. వారోత్సవాల ముగింపు సందర్భంగా 23వ తేదీన నిరుద్యోగ యువత కోసం 'మెగా జాబ్ మేళా' నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, సీపీఓ శ్రీనివాసాచారి, ఉపాధి కల్పన అధికారి రాఘవేందర్, యువజన క్రీడల శాఖ అధికారి రాందాస్, పరిశ్రమల శాఖ అధికారులు హనుమంతు, భారతి, సిరిసిల్ల మున్సిపల్ కమిషనర్ ఖదీర్ పాషా తదితరులు పాల్గొన్నారు.



## త్వరితగతిన ధాన్యం తరలించాలి..

**-అదనపు కలెక్టర్ గడ్డం నగేష్**

**బలగం టీవీ, ఎల్లారెడ్డిపేట :**

కొనుగోలు కేంద్రాల్లో సేకరించిన ధాన్యాన్ని త్వరితగతిన తరలించాలని అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ ఆదేశించారు.ఎల్లారెడ్డిపేట మండలంలోని బొప్పాపూర్, గంభీరావుపేట మండల కేంద్రం, మండలంలోని మల్లారెడ్డిపేట, ముస్తాఫానగర్ గ్రామంలోని కొనుగోలు కేంద్రాల్లో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ గురువారం తనిఖీ చేశారు. లారీల కొరత లేకుండా వాహనాలను సమకూర్చాలని ట్రాన్స్పోర్ట్ కాంట్రాక్టర్లను ఆదేశించారు.అలాగే గంభీరావుపేట మండలం లింగన్నపేటలోని శ్రీ వెంకటేశ్వర ఇండస్ట్రీస్, లక్ష్మీనారాయణ ఇండస్ట్రీస్, కొత్తపల్లిలోని వాయుపుత్ర ఇండస్ట్రీస్ లో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ తనిఖీ చేసి.. ధాన్యం లారీలను వెంట వెంటనే అన్ లోడింగ్ చేయించాలని ఆదేశించారు. హమాలీల సంఖ్యను పెంచాలని సూచించారు. పరిశీలనలో గంభీరావుపేట తహసీల్దార్ మారుతి రెడ్డి, అధికారులు, కేంద్రాల నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.



## సమయపాలన పాటించని సిబ్బందిపై చర్యలు తప్పవు..

**-జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ రజిత**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల :**

రాజన్న సిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా వైద్య ఆరోగ్య కేంద్రాల్లో విధులు నిర్వహించే సిబ్బంది ఖచ్చితమైన సమయపాలన పాటించాలని, నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ రజిత హెచ్చరించారు. గురువారం రుద్రంగి మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్ర నూతన భవన నిర్మాణ పనులను పరిశీలించడంతో పాటు, చందుర్తి మరియు అనుమాజీపేట పీహెచ్‌సీలను వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ రజిత ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా డాక్టర్ రజిత మాట్లాడుతూ.. పెరుగుతున్న ఉష్ణోగ్రతల దృష్ట్యా సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా వడదెబ్బ నివారణకు అవసరమైన మందులను అన్ని కేంద్రాల్లో సిద్ధంగా ఉంచాలని అన్నారు.?గ్రామ స్థాయిలో ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు మరియు పంచాయతీ సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ ప్రజల్లో అవగాహన పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా డాటా మేనేజర్ కార్తీక్, సంబంధిత వైద్యాధికారులు మరియు ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

## నిరంతర గస్తీతో దొంగతనాలకు చెక్...

**- ఎస్పీ మహేష్ బి. గితే**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**



నిరంతర గస్తీతో దొంగతనాలకు చెక్ పెట్టాలని, బ్లూ కోల్ట్స్ మరియు పెట్రో కార్ల సిబ్బంది నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ క్షేత్రస్థాయిలో నిఘా పెంచాలని జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే అధికారులను ఆదేశించారు. కోనరావుపేట పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్‌లోని రికార్డులను, నమోదైన కేసుల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం పోలీసు అధికారులకు మరియు సిబ్బందికి పలు కీలక ఆదేశాలు జారీ చేశారు.ఈ సందర్భంగా ఎస్పీ మహేష్ బి. గితే మాట్లాడుతూ ?స్టేషన్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న కేసులను వెంటనే పూర్తి చేయాలని, దర్యాప్తులో ఎటువంటి అలసత్వం వహించరాదని అన్నారు . బాధితులకు న్యాయం జరిగేలా చూస్తూ, నిందితులకు చట్టపరంగా శిక్ష పడేలా పక్కా ఆధారాలతో దర్యాప్తు సాగించాలని ఆదేశించారు. ప్రజల నుండి వచ్చే ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని, పోలీసు యంత్రాంగం ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు.?గ్రామాల్లో విజిబుల్ పోలీసింగ్‌ను మరింత బలోపేతం చేయాలని పేర్కొన్నారు. తరచుగా గ్రామాలను సందర్శిస్తూ ప్రజలతో మమేకం కావాలని, ముఖ్యంగా సైబర్ మోసాల బారిన పడకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. రోడ్డు భద్రత విషయంలో రాజీ పడకూడదని, వాహనదారులు హెల్మెట్ మరియు సీట్ బెల్ట్ ధరించేలా చూడాలని, మైనర్ డ్రైవింగ్ మరియు మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు.ఏదైనా అవాంఛనీయ సంఘటన జరిగినప్పుడు ఆలస్యం చేయకుండా సంఘటనా స్థలానికి చేరుకుని సమస్యను పరిష్కరించాలన్నారు. ఇక్కడ సి.ఐ రవీందర్, ఎస్.ఐ ప్రశాంత్ రెడ్డి మరియు ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# పొద్దుతిరుగుడు పంట కొనుగోలు చేయాలి

## రైతులు రోడ్డు పై వంటవార్పు..

**-ఎమ్మెల్యే డౌన్... డౌన్ అంటూ మహిళ రైతుల నిరసన**

**-తహసీల్దార్ హామీ తో ధర్నా విరమణ**

**బలగం, టీవీ ఇల్లంతకుంట**

ఇల్లంతకుంట మండలంలో పొద్దుతిరుగుడు, మొక్కజొన్న పంటలను కొనుగోలు చేయాలంటూ రైతులు రోడ్డు పై బైటాయించి నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మండల కేంద్రం లోని వివేకానంద చౌరస్తా వద్దకు రైతులు ర్యాలీగా చేరుకొని చౌరస్తా వద్ద రోడ్డు పై బైటయించి వంటవర్పు కార్యక్రమం చేపట్టారు. మహిళా రైతులు పాల్గొని ఎమ్మెల్యే డౌన్ డౌన్ సీఎం డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. తాము అరుగాలం కస్టపడి పండించిన పంటను కొనే నాథుడే లేడని ఆగ్రహం వ్యక్తం చేశారు. కలెక్టర్ వచ్చేంత వరకు ధర్నా విరమించమని భీష్మించుకొని కూర్చున్నారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ సురేష్ ధర్నా చౌరస్తాకు చేరుకొని రైతులతో మాట్లాడి స్పష్టమైన హామీ ఇవ్వడంతో రైతులు శాంతించి ధర్నా కార్యక్రమం విరమించారు. ఈ



కార్యక్రమం లో పలు గ్రామాల రైతులు, మహిళా రైతులు తదితరులు పాల్గొన్నారు

# అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి..



**-కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల :**

రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ మండలంలో జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ గురువారం విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా వివిధ అభివృద్ధి పనులు మరియు ధాన్యం కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ గరిమ అగ్రవాల్ స్వయంగా పరిశీలించి అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు.

మొదటగా వేములవాడ మండలం అగ్రహారంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో నిర్మిస్తున్న జిల్లా డిగ్రీ బాలికల హాస్టల్ భవన నిర్మాణ పనులను తనిఖీ చేశారు. విద్యార్థినుల సౌకర్యార్థం చేపట్టిన ఈ భవన నిర్మాణ పనుల్లో జాప్యం జరగకుండా వేగం పెంచాలని, నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్అధికారులను ఆదేశించారు.

అనంతరం వేములవాడ మున్సిపల్ పరిధిలోని ఆర్టీసీ డిపో సమీపంలో కొనసాగుతున్న మినీ స్టేడియం పనులను కలెక్టర్ పరిశీలించారు. స్టేడియం గ్రౌండ్ సిద్ధం చేస్తున్న తీరును, వివిధ క్రీడల కోసం ప్రత్యేకంగా నిర్మించిన గదులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. క్రీడాకారులకు ఇబ్బంది కలగకుండా అన్ని వసతులు కల్పించాలని ఈ సందర్భంగా సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు.పర్యటనలో భాగంగా చంద్రగిరిలో ఏర్పాటు చేసిన ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కూడా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సదర్శించారు. అక్కడ ఉన్న ధాన్యం కుప్పలను పరిశీలించి, తూకం ప్రక్రియ మరియు ధాన్యం తరలింపు వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కొనుగోలు చేసిన ధాన్యం కేంద్రాల్లో నిలిచిపోకుండా ఎప్పటికప్పుడు మిల్లులకు తరలించేలా తగినన్ని లారీలను సమకూర్చాలని ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టర్లను గరిమ అగ్రవాల్ కఠినంగా ఆదేశించారు. రైతులు ఇబ్బంది పడకుండా కొనుగోలు ప్రక్రియను సజావుగా సాగించాలని స్పష్టం చేశారు. పరిశీలనలో వేములవాడ ఆర్డీఓ కేఎస్ బీ కుమారి, టీజీఈడబ్ల్యూఐడీసీ ఈఈ అశోక్ కుమార్, డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, జిల్లా పౌర సరఫరాల అధికారి బుచ్చిబాబు, మేనేజర్ నరసింహ, అదనపు డీఆర్డీఓ శ్రీనివాస్, తహసీల్దార్ జయంత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు

## నూతన గోడౌన్ల నిర్మాణానికి కార్యాచరణ సిద్ధం చేయాలి..

**కలెక్టర్ గరిమ అగ్రవాల్.**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల :**



జిల్లాలో నూతన గోడౌన్ల నిర్మాణానికి కార్యాచరణ సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు.ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా , స్టేట్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ (ఎస్ డబ్ల్యూసీ), నాబార్డ్, పరిశ్రమల శాఖ, ఎల్ డీ ఎం తహసీల్దార్లు, మార్క్ ఫెడ్, మార్కెటింగ్ శాఖ ఇతర శాఖల అధికారులతో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో గురువారం అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ తో కలిసి జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సమీక్ష సమావేశం నిర్వహించారు.జ కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ ఎఫ్ సీఐ, ఎస్ డబ్ల్యూసీ, మార్క్ ఫెడ్ తదితర శాఖల ఆధ్వర్యంలో పంట ఉత్పత్తుల నిల్వ కోసం గోడౌన్ల నిర్మాణానికి కార్యాచరణ సిద్ధం చేయాలని సూచించారు. స్థలాలు గుర్తించాలని, నిర్మాణాలకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. త్వరితగతిన పనులు చేపట్టి అందుబాటులోకి తీసుకురావాలని తెలిపారు. సమావేశంలో జిల్లా సహకార అధికారి రామకృష్ణ, మార్కెటింగ్ అధికారి ప్రకాశ్, మార్క్ ఫెడ్ అధికారి హబీబ్, జిల్లా పౌర సరఫరాల శాఖ మేనేజర్ నరసింహ, నాబార్డ్ డీడీఎం దిలీప్, పరిశ్రమల శాఖ అధికారి హనుమంతు, లీడ్ బ్యాంక్ మేనేజర్ మల్లికార్జున రావు, ఎస్ డబ్ల్యూసీ, ఎఫ్ సీ ఐ అధికారులు, తహసీల్దార్లు, తదితరులు పాల్గొన్నారు.

# బక్రీద్ వేళ శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించండి



**-ఎస్పీ మహేష్ బి. గితే**

**బలగం టీవీ , రాజన్న సిరిసిల్ల**

రానున్న బక్రీద్ పండుగను పురస్కరించుకుని జిల్లాలో శాంతిభద్రతలు, సామరస్య వాతావరణం కొనసాగేందుకు ప్రతి ఒక్కరూ పోలీస్ శాఖకు సహకరించాలని ఎస్పీ మహేష్ బి. గితే పిలుపునిచ్చారు. గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలో హిందూ సంఘాల ప్రతినిధులతో సమావేశం నిర్వహించినారు.ఈ సందర్భంగా ఎస్పీ మహేష్ బి. గితే మాట్లాడుతూ పండుగ వేళ అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జిల్లా సరిహద్దుల్లో మూడు చెక్ పోస్టులు ఏర్పాటు చేయడంతో పాటు, అన్ని స్టేషన్ల పరిధిలో 24/7 వాహన తనిఖీలు నిర్వహిస్తూ పశువుల అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా ఉంచినామని అన్నారు .

పశువుల రవాణాకు సంబంధించి 1977 నాటి గోవధ నిరోధక చట్టం, 1978 నాటి ట్రాన్స్‌పోర్ట్ ఆఫ్ యానిమల్స్ రూల్స్, మరియు 1960 నాటి ప్రివెన్షన్ ఆఫ్ క్రూయెల్టీ టు యానిమల్స్ చట్టాలను కచ్చితంగా అమలు చేస్తామని అన్నారు . నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన క్రిమినల్ కేసులు నమోదు చేయడంతో పాటు, అవసరమైతే రౌడీ షీట్లు మరియు సస్పెక్ట్ షీట్లు కూడా తెరుస్తామని హెచ్చరించారు. గత ఏడాది కూడా ఇటువంటి ఉల్లంఘనలపై రెండు కేసులు నమోదు చేసామని అన్నారు.శాంతిభద్రతల విషయంలో ఎవరూ చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకోకూడదని, కేవలం అనుమానంతో రోడ్ల దిగ్బంధనాలు చేయడం లేదా ఘర్షణాత్మక పరిస్థితులు సృష్టించవద్దని సూచించారు. పశువుల అక్రమ రవాణాపై సమాచారం ఉంటే జిల్లా పోలీస్ కార్యాలయంలోని హెల్ప్‌లైన్ నంబర్ 8712537826 కు లేదా నోడల్ అధికారి స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ నంబర్ 87126 56410 కు సమాచారం అందించాలని కోరారు. సీజ్ చేసిన పశువుల కోసం జిల్లాలో ఇప్పటికే 9 ఆశ్రయ కేంద్రాలను సిద్ధం చేసి, అక్కడ వెటర్నరీ డాక్టర్లతో పాటు మేత, నీరు వంటి సౌకర్యాలు కల్పించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో డీఎస్పీలు నాగేంద్రచారి, శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, సి.ఐ రవి, ఎస్.ఐ శ్రీకాంత్ మరియు పలు హిందూ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక చర్యలు...

**- ఎస్పీ మహేష్ బి. గితే.**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఎస్పీ మహేష్ బి. గితే అన్నారు.గురువారం కొనరావుపేట మండలం ధర్మారం గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మరియు రైస్ మిల్లును ఎస్పీ మహేష్ బి. గితే సందర్శించినారు. అధికారులను కొనుగోలు ప్రక్రియను గురించి అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఎస్పీ మహేష్ బి. గితే మాట్లాడుతూ

ధాన్యం కొనుగోలు ప్రక్రియను మరింత వేగవంతంగా మరియు సమర్థవంతంగా నిర్వహించడంతో పాటు రైతులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చూడాలని సూచించారు. కొనుగోలు కేంద్రం వద్ద ఉన్న రైతుల సమస్యలు అడిగి తెలుసుకొని సంబంధిత అధికారులుదృష్టికి తీసుకెళ్లి వాటిని పరిష్కరిస్తామని తెలిపారు.రైతులు కష్టపడి పండించిన ధాన్యాన్ని మాయమాటలు చెప్పే దళారులకు అమ్మి మోసపోవద్దని సూచించారు.దాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద ఎలాంటి సమస్యలు ఎదురైనా వెంటనే స్థానిక పోలీస్ అధికారులకు సమాచారం అందించాలని కోరారు.ఇక్కడ సి.ఐ రవీందర్, ఎస్.ఐ ప్రశాంత్ రెడ్డి సిబ్బంది ఉన్నారు.



# ఢిల్లీ మద్యం కేసుపై సామాజిక మాధ్యమాల్లో దుష్ప్రచారం

- **తీవ్రంగా పరిగణించిన ఢిల్లీ హైకోర్టు**

**బలగం టీవి, హైదరాబాద్**

ఢిల్లీ మద్యం విధానం కేసుకు సంబంధించి న్యాయవ్యవస్థపై సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న దుష్ప్రచారాన్ని ఢిల్లీ హైకోర్టు తీవ్రంగా పరిగణించింది. న్యాయమూర్తులను, కోర్టు విచారణలను కించపరిచేలా వ్యవహరిస్తున్నారంటూ ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) అధినేత అరవింద్ కేజ్రీవాల్ సహా పలువురు ఆప్ నేతలపై కోర్టు ధిక్కార చర్యలకు ఉపక్రమించింది. ఈ మేరకు జస్టిస్ స్వర్ణకాంత శర్మ గురువారం కీలక ఉత్తర్వులు జారీ చేశారు. న్యాయపరమైన అంశాలను కోర్టులో ఎదుర్కోవాల్సింది పోయి, వాటిని సోషల్ మీడియా వేదికగా ప్రజల్లోకి తీసుకెళ్లి.. న్యాయవ్యవస్థపై వ్యతిరేకతను పెంచేలా ప్రచారం చేస్తున్నారని కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. తనపై, న్యాయస్థానంపై అత్యంత హేయమైన, కోర్టు ధిక్కారపూరితమైన అంశాలను ఉద్దేశపూర్వకంగా ప్రచారం చేస్తున్నారని జస్టిస్ స్వర్ణకాంత శర్మ పేర్కొన్నారు. కేజ్రీవాల్ ఈ న్యాయ వివాదాన్ని ఓ బహిరంగ ప్రచారంగా మార్చేశారన్న ఆమె.. ఇది న్యాయ ప్రక్రియను అగౌరవపరచడమేనని అభిప్రాయపడ్డారు. గతంలో తాను ఒక కళాశాల కార్యక్రమంలో ప్రసంగించిన ఓ వీడియోను ప్రస్తుత కేసుకు ముడిపెడుతూ, అసందర్భంగా సోషల్ మీడియాలో వైరల్ చేయడాన్ని న్యాయమూర్తి తప్పుపట్టారు. ఇలాంటి చర్యలు ప్రజల్లో న్యాయవ్యవస్థ పట్ల తప్పుడు అభిప్రాయాన్ని కలిగిస్తాయని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. న్యాయవ్యవస్థ ప్రతిష్ఠను దిగజార్చేలా సాగుతున్న ఈ దుష్ప్రచారాన్ని ఉపేక్షించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ఈ మేరకు కేజ్రీవాల్‌తో పాటు ఆప్ ఎంపీ సంజయ్ సింగ్, పార్టీ నేతలు వినయ్ మిశ్రా, సౌరభ్ భరద్వాజ్‌లకు కూడా కోర్టు ధిక్కార నోటీసులు జారీ అయ్యాయి. న్యాయవ్యవస్థపై బురదజల్లేలా వ్యవహరించినందుకు సమాధానం ఇవ్వాలని ఆదేశించింది న్యాయస్థానం. రాజకీయ పోరాటాలు ప్రజాక్షేత్రంలో జరగాలని, కానీ న్యాయస్థానాల తీర్పులను, న్యాయమూర్తుల వ్యక్తిత్వాన్ని కించపరిచేలా సామాజిక మాధ్యమాలను వాడుకోవడం ప్రజాస్వామ్యానికి చేటు చేస్తుందని ఈ సందర్భంగా కోర్టు హెచ్చరించింది. కాగా.. మద్యం పాలసీ కేసులో ఇప్పటికే రాజకీయ ప్రకంపనలు కొనసాగుతుండగా, తాజాగా హైకోర్టు తీసుకున్న ఈ ధిక్కార చర్యల నిర్ణయం దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది.

# నేడు జిల్లాకు రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ రాక

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

రాజన్న సిరిసిల్ల జిల్లాలో శుక్రవారం తెలంగాణ రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్‌పర్సన్ సీతా దయాకర్ రెడ్డి మరియు కమిషన్ సభ్యులు పర్యటించనున్నారని జిల్లా సంక్షేమ అధికారి పి. లక్ష్మీరాజం గురువారం ఓ ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా సంక్షేమ అధికారి పి. లక్ష్మీరాజం మాట్లాడుతూ ఈ పర్యటనలో భాగంగా ఉదయం 8:30 గంటలకు వేములవాడ క్షేత్రంలో శ్రీ రాజరాజేశ్వర స్వామి వారిని దర్శించుకోనున్న సభ్యులు, అనంతరం సిరిసిల్ల పట్టణంలో కే కన్వెన్షన్' హాల్‌లో ఉదయం 10:30 గంటలకు గ్రామ మరియు వార్డు స్థాయిలో బాలల హక్కుల రక్షణ కమిటీల ఏర్పాటు, వాటి ఆవశ్యకత మరియు పనితీరుపై ప్రజాప్రతినిధులకు, క్షేత్రస్థాయి అధికారులకు అవగాహన కల్పించనున్నారని అన్నారు.?ఈ కార్యక్రమానికి జిల్లాలోని సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు మరియు అంగన్‌వాడీ టీచర్లు పెద్ద సంఖ్యలో సకాలంలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.




# ఎల్లారెడ్డిపేట మండలంలో ఘనంగా బడిబాట కార్యక్రమం

**ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్యాబోధన**

**మండల విద్యాధికారి కృష్ణ హరి**

**బలగం టీవీ, ఎల్లారెడ్డిపేట :**

రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎల్లారెడ్డిపేట లో 'బడిబాట' కార్యక్రమం గురువారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఎలగందుల నరసింహులు ఉప సర్పంచ్ బంధారపు బాల్రెడ్డి పాఠశాల ప్రధానోపాధ్యాయులు మనోహర చార్యులు ముఖ్య అతిథులుగా పాల్గొని, విద్యా సంవత్సరం ప్రారంభం సందర్భంగా విద్యార్థులను, తల్లిదండ్రులను ఉద్దేశించి ప్రసంగించారు.

ఈ సందర్భంగా సర్పంచ్ ఎలగందుల నరసింహులు మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో ప్రభుత్వం కల్పిస్తున్న వసతులను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని కోరారు. అర్హులైన పిల్లలందరినీ బడిలో చేర్పించి, గ్రామాన్ని వంద శాతం అక్షరాస్యత కలిగిన గ్రామంగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు తిరుమల మనోహర చార్యులు మాట్లాడుతూ తమ పాఠశాలలో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయుల ద్వారా నాణ్యమైన విద్యాబోధనతో పాటు, విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి పెద్దపీట వేస్తున్నామని తెలిపారు. డిజిటల్ తరగతులు, మధ్యాహ్న భోజన పథకం మరియు ఇతర ప్రభుత్వ పథకాల గురించి తల్లిదండ్రులకు వివరించారు. అనంతరం గ్రామంలోని పలు వీధుల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. "బడిబాట-మన బాధ్యత" అంటూ నినాదాలు చేస్తూ విద్యార్థులను బడికి పంపాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎల్లారెడ్డిపేట విద్యాధికారి కృష్ణ హరి పాఠశాల ఉపాధ్యాయ బృందం, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ సభ్యులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.




# కేబుళ్ల వల్ల ప్రజలకు ప్రమాదం జరిగితే సహించం

**- కేబుల్ ఆపరేటర్ల సమావేశంలో ఎంఎంసి కమిషనర్ వినయ్ కృష్ణా రెడ్డి**

**బలగం టీవి, హైదరాబాద్**

వేలాడుతున్న వైర్ల వల్ల ప్రజల భద్రతకు ఎలాంటి ప్రమాదం జరిగినా సహించబోమని మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వినయ్ కృష్ణా రెడ్డి స్పష్టం చేశారు. గురువారం తార్నాకలోని ప్రధాన కార్యాలయంలో కేబుల్ ఆపరేటర్ సంస్థలు, ఇంటర్నెట్ సర్వీస్ ప్రొవైడర్లతో సమావేశం నిర్వహించారు. నగరంలో వేలాడుతున్న కేబుళ్లు, వైర్ల నిర్వహణ, ప్రజల భద్రతకు సంబంధించిన అంశాలపై ఈ సమావేశంలో చర్చించారు. కమిషనర్ మాట్లాడుతూ ఉపయోగంలో లేని, అవసరం లేని వైర్లను వెంటనే విద్యుత్ స్తంభాల నుంచి తొలగించాలని అన్ని సంస్థలను ఆదేశించారు. ప్రస్తుతం వినియోగంలో ఉన్న కేబుళ్లను సక్రమంగా కట్టిపెట్టాలని, రోడ్లపై లేదా బహిరంగ ప్రదేశాల్లో వేలాడేలా వదిలేయరాదని సూచించారు. మిగిలిపోయిన లేదా తొలగించిన వైర్లను సంబంధిత సంస్థలే పూర్తిగా తొలగించి తీసుకెళ్లాలని స్పష్టం చేశారు. ప్రస్తుతం అనేక బ్రాడ్‌బ్యాండ్ ఇంటర్నెట్ కనెక్షన్లు, కేబుల్ సేవలు థర్డ్ పార్టీ ఆపరేటర్ల ద్వారా అందిస్తున్నందున, కేబుళ్ల ఏర్పాటు, నిర్వహణ సమయంలో సరైన పద్ధతులు పాటించే బాధ్యత ఆయా సంస్థలదేనని కమిషనర్ తెలిపారు. ప్రాంతాల వారీగా పని చేస్తున్న ఆపరేటర్లు, థర్డ్ పార్టీ ఏజెన్సీలు కనెక్షన్లు ఇస్తున్నప్పుడు అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని, అన్ని కేబుళ్లు, వైర్లను బాధ్యతాయుతంగా నిర్వహించాలని సంస్థలకు సూచించారు. నియంత్రిత కేబుళ్లు, వేలాడుతున్న వైర్ల వల్ల ప్రజల భద్రతకు ఎలాంటి ప్రమాదం జరిగినా సహించబోమని కమిషనర్ హెచ్చరించారు. ప్రజలకు అసౌకర్యం, ప్రమాదాలు కలగకుండా తక్షణమే సరిదిద్దే చర్యలు తీసుకోవాలని, లేకపోతే సంబంధిత సంస్థలపైనే బాధ్యత వహింపజేస్తామని స్పష్టం చేశారు.

# 18న అంతర్జాతీయ మ్యూజియం దినోత్సవం

- **వేడుకలు ఘనంగా నిర్వహిస్తామన్న కలెక్టర్**

**బలగం టీవి, విజయవాడ**

ఈ నెల 18న అంతర్జాతీయ మ్యూజియం దినోత్సవాన్ని పురస్కరించుకుని విజయవాడలో వైభవంగా వేడుకలు నిర్వహించనున్నట్లు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. నగరంలోని చరిత్రాత్మక బాపు మ్యూజియం కేంద్రంగా ఆ రోజున ఎన్టీఆర్ జిల్లా టూరిజం కౌన్సిల్, ఆర్కియాలజీ విభాగం, ఆంధ్రప్రదేశ్ టూరిజం, విజయవాడ ఉత్సవ కమిటీ సంయుక్తంగా కార్యక్రమాలు చేపడుతున్నట్లు వెల్లడించారు. 1887లో స్థాపించిన బాపు మ్యూజియం స్వాతంత్ర్యోద్యమ చరిత్రకు నిలువెత్తు సాక్ష్యమని కలెక్టర్ లక్ష్మీశ పేర్కొన్నారు. భారత జాతీయ జెండా రూపకర్త పింగళి వెంకయ్య.. మహాత్మా గాంధీకి జాతీయ పతాకాన్ని అందించిన చారిత్రక ప్రదేశంగా ఈ మ్యూజియానికి ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. అంతర్జాతీయ మ్యూజియం దినోత్సవం సందర్భంగా బాపు మ్యూజియంలోని విక్టోరియా

హాల్‌లో నిర్వహించే లేజర్ షోకు ప్రజలకు ఉచిత ప్రవేశం కల్పిస్తున్నట్లు తెలిపారు. సాంకేతికత, డిజిటలైజేషన్, మ్యూజియంల భవిష్యత్తు' అనే అంశంపై నిపుణులతో ప్రత్యేక చర్చా కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. విద్యార్థులతో సంగీత, వోకల్ ప్రదర్శనలు ఆకట్టుకునేలా ఉంటాయని తెలిపారు. సాయంత్రం మున్సిపల్ స్టేడియం వద్ద భారీ స్థాయిలో 'లైవ్ మ్యూజికల్ కాన్సర్ట్' నిర్వహించనున్నట్లు వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సుమారు 14 మ్యూజియాల్లో కూడా అంతర్జాతీయ మ్యూజియం దినోత్సవ వేడుకలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

# ఇంటర్ విద్యా విధానంలో మార్పులు..!

**ఫస్టియర్ నుంచే ప్రాక్టికల్ పరీక్షలు**

**మార్పులకు సిద్ధం అవుతున్న బోర్డు**

**బలగం టీవి, హైదరాబాద్**




ఇంటర్ విద్యా విధానంలో తెలంగాణ ఇంటర్మీడియట్ విద్యామండలి కీలక మార్పులు చేపట్టేందుకు సిద్ధమైంది. 2026-27 విద్యా సంవత్సరం నుంచి కొత్త విధానాన్ని అమలు చేయాలని నిర్ణయించింది. విద్యార్థుల్లో ప్రాక్టికల్ నాలెడ్జ్, కాన్సెప్ట్ ఆధారిత అభ్యాసం పెంచడమే లక్ష్యంగా ఈ మార్పులు చేసింది. కొత్త విధానంలో సైన్స్, మ్యాథ్స్, భాషా విభాగాల్లో పరీక్షల సరళి, మార్కుల విధానం, ప్రాక్టికల్స్ నిర్వహణలో కీలక మార్పులు చోటుచేసుకోనున్నాయి. ఇప్పటి వరకు ఇంటర్ సెకండియర్‌లో మాత్రమే ప్రాక్టికల్స్ నిర్వహించగా, కొత్త విధానంలో ఇంటర్ ఫస్టియర్ నుంచే ప్రాక్టికల్స్ ప్రవేశపెట్టనున్నారు. ప్రత్యేకంగా ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీ విభాగాల్లో ఫస్టియర్ విద్యార్థులకు కూడా ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించనున్నారు. కొత్త విధానం ప్రకారం.. ఇంటర్ ఫస్టియర్‌లో, సెకండియర్‌లో 15 మార్కుల చొప్పున ప్రాక్టికల్స్ నిర్వహించనుంది. దీంతో విద్యార్థులు కేవలం థియరీకే పరిమితం కాకుండా ప్రయోగాత్మక పరిజ్ఞానాన్ని కూడా అభివృద్ధి చేసుకునే అవకాశం ఉంటుంది. మ్యాథమేటిక్స్ బోధనలోనూ కీలక మార్పులు తీసుకురానుంది. సంప్రదాయ పద్ధతికి బదులుగా యాక్టివిటీ బేస్డ్ లెర్నింగ్‌ను అమలు చేయనుంది. దీంతో విద్యార్థులు సూత్రాలను అర్థం చేసుకోవడం, సమస్య పరిష్కార నైపుణ్యాలు పెంపొందించుకోవడం, కాన్సెప్ట్ ఆధారిత విద్యనభ్యసించడం వంటి ప్రయోజనాలు పొందే అవకాశం ఉంది. ప్రస్తుతం మ్యాథ్స్‌లో 75 మార్కులకు ఫైనల్ పరీక్ష నిర్వహిస్తుండగా, కొత్త విధానంలో దాన్ని 60 మార్కులకు తగ్గించనుంది. అదేవిధంగా యాక్టివిటీలు, ఇంటర్నల్ అసెస్‌మెంట్‌కు ప్రాధాన్యం పెంచే అవకాశం ఉంది.

ఇప్పటివరకు ఇంటర్ పరీక్షలు 100 మార్కులకు నిర్వహించగా, ఇకపై వాటిని 80 మార్కులకు నిర్వహించనున్నట్లు సమాచారం. మిగిలిన మార్కులను ఇంటర్నల్ అసెస్‌మెంట్ ప్రాక్టికల్స్, యాక్టివిటీ బేస్డ్ లెర్నింగ్ ద్వారా కేటాయించే అవకాశం ఉంది. తెలుగు, ఇంగ్లీష్, హిందీ వంటి భాషా విభాగాల్లో 20 మార్కులను ఇంటర్నల్ అసెస్‌మెంట్‌కు కేటాయించనుంది. ఇందులో ప్రాజెక్టులు సెమినార్లు, అసైన్‌మెంట్లు, క్లాస్‌రూమ్ పనితీరు ఆధారంగా మార్కులు ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. ఈ కొత్త విధానంతో విద్యార్థులపై పరీక్షల ఒత్తిడి కొంతమేర తగ్గే అవకాశం ఉందని విద్యా నిపుణులు భావిస్తున్నారు. ఒక్క ఫైనల్ పరీక్ష ఆధారంగా కాకుండా, ఏడాది పొడవునా విద్యార్థుల పనితీరును అంచనా వేసే విధానం అమల్లోకి రానుంది. ఈ సంస్కరణలు జాతీయ విద్యా విధానం(ఔఇఖ)కు అనుగుణంగా తీసుకువస్తున్నట్లు సమాచారం. విద్యార్థుల్లో సృజనాత్మకత, విశ్లేషణాత్మక ఆలోచన, ప్రాక్టికల్ నాలెడ్జ్ పెంపొందించడమే ప్రధాన లక్ష్యంగా విద్యా నిపుణులు పేర్కొంటున్నారు. ఇంటర్ విద్యా విధానంలో వస్తున్న ఈ మార్పులు విద్యార్థులు, తల్లిదండ్రుల్లో ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి.

# చేప ప్రసాదం ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలి



- **వచ్చేనెల 8న మృగశిర కార్తి సందర్భంగా పంపిణీ**
- **లక్షలాదిగా తరలివచ్చే భక్తుల కోసం పటిష్ట చర్యలు**
- **జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్**

**బలగం టీవి, హైదరాబాద్**

ప్రతిష్టాత్మకమైన 179 ఏండ్ల చరిత్ర కలిగిన 'చేప ప్రసాదం' పంపిణీ కార్యక్రమానికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించారు. జూన్ 8న నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో నిర్వహించనున్న ఈ కార్యక్రమంపై మంత్రులు వాకిటి శ్రీహరి, మొహమ్మద్ అజారుద్దీన్, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్‌లతో కలిసి గురువారం హైదరాబాద్ జిల్లా కలెక్టరేట్‌లో ఆయన ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా, ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మెన్ మెట్టు సాయి కుమార్, వివిధ శాఖల అధికారులు, బత్తిని కుటుంబ సభ్యులు, సామాజిక సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

వచ్చేనెల 8వ తేదీ ఉదయం 11 గంటల నుంచి మరుసటి రోజు ఉదయం వరకు 24 గంటల పాటు మృగశిర కార్తి ముహూర్తంలో ఈ ప్రసాదం పంపిణీ చేయనున్నారు. దేశ విదేశాల నుంచి సుమారు లక్షలాది మంది ఆస్తమా బాధితులు, భక్తులు తరలివచ్చే అవకాశం ఉందని, తొలుత సుమారు 60 వేల మందికి అవసరమైన ఏర్పాట్లు సిద్ధంగా ఉంచాలని మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. ఎండ తీవ్రత దృష్ట్యా నిరంతర తాగునీటి సరఫరా, ప్రాంగణమంతా చల్లదనానికి వాటర్‌ప్రూఫ్ షెడ్లు, రాత్రంతా వెలుతురు ఉండేలా లైటింగ్ ఏర్పాటు చేయాలన్నారు. భారీ జనసమ్మర్ధం దృష్ట్యా పోలీసులు పటిష్ట బందోబస్తు నిర్వహించాలనీ, ముఖ్యంగా పిక్‌పాకెటింగ్, చైన్ స్నాచింగ్ వంటి ఘటనలు జరగకుండా నిఘా ఉంచాలన్నారు. సీపీఆర్ శిక్షణ పొందిన వైద్య సిబ్బందిని, మందులు, అంబులెన్సులను అందుబాటులో ఉంచాలనీ, భక్తుల కోసం ఆర్టీసీ అదనపు బస్సులను నడపాలని, ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ.. 1847 నుంచి బత్తిని కుటుంబం నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం హైదరాబాద్ ప్రత్యేకత అని, దీన్ని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఫిషరీస్ శాఖ ద్వారా నాణ్యమైన చేపలను తగిన స్థాయిలో అందుబాటులో ఉంచాలని సూచించారు. మంత్రి అజారుద్దీన్ మాట్లాడుతూ.. ఇది అన్ని మతాల వారు విశ్వాసంతో వచ్చే కార్యక్రమమని, అధికారులందరూ నిబద్ధతతో పనిచేయాలని కోరారు. ఈ సమావేశంలో టీజీఎస్ ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాజశేఖర్, హైదరాబాద్ రీజినల్ మేనేజర్ సుధా పరిమళ, హైదరాబాద్ జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ సి.రమేష్, ప్రాంతీయ సమాచార అధికారి రాములు, ఆర్అండ్‌బీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మనోహర్, జిల్లా రెవెన్యూ అధికారి శ్రీధర్, హైదరాబాద్ ఆర్డీవో రామకృష్ణ, అగర్వాల్ సమాజ్, జైస్వాల్ సమాజ్, ఎగ్జిబిషన్ సొసైటీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# బ్యాంకుల వద్ద భద్రతపై రాజీ పడొద్దు..

**-డీఎస్పీ నాగేంద్రచారి**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**



బ్యాంకు అధికారులు, పోలీసులు సమన్వయంతో పనిచేస్తేనే నేరాలను అరికట్టవచ్చని సిరిసిల్ల డీఎస్పీ నాగేంద్రచారి అన్నారు. ఎస్పీ మహేష్ బి. గితే ఆదేశాల మేరకు గురువారం సిరిసిల్లలో బ్యాంకు అధికారులతో డీఎస్పీ నాగేంద్రచారి సమావేశం నిర్వహించినారు. ఈ సందర్భంగా డీఎస్పీ నాగేంద్రచారి మాట్లాడుతూ ప్రతి బ్యాంకు, ఏటీఎం వద్ద నాణ్యమైన సీసీ కెమెరాలు, సెక్యూరిటీ గార్డులు, అలారం వ్యవస్థ తప్పనిసరిగా ఉండాలని సూచించారు.?నేరగాళ్లు సీసీ కెమెరాలను ధ్వంసం చేసే అవకాశం ఉన్నందున, డీవీఆర్లను సురక్షితమైన ప్రదేశాల్లో ఏర్పాటు చేయాలని అన్నారు . ఏటీఎంలలో నగదు నింపే సమయంలో ముందస్తుగా పోలీసులకు సమాచారం అందిస్తే బ్లూ కోల్ట్స్ సిబ్బందిని అప్రమత్తం చేస్తామన్నారు. బ్యాంకులు, ఏటీఎంల వద్ద అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టౌన్ సీఐ శ్రీనివాస్ మరియు వివిధ బ్యాంకుల అధికారులు పాల్గొన్నారు.

# హైదరాబాద్‌లో అత్యాధునిక నీటి నాణ్యత పర్యవేక్షణ వ్యవస్థ




**బలగం టీవి, హైదరాబాద్**

నగరవాసుల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) ఒక చారిత్రాత్మక ముందడుగు వేసింది. మున్సిపల్ పరిపాలన, పట్టణాభివద్ధి శాఖ (ఎంఏఅండ్‌యూడీ) ప్రత్యేక ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ సమక్షంలో ఐఐటీ ఖరగ్‌పూర్, ఎయిమ్స్ (ఏఐఐఎంఎస్) ఢిల్లీ సంస్థలతో జీహెచ్ఎంసీ కీలక అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదుర్చుకుంది. ఈ ప్రాజెక్ట్ ముఖ్య ఉద్దేశ్యం హైదరాబాద్‌లో దేశంలోనే అత్యంత అధునాతనమైన నీటి నాణ్యత పర్యవేక్షణ, ముందస్తు హెచ్చరిక వ్యవస్థను ఏర్పాటు చేయడమే లక్ష్యంగా పెట్టుకుంది. జీహెచ్ఎంసీలో నిర్వహించిన సమావేశంలో కమిషనర్ కర్ణన్‌తోపాటు జీహెచ్ఎంసీ డాక్టర్ పద్మజ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్ మాట్లాడారు. ప్రాజెక్ట్ ప్రత్యేకతలను వివరించారు. సంప్రదాయ పద్ధతులకు భిన్నంగా, ఈ వ్యవస్థలో 'నాన్-థర్మల్ ప్లాస్మా స్పెక్ట్రోస్కోపీ' మరియు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సాంకేతికతను ఉపయోగిస్తారన్నారు. ఇది నీటి నమూనాల ఆప్టికల్ సిగ్నేచర్‌ను విశ్లేషించి కలుషితాలను వేగంగా గుర్తిస్తుందిని, భారీ లోహాలు, పారిశ్రామిక రసాయనాలు మరియు సూక్ష్మక్రిములను అత్యంత సూక్ష్మ స్థాయిలో కూడా గుర్తిస్తుందన్నారు. రాబోయే 12 నెలల పైలట్ దశలో భాగంగా హైదరాబాద్ అంతటా సుమారు 25,000 నీటి నమూనాలను సేకరించి, దాదాపు 1.9 మిలియన్ల విశ్లేషణాత్మక డేటా పాయింట్లను సృష్టించనున్నామన్నారు. ఐఐటీ ఖరగ్‌పూర్‌లోని 'స్కూల్ ఆఫ్ వాటర్ రిసోర్సెస్' శాస్త్రీయ మార్గదర్శకత్వం వహించగా, మెట్రోపాలిటన్ సర్వైలెన్స్ యూనిట్ (మీఖ) క్షేత్రస్థాయి కార్యకలాపాలను సమన్వయం చేస్తోందన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఎల్లప్పుడూ సాంకేతికత ఆధారిత పాలనకు ప్రాధాన్యత ఇస్తుందని, ఈ ప్రాజెక్ట్ ప్రజారోగ్య పరిరక్షణలో డేటా ఆధారిత నిర్ణయాలు తీసుకోవడానికి ఎంతో దోహదపడుతుందని పేర్కొన్నారు. ఐఐటీ ఖరగ్‌పూర్ డైరెక్టర్ ప్రొఫెసర్ సుమన్ చక్రవర్తి మాట్లాడుతూ, ఈ క్లిష్టమైన సవాలును పరిష్కరించడంలో తమ పరిశోధనా నైపుణ్యాన్ని అందించడానికి ఉత్సాహంగా ఉన్నామని తెలిపారు.

హైదరాబాద్‌లో విజయవంతమైన తర్వాత, ఈ వ్యవస్థను రాష్ట్రవ్యాప్తంగా విస్తరించాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఈ ప్రాజెక్ట్ జాతీయ స్థాయిలోని 'జల్ జీవన్ మిషన్' మరియు ఐక్యరాజ్యసమితి నిర్దేశించిన సుస్థిర అభివద్ధి లక్ష్యాలకు అనుగుణంగా సాగనుంది.

# విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడొద్దు..

**- పేద, బీసీ విద్యార్థుల అవకాశాలను కొల్లగొట్టడం దుర్మార్గం..**

**-జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు మ్యాకల పరశురాము**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

నీట్-యూజీ 2026 పరీక్ష పేపర్ లీక్ ఘటన దేశవ్యాప్తంగా విద్యార్థుల్లో తీవ్ర ఆందోళన, నిరాశను నింపిందని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు మ్యాకల పరశురాము గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా మ్యాకల పరశురాము మాట్లాడుతూ లక్షలాది మంది విద్యార్థులు రాత్రింబవళ్లు కష్టపడి, తమ కుటుంబాల ఆశలను మోస్తూ పరీక్షలకు సిద్ధమవుతుంటే, కొందరి నిర్లక్ష్యం మరియు అవినీతి వల్ల వారి భవిష్యత్తును అంధకారం చేయడం అత్యంత దుర్మార్గమని మండిపడ్డారు. విద్యార్థుల జీవితాలతో, తల్లిదండ్రుల కలలతో ఆడుకునే ఇటువంటి లీకేజీలు దేశ విద్యా వ్యవస్థపై నమ్మకాన్ని దెబ్బతీస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.ముఖ్యంగా పేద, బీసీ, ఎస్సీ, ఎస్టీ మరియు మైనార్టీ వర్గాలకు చెందిన విద్యార్థులు ఎంతో శ్రమించి పోటీ పడుతుంటే, కొందరు ధనబలంతో, అక్రమ మార్గాల్లో అవకాశాలను కొల్లగొట్టడం సామాజిక న్యాయానికి విరుద్ధమని అన్నారు . ఈ ఘటనపై కేంద్ర ప్రభుత్వం, ఎన్టీఏ మరియు దర్యాప్తు సంస్థలు తక్షణమే స్పందించి బాధ్యులపై నిర్దాక్షిణ్యంగా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పరీక్షల నిర్వహణలో పారదర్శకతను, పటిష్టమైన భద్రతా ప్రమాణాలను తీసుకురావాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.?విద్యార్థుల భవిష్యత్తును కాపాడటం ప్రభుత్వాల ప్రాథమిక బాధ్యత అని, ఈ విషయంలో అలసత్వం వహిస్తే సహించేది లేదని అన్నారు . అక్రమాలకు పాల్పడిన వారిపై కఠిన శిక్షలు పడే వరకు తమ పోరాటం కొనసాగుతుందని, విద్యార్థుల ఆశయాలను కాపాడేందుకు దేశవ్యాప్తంగా కఠిన చట్టాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.



# పంజాబ్‌కు ఇదో భంగపాటు!

**శివమెత్తిన తిలక్ వర్మ**
**ఆఖరి ఓవర్ థ్రిల్లర్‌లో ముంబై ఇండియన్స్ ఘనవిజయం**
**కెప్టెన్‌గా బుమ్రా బోణీ**
**ప్లే ఆఫ్స్ రేసు నుంచి తప్పుకున్నా.. పంజాబ్ ఆశలపై నీళ్లు చల్లిన ముంబై**

**బలగం టీవీ, ధర్మశాల**

ఐపీఎల్ 19వ సీజన్‌లో పంజాబ్ కింగ్స్ కష్టాలు కొనసాగుతూనే ఉన్నాయి. సొంతగడ్డపై జరిగిన హై-స్కోరింగ్ పోరులో ముంబై ఇండియన్స్ 6 వికెట్ల తేడాతో పంజాబ్‌ను మట్టి కరిపించింది. 201 పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో తిలక్ వర్మ (75 నాటౌట్) అద్భుత ఇన్నింగ్స్ ఆడి ముంబైకి చిరస్మరణీయ విజయాన్ని అందించాడు. కెప్టెన్‌గా తన తొలి మ్యాచ్‌లోనే జస్ప్రీత్ బుమ్రా జట్టును గెలిపించి శుభారంభం చేశాడు.

**తిలక్ పట్టు.. ముంబై హిట్టు!**

భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన ముంబైకి ఓపెనర్లు రియాన్ రికెల్టన్ (48), రోహిత్ శర్మ (25) మెరుపు ఆరంభాన్ని ఇచ్చారు. రికెల్టన్ బౌండరీల వర్షం కురిపించగా, ఈ జోడీని అజ్మతుల్లా విడదీశాడు. అనంతరం నమన్ ధిర్ (9), రోహిత్ శర్మ వరుసగా అవుట్ కావడంతో పంజాబ్ రేసులోకి వచ్చింది. అయితే, యువ సంచలనం తిలక్ వర్మ బాధ్యతాయుతంగా ఆడి రూథర్‌ఫోర్డ్‌తో కలిసి స్కోరు బోర్డును ముందుకు నడిపాడు. ఆఖరి ఓవర్లో 15 పరుగులు అవసరమైన వేళ, జాక్స్ (25 నాటౌట్) తొలి బంతికే సిక్సర్ బాదగా, తిలక్ వర్మ మరో సిక్సర్, ఫోర్‌తో మ్యాచ్‌ను ముగించాడు.



**ప్రభ్‌సిమ్రన్ మెరిసినా.. శార్దూల్ దెబ్బకు పంజాబ్ విలవిల**

అంతకుముందు బ్యాటింగ్ చేసిన పంజాబ్ కింగ్స్ నిర్ణీత 20 ఓవర్లలో 200 పరుగులు చేసింది. ఓపెనర్ ప్రభ్‌సిమ్రన్ సింగ్ (57) అర్ధ సెంచరీతో జట్టుకు బలమైన పునాది వేశాడు. అయితే, ముంబై బౌలర్ శార్దూల్ ఠాకూర్ (4-39) తన స్పెల్‌తో పంజాబ్ మిడిలార్డర్‌ను దెబ్బతీశాడు. దీపక్ చాహర్ కూడా రెండు వికెట్లతో రాణించాడు. ఒక దశలో 150 పరుగులు దాటడం కష్టమనుకున్న పంజాబ్‌ను అజ్మతుల్లా (38), విష్ణు వినోద్ (15 నాటౌట్) చివర్లో మెరుపులు మెరిపించి 200 దాటించారు. అయినప్పటికీ, తిలక్ వర్మ వీరవిహారంతో పంజాబ్‌కు ఓటమి తప్పలేదు.

**సంక్షిప్త స్కోర్లు:**

పంజాబ్ కింగ్స్: 201/20 ఓవర్లలో (ప్రభ్‌సిమ్రన్ 57, అజ్మతుల్లా 38; శార్దూల్ 4/39)

ముంబై ఇండియన్స్: 202/4 (తిలక్ వర్మ 75 నాటౌట్, రికెల్టన్ 48; అజ్మతుల్లా 2/30)



## సన్‌రైజర్స్ హైదరాబాద్ ప్లేఆఫ్స్ చేరాలంటే ..

**బలగం టీవి, హైదరాబాద్**

ఐపీఎల్ 2026లో భాగంగా అహ్మదాబాద్‌లోని నరేంద్రమోదీ స్టేడియంలో గుజరాత్ టైటాన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ చిత్తు చిత్తుగా ఓడిపోయిన సంగతి తెలిసిందే. 82 పరుగుల తేడాతో ఘోర ఓటమిని చవిచూసింది. ఫలితంగా ఎస్ఆర్‌హెచ్ నెట్‌రన్‌రేటు (0.331) దారుణంగా పడిపోయింది. ఈ ఓటమితో పాయింట్ల పట్టికలో ప్రస్తుతానికి సన్‌రైజర్స్ హైదరాబాద్ స్థానం మారకున్నా కూడా ప్లేఆఫ్స్ అవకాశాలు మాత్రం కొద్దిగా కష్టంగా మారాయి. మిగిలిన రెండు మ్యాచ్‌ల్లో గెలవాల్సిన పరిస్థితి ఉంది. ఈ సీజన్‌లో ఇప్పటి వరకు సన్‌రైజర్స్ హైదరాబాద్ 12 మ్యాచ్‌లు ఆడింది. ఇందులో 7 మ్యాచ్‌ల్లో విజయం సాధించింది. మరో 5 మ్యాచ్‌ల్లో ఓడిపోయింది. ప్రస్తుతం 14 పాయింట్లతో పట్టికలో మూడో స్థానంలో కొనసాగుతోంది. లీగ్ దశలో ఎస్ఆర్‌హెచ్ మరో రెండు మ్యాచ్‌లు మే 18న చెన్నైతో, మే22న ఆర్‌సీబీతో ఆడనుంది. అయితే ఎలాంటి సమీకరణాలతో సంబంధం లేకుండా ప్లేఆఫ్స్ బెర్తును ఖరారు చేసుకోవాలంటే.. సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు మిగిలిన రెండు మ్యాచ్‌లు.. చెన్నై, ఆర్‌సీబీపై విజయం సాధించాల్సి ఉంటుంది. అప్పుడు సన్‌రైజర్స్ ఖాతాలో 18 పాయింట్లు ఉంటాయి. మెరుగైన రన్‌రేటు కలిగి ఉంటే ఇతర జట్ల సమీకరణాలు కలిసి వస్తే టాప్-2లో కూడా చోటు దక్కించుకోవచ్చు. ఇక మిగిలిన రెండు మ్యాచ్‌ల్లో ఎస్ఆర్‌హెచ్ ఒక్క మ్యాచ్‌లో ఓడిపోయినప్పటికి కూడా ప్లేఆఫ్స్‌కు చేరుకునే అవకాశాలు ఉన్నాయి. అయితే.. అప్పుడు సన్‌రైజర్స్ ఖాతాలో 16 పాయింట్లు ఉంటాయి. అయినా కూడా ఇతర జట్ల ఫలితాలతో పాటు నెట్‌రన్‌రేటుపై ఆధారపడాల్సి ఉంటుంది. ఇందుకోసం నెట్‌రన్‌రేటును మెరుగు పరుచుకోవాల్సి ఉంటుంది. ఇదిలా ఉంటే.. మిగిలిన రెండు మ్యాచ్‌ల్లో సన్‌రైజర్స్ హైదరాబాద్ ఓడిపోతే మాత్రం అప్పుడు ప్లేఆఫ్స్ ఛాన్స్ సంక్లిష్టం అవుతుంది. 14 పాయింట్లే ఎస్ఆర్‌హెచ్ ఖాతాలో ఉంటాయి. నాలుగో స్థానంతోనైనా ప్లేఆఫ్స్‌లో అడుగుపెట్టే అవకాశం ఉంది. 14 పాయింట్లు సాధించిన మిగిలిన జట్ల కంటే ఎస్ఆర్‌హెచ్ రన్‌రేటు మెరుగ్గా ఉండడంతో పాటు మూడు కంటే ఎక్కువ జట్లు ఎస్ఆర్‌హెచ్ పాయింట్ల కంటే ఎక్కువగా ఉండకూడదు.

## పురుషుల క్రికెట్ జట్టుకు మహిళా కోచ్..



**బలగం టీవి, న్యూఢిల్లీ**

క్రికెట్ ప్రపంచంలో సరికొత్త అధ్యాయం మొదలైంది. క్రీడల్లో లింగ వివక్షను చెరిపివేస్తూ, ప్రతిభకు పట్టం కట్టే దిశగా ఇంగ్లాండ్ అండ్ వేల్స్ క్రికెట్ బోర్డు ఒక సంచలన నిర్ణయాన్ని తీసుకుంది. పురుషుల క్రికెట్ జట్టుకు కోచింగ్ ఇచ్చే బాధ్యతను ఒక మహిళా క్రికెటర్‌కు అప్పగించింది. ఇంగ్లాండ్ టెస్ట్ జట్టు (స్టోక్స్ సేన) కోసం ఫీల్డింగ్ కోచ్‌గా ఆ దేశ దిగ్గజ మహిళా క్రికెటర్ సారా టేలర్‌ను ఎంపిక చేస్తూ అధికారిక ప్రక్రియను పూర్తి చేసింది. పురుషుల అంతర్జాతీయ క్రికెట్ జట్టుకు ఒక మహిళ కోచ్‌గా వ్యవహరించబోతుండడం క్రీడా చరిత్రలోనే ఇదే తొలిసారి కావడం విశేషం. సారా టేలర్ ఇంగ్లాండ్ మహిళా క్రికెట్ జట్టులో ఒక అద్భుతమైన వికెట్ కీపర్ బ్యాటర్‌గా గుర్తింపు పొందింది. ప్రస్తుతం 37 ఏళ్ల వయసున్న సారా, తన సుదీర్ఘ కెరీర్‌లో ఇంగ్లాండ్ తరపున వివిధ ఫార్మాట్లలో మొత్తం 226 అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడింది. ఆమె వికెట్ల వెనుక చూపించే చురుకుదనం, బ్యాటింగ్‌లో ఆమెకున్న నైపుణ్యం ప్రపంచవ్యాప్తంగా ఎందరో అభిమానులను సంపాదించి పెట్టింది. మానసిక ఆరోగ్య సమస్యల కారణంగా ఆమె అంతర్జాతీయ క్రికెట్ నుండి రిటైర్మెంట్ ప్రకటించినప్పటికీ, కోచింగ్ రంగంలో తనదైన ముద్ర వేస్తోంది. సారా టేలర్‌కు కేవలం క్రీడాకారిణిగానే కాకుండా, కోచ్‌గా కూడా మంచి అనుభవం ఉంది. గతంలో ఆమె ఇంగ్లాండ్-ఎ జట్టు కోచింగ్ బృందంలో సభ్యురాలిగా పనిచేసింది. కేవలం జాతీయ స్థాయిలోనే కాకుండా, ఫ్రాంచైజీ క్రికెట్‌లోనూ ఆమె తన ప్రతిభను నిరూపించుకుంది. ససెక్స్ కౌంటీ జట్టుకు మరియు 'ది హండ్రెడ్' టోర్నమెంట్‌లో మాంచెస్టర్ ఒరిజినల్స్ జట్టుకు ఆమె ఫీల్డింగ్ కోచ్‌గా సేవలందించింది. ఈ క్రమంలో పురుషుల జట్లతో పనిచేసిన అనుభవం ఆమెకు ఉండడం, ఇప్పుడు ఇంగ్లాండ్ టెస్ట్ జట్టుకు (స్టోక్స్ సేన) కోచ్‌గా ఎంపికవడానికి ప్రధాన కారణమైంది. ప్రస్తుతం ఇంగ్లాండ్ టెస్ట్ జట్టు 'బజ్‌బాల్' శైలిలో దూకుడుగా ఆడుతోంది. బ్యాటింగ్, బౌలింగ్‌లోనే కాకుండా ఫీల్డింగ్‌లో కూడా అదే వేగం, చురుకుదనం అవసరమని బోర్డు భావించింది. ప్రపంచంలోని అత్యుత్తమ వికెట్ కీపర్లలో ఒకరిగా పేరుగాంచిన సారా టేలర్ పర్యవేక్షణలో, ఇంగ్లాండ్ ఆటగాళ్ల ఫీల్డింగ్ ప్రమాణాలు మరింత మెరుగుపడతాయని విశ్లేషకులు భావిస్తున్నారు. ముఖ్యంగా క్లోజ్-ఇన్ క్యాచింగ్, రిఫ్లెక్స్ పెంపొందించుకోవడంలో ఆమె సలహాలు ఆటగాళ్లకు ఎంతగానో ఉపయోగపడనున్నాయి. సాధారణంగా పురుషుల జట్లకు పురుషులే కోచ్‌లుగా ఉండడం మనం చూస్తుంటాం. కానీ సారా టేలర్ నియామకం ఈ సంప్రదాయాన్ని బద్దలు కొట్టింది. ఇది కేవలం ఒక నియామకం మాత్రమే కాదు, భవిష్యత్తులో మరికొంతమంది మహిళా కోచ్‌లు పురుషుల జట్లతో కలిసి పనిచేయడానికి ఒక మార్గదర్శిగా నిలుస్తుంది. మహిళా క్రికెటర్లకు కేవలం ఆటకు మాత్రమే పరిమితం కాకుండా, రిటైర్మెంట్ తర్వాత అత్యున్నత స్థాయి కోచింగ్ బాధ్యతలు చేపట్టవచ్చనే నమ్మకాన్ని ఈ నిర్ణయం కలిగించింది.

## ట్రై సిరీస్‌కు భారత ఏ జట్టును ప్రకటించిన బీసీసీఐ

**టీమ్‌ఇండియాలోకి వైభవ్ సూర్యవంశీ ఎంపిక**
**కెప్టెన్‌గా తిలక్ వర్మ, వైస్ కెప్టెన్‌గా రియాన్ పరాగ్**




**బలగం టీవి, న్యూఢిల్లీ**

రాజస్థాన్ రాయల్స్ చిచ్చరపిడుగు వైభవ్ సూర్యవంశీకి టీమ్‌ఇండియా పిలుపు అందింది. సెలక్టర్లు అతడిని భారత జాతీయ జట్టులోకి తీసుకున్నారు. ప్రస్తుతం క్రికెట్ లవర్స్ ఐపీఎల్? ఎంజాయ్? చేస్తున్న వేళ బీసీసీఐ మరో కీలక సిరీస్?కు భారత్- ఏ జట్టును ప్రకటించింది. వచ్చే నెల శ్రీలంక, అఫ్గానిస్థాన్? జట్లతో జరగనున్న ట్రై సిరీస్‌కు 15 మందితో కూడిన జట్టును వెల్లడించింది. ఈ జట్టుకు తిలక్ వర్మ కెప్టెన్?గా ఎంపికయ్యాడు. రియాన్ పరాగ్ వైస్?కెప్టెన్?గా వ్యవహరించనున్నాడు. ఈ సిరీస్?కు వైభవ్?ను కూడా ఎంపిక చేశారు.వైభవ్?తోపాటు పంజాబ్ కింగ్స్ ఓపెనర్లు ప్రియాంశ్ ఆర్య, ప్రభ్?సిమ్రన్ సింగ్, ఆయుశ్ బదోనీ, విప్రజ్ నిగమ్, హర్ష్ దూబే, యశ్ ఠాకూర్, హర్ష్ దూబే, సూర్యాంశ్ షెడ్గే, అర్షద్ ఖాన్? తొలిసారి టీమ్‌ఇండియా పిలుపు అందుకున్నారు. ఈ జట్టులో దాదాపు ప్రస్తుత ఐపీఎల్?లో అదరగొడుతున్న ఆటగాళ్లకే సెలక్టర్లు ప్రాధాన్యం ఇచ్చారు. అలాగే ఈ సిరీస్?తో వైభవ్?ను ఎప్పుడెప్పుడు టీమ్‌ఇండియా జట్టులో చూద్దామా అనుకున్న ప్రేక్షకుల ఎదురుచూపులకు తెరపడినట్లు అయ్యింది! మరి మన కుర్రాళ్లు ఎంతవరకు ఆకట్టుకుంటారో చూడాలి.కాగా, భారత్- శ్రీలంక- అఫ్గానిస్థాన్? జట్లు తలపడనున్న ఈ సిరీస్?ను వన్డే ఫార్మాట్?లో నిర్వహించనున్నారు. శ్రీలంక వేదికగా జూన్ 09న సిరీస్ ప్రారంభం కానుంది. తొలి మ్యాచ్?లో ఆతిథ్య శ్రీలంకతో భారత్ తలపడనుంది. ఒక్కో జట్టు ఈ సిరీస్?లో నాలుగేసి మ్యాచ్?లు ఆడుతుంది. టాప్ 2లో నిలిచిన రెండు జట్లు టైటిల్ ఫైట్?లో పాల్గొంటాయి. జూన్ 21న ఫైనల్ మ్యాచ్ ఉండనుంది.

**ట్రై సిరీస్‌కు భారత్ ఏ జట్టు**

తిలక్ వర్మ (కెప్టెన్), ప్రియాంశ్ ఆర్య, వైభవ్ సూర్యవంశీ, రియాన్ పరాగ్ (వైస్ కెప్టెన్), ఆయుష్ బదోని, నిశాంత్ సింధు, హర్ష్ దూబే, సూర్యాంశ్ షెడ్గే, ప్రభ్‌సిమ్రాన్ సింగ్ (వికెట్ కీపర్), కుమార్ కుషాగ్రా (వికెట్ కీపర్), విప్రజ్ నిగమ్, యశ్ ఠాకూర్, యుధ్‌వీర్ సింగ్, అన్షుల్ కంబోజ్, అర్షద్ ఖాన్'

## పవర్‌ప్లేలో నయా రికార్డు సృష్టించిన రబాడ

**బలగం టీవి, న్యూఢిల్లీ**

ఐపీఎల్ 2026 సీజన్‌లో సౌతాఫ్రికా స్పీడ్‌స్టర్ కగిసో రబడ తన ప్రతాపాన్ని కొనసాగిస్తున్నాడు. అహ్మదాబాద్ వేదికగా మంగళవారం సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరిగిన మ్యాచ్‌లో రబడ నిప్పులు చెరిగే బౌలింగ్‌తో ప్రత్యర్థి టాప్ ఆర్డర్‌ను కుప్పకూల్చాడు. ఈ మ్యాచ్‌లో తన కోటా 4 ఓవర్లలో కేవలం 28 పరుగులు మాత్రమే ఇచ్చి 3 కీలక వికెట్లు పడగొట్టాడు. ముఖ్యంగా కొత్త బంతితో రబడ వేసిన స్పెల్ ఈ సీజన్‌లోనే అత్యంత ప్రమాదకరమైనదిగా నిలిచింది. పవర్‌ప్లేలోనే అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్, స్మరణ్ రవిచంద్రన్ వంటి కీలక బ్యాటర్లను పెవిలియన్ పంపి హైదరాబాద్ టీమ్‌ను కోలుకోలేని దెబ్బ తీశాడు. ఈ అదిరిపోయే ప్రదర్శనతో రబడ ఐపీఎల్ చరిత్రలో ఒక అరుదైన మైలురాయిని చేరుకున్నాడు. ఈ సీజన్ పవర్‌ప్లే ఓవర్లలో రబడ ఇప్పటివరకు మొత్తం 16 వికెట్లు సాధించాడు. తద్వారా ఒకే ఐపీఎల్ సీజన్ పవర్‌ప్లేలో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్ల జాబితాలో మిచెల్ జాన్సన్ (2013), ట్రెంట్ బౌల్ట్ (2020) రికార్డులను సమం చేశాడు. ప్రస్తుతం రబడ కంటే ముందు కేవలం మహమ్మద్ షమీ మాత్రమే ఉన్నాడు. షమీ 2023 సీజన్‌లో పవర్‌ప్లేలో 17 వికెట్లు పడగొట్టి టాప్‌లో ఉన్నాడు. రబడ ప్రస్తుత ఫామ్ చూస్తుంటే ఈ రికార్డును బ్రేక్ చేయడం పెద్ద కష్టమేమీ కాదనిపిస్తోంది.ప్రస్తుత 2026 సీజన్ పవర్‌ప్లే వికెట్ల చార్ట్‌లో కూడా రబడ అందరికంటే చాలా ముందున్నాడు. రబడ 16 వికెట్లతో అగ్రస్థానంలో ఉండగా, భువనేశ్వర్ కుమార్ 12 వికెట్లతో రెండో స్థానంలో కొనసాగుతున్నాడు. జోఫ్రా ఆర్చర్, మహమ్మద్ సిరాజ్ చెరో 9 వికెట్లతో తర్వాత స్థానాల్లో ఉన్నారు. రబడ ఎకానమీ కొంచెం ఎక్కువగా ఉన్నప్పటికీ, వికెట్లు తీయడంలో మాత్రం తనదైన మార్క్ చూపిస్తున్నాడు. వికెట్లు తీయడం వల్ల ప్రత్యర్థి టీమ్ రన్ రేట్‌ను కంట్రోల్ చేయడంలో రబడ సక్సెస్ అవుతున్నాడు.ఈ మ్యాచ్‌లో రబడ దెబ్బకు సన్‌రైజర్స్ బ్యాటర్లు క్రీజులో నిలదొక్కుకోవడానికి చాలా ఇబ్బంది పడ్డారు. పవర్‌ప్లే ముగిసేసరికి హైదరాబాద్ స్కోరు కేవలం 34/4 మాత్రమే. ఈ సీజన్‌లో సన్‌రైజర్స్‌కు ఇది రెండో అత్యల్ప పవర్‌ప్లే స్కోరు కావడం గమనార్హం. అలాగే పవర్‌ప్లేలోనే 4 వికెట్లు కోల్పోవడం హైదరాబాద్ టీమ్‌కు ఈ సీజన్‌లో ఇదే మొదటిసారి. అంతకుముందు గుజరాత్ టైటాన్స్ బ్యాటర్లు సాయి సుదర్శన్, వాషింగ్టన్ సుందర్ హాఫ్ సెంచరీలతో రాణించి తమ జట్టుకు 168 పరుగుల గౌరవప్రదమైన స్కోరు అందించారు. ఆ తర్వాత టార్గెట్ ఛేజింగ్‌లో సన్‌రైజర్స్ సెటిల్ అవ్వకుండా రబడ ఆరంభం నుండే ఒత్తిడి పెంచాడు.ముందుగా అభిషేక్ శర్మను ఎక్స్‌ట్రా పేస్ ఇంకా బౌన్స్‌తో అవుట్ చేసిన రబడ, ఆ వెంటనే ఇషాన్ కిషన్‌ను తన ట్రాప్‌లో పడేసాడు. తన స్పెల్ మధ్యలో స్మరణ్ రవిచంద్రన్‌ను కూడా అవుట్ చేసి హైదరాబాద్ అగ్రెసివ్ బ్యాటింగ్ లైనప్‌ను కకావికలం చేసాడు. ఈ సీజన్ అంతటా రబడ తన రా పేస్, అక్యురేట్ లెంగ్త్ తో బ్యాటర్లను భయపెడుతున్నాడు. పిచ్ ఎలాంటిదైనా సరే తన బౌలింగ్‌తో వికెట్లు రాబట్టడం రబడకు వెన్నతో పెట్టిన విద్య. గుజరాత్ టైటాన్స్ దగ్గర ఐపీఎల్‌లోనే అత్యంత పవర్‌ఫుల్ పేస్ అటాక్ ఎందుకు ఉందో రబడ మరోసారి నిరూపించాడు.



## పాకిస్థాన్ టెస్టు క్రికెట్ జట్టులో పెను మార్పులు..!



**బలగం టీవి, న్యూఢిల్లీ**

పాకిస్థాన్ టెస్టు క్రికెట్ జట్టులో పెను మార్పులు చోటుచేసుకోనున్నట్లు సంకేతాలు వెలువడుతున్నాయి. బంగ్లాదేశ్‌తో జరిగిన తొలి టెస్టులో ఎదురైన ఘోర పరాజయం నేపథ్యంలో, ప్రస్తుత కెప్టెన్ షాన్ మసూద్‌ను తొలగించి, ఆ బాధ్యతలను తిరిగి స్టార్ బ్యాటర్ బాబర్ ఆజామ్‌కు అప్పగించాలని పాకిస్థాన్ క్రికెట్ బోర్డు యోచిస్తోంది. ఢాకాలోని షేర్-ఎ-బంగ్లా స్టేడియంలో బంగ్లాదేశ్‌తో జరిగిన తొలి టెస్టులో పాకిస్థాన్ 104 పరుగుల తేడాతో ఓటమిని చవిచూసింది. 268 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన పాక్ జట్టు రెండో ఇన్నింగ్స్‌లో కేవలం 163 పరుగులకే కుప్పకూలింది. షాన్ మసూద్ సారథ్యంలో పాకిస్థాన్ ఇప్పటివరకు ఆడిన 15 టెస్టుల్లో ఏకంగా 11 ఓటములను నమోదు చేయడం గమనార్హం. ఒక పాకిస్థాన్ కెప్టెన్‌కు ఇది అత్యంత చెత్త రికార్డుగా నిలిచింది. బ్యాటర్‌గా కూడా మసూద్ రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ విఫలమవడంతో (మొదటి ఇన్నింగ్స్‌లో 9, రెండో ఇన్నింగ్స్‌లో 2 పరుగులు), అతనిపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మోకాలి గాయం కారణంగా తొలి టెస్టుకు దూరమైన బాబర్ ఆజామ్, మే 18 నుండి ప్రారంభం కానున్న రెండో టెస్టు నాటికి పూర్తి ఫిట్‌నెస్ సాధించి జట్టులోకి వచ్చే అవకాశం ఉంది. ఇటీవల జరిగిన పాకిస్థాన్ సూపర్ లీగ్‌లో పెషావర్ జల్మీని ఛాంపియన్‌గా నిలబెట్టడంతో పాటు, టోర్నీలో అత్యధిక పరుగులు (11 ఇన్నింగ్స్‌ల్లో 588 పరుగులు) సాధించిన ఆటగాడిగా బాబర్ అద్భుతమైన ఫామ్‌లో ఉన్నాడు. పీసీబీలోని కీలక వ్యక్తులు బాబర్‌ను తిరిగి కెప్టెన్‌గా నియమించడం ద్వారా జట్టును గాడిలో పెట్టవచ్చని భావిస్తున్నారు. ప్రస్తుత ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ సైకిల్‌లో పాకిస్థాన్‌కు ఇంకా ఏడు టెస్టు మ్యాచ్‌లు మిగిలి ఉన్నాయి. ఈ కీలక దశలో అనుభవజ్ఞుడైన బాబర్ నాయకత్వమే సరైనదని బోర్డు వర్గాలు భావిస్తున్నట్లు సమాచారం. కేవలం టెస్టులకే పరిమితం కాకుండా, వచ్చే ఏడాది జరగనున్న వన్డే ప్రపంచకప్ నాటికి బాబర్‌ను వన్డే కెప్టెన్‌గా కూడా సిద్ధం చేయాలని పీసీబీ యోచిస్తోంది. బాబర్ గతంలో 2019 నుండి 2023 వరకు మూడు ఫార్మాట్లలోనూ జట్టుకు నాయకత్వం వహించారు. 2023 ప్రపంచకప్ తర్వాత తప్పుకున్న బాబర్, ఆపై కొద్దికాలం టీ20 కెప్టెన్‌గా తిరిగి వచ్చినా ఆ తర్వాత మళ్ళీ ఆ బాధ్యతల నుంచి వైదొలిగారు. మరోవైపు, షాన్ మసూద్‌కు జట్టులో ఏదైనా పరిపాలనాపరమైన లేదా ఇతర బాధ్యతలు అప్పగించే ఆలోచన కూడా ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి. ప్రస్తుతం జరుగుతున్న సిరీస్ తర్వాత కెప్టెన్ మార్పుపై అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉంది. బాబర్ ఆజామ్ రెండో టెస్టులో తన బ్యాటింగ్ ఫామ్‌ను నిరూపించుకుంటే, అతని కెప్టెన్సీ పట్టాభిషేకానికి ఇక అడ్డంకులు ఉండబోవని విశ్లేషకులు భావిస్తున్నారు.

## విమర్శకుల నోర్లు మూయించిన ప్రభ్‌సిమ్రాన్ సింగ్

**బలగం టీవి, న్యూఢిల్లీ**

ఈ ఐపీఎల్ సీజన్ మధ్యలో ప్రభ్‌సిమ్రాన్ సింగ్ సుమారు 10 కిలోల బరువు పెరిగాడని, దాని వల్ల ఆయన క్రీజులో చురుగ్గా కదలలేకపోతున్నారని సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది. గత మూడు ఇన్నింగ్స్‌ల్లో విఫలం కావడంతో ఈ విమర్శలు మరింత ఎక్కువయ్యాయి. అయితే ముంబై ఇండియన్స్‌తో జరిగిన పోరులో ఆయన తన అసాధారణ క్లాస్ ప్రదర్శించి అందరినీ ఆశ్చర్యపరిచాడు. బరువు పెరిగారన్న వారికి తన పరుగుల వేగంతోనే గట్టి జవాబు ఇచ్చాడు.ధర్మశాల స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్‌లో ప్రభ్‌సిమ్రాన్ సింగ్ విధ్వంసకర ఇన్నింగ్స్ ఆడాడు. కేవలం 32 బంతుల్లోనే 57 పరుగులు సాధించి ముంబై బౌలర్లను ఒత్తిడిలోకి నెట్టాడు. ఈ ఇన్నింగ్స్‌లో మొత్తం 10 బౌండరీలు (6 ఫోర్లు, 4 సిక్సర్లు) బాదాడు. 178.12 స్ట్రైక్ రేటుతో సాగిన ఈ మెరుపు ఇన్నింగ్స్ ప్రస్తుత సీజన్‌లో ఆయనకు ఐదవ అర్ధ సెంచరీ కావడం విశేషం. స్టాండ్స్‌లో కూర్చున్న పంజాబ్ కింగ్స్ యజమాని ప్రీతి జింటా, ప్రభ్‌సిమ్రాన్ షాట్లకు ముగ్ధురాలై నిలబడి చప్పట్లతో అభినందించాడు.ప్రభ్‌సిమ్రాన్ ఈ భారీ ఇన్నింగ్స్ ఆడటంలో అదృష్టం కూడా కీలక పాత్ర పోషించింది. ఈ మ్యాచ్‌లో ఆయనకు రెండుసార్లు లైఫ్ లభించింది. వ్యక్తిగత స్కోరు 5 పరుగుల వద్ద ఉన్నప్పుడు నమన్ ధీర్ క్యాచ్ జారవిడచగా, 28 పరుగుల వద్ద కార్బిన్ బాష్ మరో క్యాచ్ వదిలేశాడు. ఈ అవకాశాలను చక్కగా వినియోగించుకున్న ప్రభ్‌సిమ్రాన్, పంజాబ్ జట్టుకు బలమైన పునాది వేశాడు. ఈ ఇన్నింగ్స్‌తో ప్రభ్‌సిమ్రాన్ సింగ్ ఈ సీజన్‌లో పంజాబ్ కింగ్స్ తరపున అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్‌గా నిలిచాడు. ఇప్పటివరకు 12 మ్యాచ్‌లలో 43.90 సగటుతో 439 పరుగులు సాధించాడు. ముఖ్యంగా 170.15 స్ట్రైక్ రేటుతో పరుగులు రాబడుతూ జట్టుకు మెరుపు ఆరంభాలను అందిస్తున్నాడు.కీలక సమయంలో ప్రభ్‌సిమ్రాన్ ఫామ్‌లోకి రావడం పంజాబ్ జట్టులో కొత్త ఉత్సాహాన్ని నింపింది. విమర్శలను పట్టించుకోకుండా తన పని తాను చేసుకుపోతే విజయం వరిస్తుందని ఆయన నిరూపించాడు.



## శార్దూల్ బంతికి బిత్తరపోయిన శ్రేయస్ అయ్యర్

**బలగం టీవి, న్యూఢిల్లీ**



ధర్మశాల స్టేడియంలో జరుగుతున్న ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన పంజాబ్ కింగ్స్ ధాటిగా ఇన్నింగ్స్ ప్రారంభించింది. 11 ఓవర్లు ముగిసేసరికి పంజాబ్ ఒక వికెట్ నష్టానికి 107 పరుగులు చేసి పటిష్ట స్థితిలో ఉంది. ఈ దశలో ముంబై తాత్కాలిక కెప్టెన్ జస్ప్రీత్ బుమ్రా, 12వ ఓవర్ వేసే బాధ్యతను శార్దూల్ ఠాకూర్‌కు అప్పగించాడు. ఆ ఓవర్ రెండో బంతికే సెంచరీ దిశగా సాగుతున్న ప్రభ్‌సిమ్రాన్ సింగ్‌ను అవుట్ చేసిన శార్దూల్, ముంబైకి బ్రేక్ ఇచ్చాడు. ప్రభ్‌సిమ్రాన్ అవుట్ అయిన తర్వాత క్రీజులోకి వచ్చిన పంజాబ్ కెప్టెన్ శ్రేయస్ అయ్యర్, ఎదుర్కొన్న మొదటి బంతికే ఫోర్ కొట్టి శుభారంభం చేశాడు. అయితే ఆ మరుసటి బంతికే శార్దూల్ ఒక అద్భుతాన్ని సృష్టించాడు. గుడ్ లెంగ్త్‌లో పడిన బంతి అనూహ్యంగా స్వింగ్ అవుతూ ఆఫ్ స్టంప్‌ను గిరాటేసింది. ఆ బంతిని అంచనా వేయడంలో అయ్యర్ పూర్తిగా విఫలమయ్యాడు. బంతి వెళ్లిన వేగానికి, ఆ స్వింగ్‌కు అయ్యర్ నోరెళ్లబెట్టాడు. కనీసం బంతి ఎటు నుంచి వచ్చిందో కూడా అర్థం కాక అయోమయంలో ఉండిపోయాడు.అయ్యర్ వికెట్ తీసిన వెంటనే శార్దూల్ ఆనందానికి అవధులు లేవు. మైదానంలో పరుగెత్తుతూ తనదైన శైలిలో సంబరాలు చేసుకున్నాడు. ఒకే ఓవర్లో ఇద్దరు కీలక బ్యాటర్లను అవుట్ చేసి పంజాబ్‌ను కష్టాల్లోకి నెట్టాడు. ఈ వీడియో ఇప్పుడు క్రికెట్ అభిమానుల దృష్టిని ఆకర్షిస్తోంది. నెటిజన్లు దీనిని "సీజన్ ఉత్తమ బంతి"గా అభివర్ణిస్తున్నారు. కచ్చితమైన లైన్ అండ్ లెంగ్త్‌తో శార్దూల్ చేసిన ఈ ప్రయోగం ముంబై జట్టులో కొత్త ఉత్సాహాన్ని నింపింది.మంచి ఆరంభం లభించినా, శార్దూల్ వేసిన ఆ ఒక్క ఓవర్ పంజాబ్ స్కోరు వేగాన్ని తగ్గించింది. కెప్టెన్ అయ్యర్ తక్కువ పరుగులకే వెనుదిరగడం జట్టుపై ఒత్తిడి పెంచింది. బుమ్రా వ్యూహం పారడంతో ముంబై ఇండియన్స్ మ్యాచ్‌పై పట్టు సాధించింది. ఈ అద్భుతమైన డెలివరీ ఐపీఎల్ చరిత్రలో ఒక ప్రత్యేకమైన వికెట్‌గా నిలిచిపోతుందనడంలో సందేహం లేదు.

# బన్నీతో మరోమారు జతకట్టనున్న పూజా



బుట్టబొమ్మ పూజా హెగ్డే కు అదృష్టం పట్టిందని చెప్పడంలో ఎటువంటి అతిశయోక్తి లేదు. పూజా వరుసగా అరడజను సినిమాలు డిజాస్టర్ అందుకున్నాయి. ఈ లెక్కన పూజా హెగ్డే పేరు కూడా ఎక్కడా వినిపించ కూడదు. కానీ, అదేంటో ఈ చిన్నది వరుస ప్లాపులను అందుకున్నా అవకాశాలు మాత్రం కుప్పలు తెప్పలుగా వచ్చి పడుతున్నాయి. ప్రస్తుతం పూజా చేతిలో మూడు సినిమాలు ఉన్నాయి. ఇప్పటికే ఆమె నటించిన జననాయగన్ రిలీజ్ కి సిద్ధమవుతోంది. ఇది కాకుండా హిందీలో వరుణ్ ధావన్ సరసన తేరా హో జాన్ సినిమాలో పూజా నటిస్తోంది. ఇందులో అమ్మడి అందాల ఆరబోత చూసి ఫ్యాన్స్ షాక్ అవుతున్నారు. ఇక ఇప్పుడు పూజా మరో లక్కీ ఛాన్స్ ని పట్టేసిందని సమాచారం. అల్లు అర్జున్ ప్రస్తుతం వరుస సినిమాలతో బిజీగా ఉన్న విషయం తెల్సిందే. కోలీవుడ్ డైరెక్టర్ అట్లీ దర్శకత్వంలో బన్నీ నటిస్తోన్న రాకా శరవేగంగా షూటింగ్ జరుపుకొంటుంది. దీని తరువాత బన్నీ, మరో కోలీవుడ్ డైరెక్టర్ లోకేష్ కనగరాజ్ డైరెక్షన్ లో ఒక సినిమా చేయనున్న విషయం తెల్సిందే. ఈ చిత్రంలో బన్నీకి జోడిగా పూజా హెగ్డే పేరును అనుకుంటున్నారట. ఇప్పటికే బన్నీతో దువ్వాడ జగన్నాథం, అల వైకుంఠపురంలో లాంటి సినిమాల్లో నటించింది. ఇక ఇప్పుడు ముచ్చటగా మూడోసారి ఈ జంట రొమాన్స్ చేయనున్నారు. త్వరలోనే లోకేష్ .. పూజాను అధికారికంగా సినిమాలోకి ఆహ్వానించనున్నాడట. అయితే పూజా అదృష్టం బానే ఉన్నా.. మార్కెట్ పరంగా బన్నీకి రిస్క్ అని కొందరు చెప్పుకొస్తున్నారు.

# విడాకులకపై నటి మౌనీ రాయ్ చిరాకు



## అవాస్తవ ప్రచారాలు ఆపాలని పోస్ట్

తన భర్త సూరజ్ నంబియార్‌తో విడిపోతున్నట్టుగా వచ్చిన రూమర్లపై నటి మౌనీరాయ్ స్పందించారు. అవాస్తవాలను ప్రచారం చేయడం మానుకోవాలని సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు. తమ వ్యక్తిగత గోప్యతకు భంగం కలిగించొద్దని విజ్ఞప్తి చేశారు. మౌనీరాయ్, సూరజ్ ఇన్‌స్టాగ్రామ్‌లో ఒకరినొకరు అన్‌ఫాలో కావడంతో విడిపోతున్నారన్న ప్రచారం జరగ్గా నటి రియాక్ట్ అయ్యారు. సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండే మౌనీరాయ్ కొన్ని రోజులుగా భర్తతో ఉన్న ఫొటోలు పోస్ట్ చేయలేదు. మరోవైపు, సూరజ్ నంబియార్ ఇన్‌స్టాలో పెళ్లి ఫొటోలు కూడా కనిపించడం లేదు. ప్రస్తుతం ఆయన ఇన్‌స్టాగ్రామ్ ఖాతా అందుబాటులో లేకపోవడం గమనార్హం. అకౌంట్‌ను డిలీట్ చేసినట్టు సమాచారం. 2022 జనవరిలో సూరజ్ నంబియార్‌- మౌనీరాయ్ వివాహం జరిగింది. 'నాగిని' సీరియల్‌తో ఆకట్టుకున్న మౌనీరాయ్.. 'గోల్డ్', 'బ్రహ్మాస్త్ర' తదితర సినిమాల్లో నటించారు. 'కేజీయఫ్ చాప్టర్ 1' (కన్నడ), 'వేదా' (హిందీ) తదితర చిత్రాల్లో స్పెషల్ సాంగ్స్‌తో అలరించారు.

# శ్రీను వైట్లతో శర్వానంద్ మూవీ



టాలీవుడ్ హీరో శర్వానంద్ ప్రస్తుతం వరుస విజయాలతో మంచి జోష్‌లో ఉన్నారు. ఈ ఏడాది సంక్రాంతి కానుకగా విడుదలైన 'నారీ నారీ నడుమ మురారి' కుటుంబ ప్రేక్షకులను అలరించి బాక్సాఫీస్ వద్ద ఘన విజయాన్ని అందుకుంది. అలాగే ఇటీవల విడుదలైన మోటోక్రాస్ రేసింగ్ నేపథ్యంలో తెరకెక్కిన 'బైకర్' కూడా ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణ పొందింది. ఈ విజయాల ఊపుతో శర్వానంద్ ఇప్పుడు వరుసగా విభిన్న కథలను ఎంపిక చేసుకుంటూ ముందుకు సాగుతున్నారు. ప్రస్తుతం దర్శకుడు సంపత్ నంది తెరకెక్కిస్తున్న 'భోగి' చిత్రంలో శర్వానంద్ నటిస్తున్నారు. 1960ల నాటి నేపథ్యంలో రూపొందుతున్న ఈ చిత్రంలో అనుపమ పరమేశ్వరన్, డింపుల్ హాయతి కథానాయికలుగా కనిపించనున్నారు. ఈ సినిమా చిత్రీకరణ వేగంగా కొనసాగుతోంది. ఇదిలా ఉండగా, ఇప్పుడు శర్వానంద్ తన తదుపరి చిత్రాన్ని హాస్య కథా చిత్రాల దర్శకుడు శ్రీను వైట్లతో చేయడానికి సిద్ధమైనట్లు సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

ఈ సినిమాలో శ్రీను వైట్ల మార్క్ కామెడీకి తోడు 'కాలయానం' అనే వైవిధ్యమైన అంశాన్ని జోడిస్తున్నట్లు సమాచారం. హాస్యంతో పాటు సైన్స్ ఫిక్షన్ అంశాలు కలిస్తే ప్రేక్షకులకు కొత్త తరహా అనుభూతి కలుగుతుందని చిత్రబృందం భావిస్తున్నట్లు తెలుస్తోంది. మొదట ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ నిర్మించాల్సి ఉండగా, కొన్ని కారణాల వల్ల వారు ఈ ప్రాజెక్ట్ నుంచి తప్పుకున్నారని సమాచారం. ఇప్పుడు ఈ చిత్రాన్ని నిర్మాత అనిల్ సుంకర తన నిర్మాణ సంస్థ ద్వారా నిర్మించబోతున్నట్లు తెలుస్తోంది. 'నారీ నారీ నడుమ మురారి' తర్వాత శర్వానంద్-అనిల్ సుంకర కాంబినేషన్‌లో వస్తున్న రెండో సినిమా కావడంతో ఈ ప్రాజెక్ట్‌పై మంచి అంచనాలు నెలకొన్నాయి.జులై 2026 నుంచి ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుందని, వచ్చే సంక్రాంతికి చిత్రాన్ని విడుదల చేయాలనే ఆలోచనలో మేకర్స్ ఉన్నట్లు సమాచారం. ఇక హీరోయిన్ ఎంపిక విషయంలో కూడా ఆసక్తికర చర్చ సాగుతోంది. తొలుత పూజా హెగ్డే, మమితా బైజు పేర్లు వినిపించినా, తాజా సమాచారం ప్రకారం మిస్ ఇండియా రన్నరప్ మానస వారణాసిని హీరోయిన్‌గా ఎంపిక చేసే అవకాశాలు ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది. ఇటీవల 'కపుల్ ఫ్రెండ్లీ' చిత్రంతో గుర్తింపు తెచ్చుకున్న ఈ తెలుగమ్మాయి, శర్వానంద్ సరసన నటించేందుకు అంగీకరించినట్లు సినీ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది.ఒకవేళ ఇదే నిజమైతే శర్వానంద్-మానస జోడీ వెండితెరపై కొత్త ఫీల్‌ను తీసుకురావడం ఖాయమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రస్తుతం కథా పనులు తుది దశకు చేరుకున్నాయని, త్వరలోనే చిత్రబృందంపై అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉందని సమాచారం.



# రెజ్లింగ్ నేపథ్యంలో పెద్ది మూవీ




## దంగల్‌తో పోల్చకుండా జాగ్రత్తలు

ప్రస్తుతం రామ్ చరణ్ అభిమానులు ఎదురుచూస్తోన్న చిత్రం 'పెద్ది'. బుచ్చిబాబు దర్శకత్వంలో రానున్న ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. జూన్ 4న ప్రేక్షకుల ముందుకు రానుండడంతో టీమ్ ప్రచారం జోరు పెంచింది. ఈ నేపథ్యంలో తాజాగా 'పెద్ది' ఆర్ట్ డైరెక్టర్ అవినాశ్ కొల్లా ఓ ఇంటర్వ్యూలో మేకింగ్ విశేషాలు పంచుకున్నారు. ఈ సినిమా కూడా కుస్తీ (రెజ్లింగ్) నేపథ్యంలో సాగుతుంది. దీంతో ఇది బాలీవుడ్ బ్లాక్ బస్టర్ 'దంగల్'ను గుర్తుచేయకుండా ఉండటమే తమ ముందున్న ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ఈ సినిమా చూస్తున్నప్పుడు ప్రేక్షకులకు 'దంగల్' సినిమా అస్సలు గుర్తుకు రాకూడదనేది మా టీం ముందున్న అతిపెద్ద సవాలు. అందుకే సెట్ వర్క్ విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకున్నాం. ఎక్కడా దంగల్‌ను పోలిన సెట్‌లు వేయలేదు. అలా ఉండకూడదనేదే ప్రధాన ఉద్దేశంగా పని చేశాం. ప్రేక్షకులు ఇదివరకే ఇలాంటి సెట్స్ చూశామనే భావన కలగకుండా ఉండటానికి మేము ఎన్నో ప్రయోగాలు చేశాం. 'పెద్ది'లో కొన్ని కొత్త ఆలోచనలు కూడా చేశాం' అని అవినాశ్ కొల్లా చెప్పారు. తన కెరీర్‌లోనే ఇది అత్యుత్తమ స్క్రిప్ట్ అని, ఇలాంటి గొప్ప చిత్రానికి పనిచేసే అవకాశం రావడం తన అదృష్టమని తెలిపారు. కథలోని ఎమోషన్‌ను ప్రేక్షకులకు కనెక్ట్ అయ్యేలా చేయడంలో తన వంతు కృషి చేస్తున్నట్లు చెప్పారు. రామ్ చరణ్‌కు జోడీగా జాన్వీకపూర్ నటించిన ఈ సినిమాను రూ.300 కోట్ల భారీ బ్జడెట్‌తో రూపొందిస్తున్నారు. మే 18న దీని ట్రైలర్ విడుదల కానుంది. కన్నడ స్టార్ శివరాజ్‌కుమార్, దివ్యేందు, జగపతిబాబు, బొమన్ ఇరానీ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. శ్రుతిహాసన్ స్పెషల్ సాంగ్‌లో మెరవనున్నట్లు సమాచారం.




# కన్నడసీమలో తీవ్ర విషాదం

- గుండెపోటుతో నటుడు, నిర్మాత దిలీప్ రాజ్ మృతి

కన్నడ చిత్రపరిశ్రమలో తీవ్ర విషాదం నెలకొంది. ప్రముఖ నటుడు, నిర్మాత దిలీప్ రాజ్ (47) బుధవారం తెల్లవారుజామున గుండెపోటుతో కన్నుమూశారు. బెంగళూరులోని తన నివాసంలో ఉన్న సమయంలో ఆయనకు ఒక్కసారిగా గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు వెంటనే ఆసుపత్రికి తరలించారు. అయితే, అప్పటికే ఆయన మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు. దిలీప్ రాజ్ మృతితో శాండల్‌వుడ్ దిగ్భ్రాంతికి గురైంది. ఈ వార్త తెలుసుకున్న 'కాంతార' నటుడు రిషబ్ శెట్టి సోషల్ మీడియా వేదికగా దిలీప్ రాజ్‌కు నివాళులు అర్పించారు. 'ఒక మంచి నటుడు, దర్శకుడు, నిర్మాత.. అన్నింటికీ మించి ఒక అద్భుతమైన మనిషి. మనం కలిసిన సందర్భాలు తక్కువైనా, మీ వ్యక్తిత్వం నా గుండెల్లో ఎప్పటికీ చెరగని ముద్ర వేసింది. మీ ఆత్మకు శాంతి చేకూరాలి' అంటూ రిషబ్ శెట్టి ఎమోషనల్ పోస్ట్ చేశారు.దిలీప్ రాజ్ కేవలం నటుడిగానే కాకుండా నిర్మాతగా, డబ్బింగ్ ఆర్టిస్ట్‌గా కూడా కన్నడ ఇండస్ట్రీలో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. పునీత్ రాజ్‌కుమార్ నటించిన 'మిలనా' చిత్రంలో ఆయన పోషించిన ప్రతినాయకుడి పాత్ర ఆయన కెరీర్‌లోనే మైలురాయిగా నిలిచింది. 'యు-టర్న్', 'బాయ్‌ఫ్రెండ్' వంటి పలు విజయవంతమైన సినిమాలతో పాటు 'హిట్లర్ కళ్యాణ' వంటి పాపులర్ సీరియల్స్‌లోనూ ఆయన నటించారు. ఆయన మృతి పట్ల కన్నడ సినీ ప్రముఖులు మరియు అభిమానులు సంతాపం వ్యక్తం చేస్తున్నారు.

